ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 29.11.2025 | సంపుటి :12 సంచిక : 129 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## రేవంత్ రెడ్డి జిల్లాల బాట

### రెండేళ్ల పాలన పూర్తైన సందర్భంగా డిసెంబర్ 1 నుంచి 9 వరకు పర్యటన

- పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున పట్టణ ప్రాంతాలకే పరిమితం
- మొత్తం ఏడు జిల్లాల్లో పర్యటన సాగే అవకాశం

హైదరాబాద్ (జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 9 వరకు జిల్లాల్లో పర్యటించనున్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సీఎం ఈ పర్యటనలు చేయనున్నారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సీఎం పర్యటన పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ ఒకటో తేదీన మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో సీఎం పర్యటిస్తారని తెలిపారు. డిసెంబర్ 9లోపు ఏడు రోజులపాటు సీఎం జిల్లాల పర్యటన ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. మరో నాలుగు రోజులు ఆదిలాబాద్, నర్సంపేట, దేవరకొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో సీఎం పర్యటించే అవకాశముందని తెలుస్తోంది.తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదటి విడత వచ్చే నెల డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17న ఉంటుంది. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నారని తెలుస్తోంది. తాజాగా, సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.



## పంచాయతీ ఎన్నికలపై స్టే ఇవ్వలేం

### ఎలక్షన్ ప్రక్రియ మొదలైనందున ఈ దశలో నిలుపుదల చేయలేం: హైకోర్టు




హైదరాబాద్ (జనంసాక్షి): పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో– 46పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పినట్లు హైకోర్టు గుర్తు చేసింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ చెప్పుకొచ్చారు. అయితే, ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని మరోసారి స్పష్టం చేసింది. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం. అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని పిటిషనర్ న్యాయ వాది కోరారు. అందుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కులసంఘాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని పిటిషనర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల ప్రక్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్

మిగతా 2లో..

## దీక్షను సెంటిమెంట్ కోసం వాడుకుంటున్నారు

### కేసీఆర్ దీక్షలతో తెలంగాణ రాలేదు
### సోనియా దయవల్లే తెలంగాణ సాకారం

- ఎస్సీ,ఎస్టీ, బిసి విద్యార్థుల త్యాగాలు మరువలేం
- బీసీ రిజర్వేషన్ల అంశం ముగియలేదు
- మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కెసిఆర్ దొంగ దీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి

మిగతా 2లో..

## 50మంది నైజీరియన్ల అరెస్ట్‌తో.. కదులుతున్న డొంక

### తెలంగాణ ఈగిల్ భారీ ఆపరేషన్ • డ్రగ్స్ ముఠాలో 2వేలమంది పెడ్లర్లు

హైదరాబాద్(జనంసాక్షి): డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ఈగల్ టీమ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్, ఎన్‌సీబీ, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యూఢిల్లీలోని 20 ప్రాంతాల్లో.. గడువు తీరిన 50 మందికిపైగా నైజీరియన్లు ఉంటున్నట్లు గుర్తించింది. వారిని ఈ టీమ్ అదుపులోకి తీసుకుంది.

మిగతా 2లో..

## నయా భారత్ ఎవరి ముందు తలవంచదు

### దేశ రక్షణ విషయంలో ఎన్నటికీ వెనుకడుగు వేయదు

మన సుదర్శన చక్రం.. శత్రువులను నాశనం చేస్తుంది
ఆపరేషన్ సిందూర్‌లో మన సంకల్పాన్ని ప్రపంచం చూసింది
భారత్ వైపు అగ్రదేశాల చూపు • ఉడుపిలో ప్రధాని మోదీ



### ప్రపంచంలోనే ఎత్తయిన శ్రీరాముడి విగ్రహం

12లో..

దక్షిణ గోవాలో ఆవిష్కరించిన ప్రధాని మోదీ

పనాజీ(జనంసాక్షి):నయా భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదని, పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. శుక్రవారం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొని గీతా పారాయణం చేశారు. అనంతరం భక్తులు, గాయకులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు."గీతలో శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి యుగానికి సంబంధించినవి. మన జాతీయ విధానాన్ని అవి నిర్దేశిస్తాయి. ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని కృష్ణుడు బోధించాడు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్',

మిగతా 2లో..



## కోకాపేట భూములకు రెక్కలు

### నియోపోలీస్‌లో ఎకరం రూ.151.25 కోట్లు

హైదరాబాద్(జనంసాక్షి):భూమిలో బంగారం పండుతుందని అంటుంటారు. కానీ భూములు బంగారమయ్యాయని ఇప్పుడు నిరూపితం అయ్యింది. హైదరాబాద్ లో భూముల విలువ బంగారాన్ని మించి పెరిగిపోయి రికార్డు సృష్టిస్తున్నాయి. కోకాపేట్ పరిసర ప్రాంతాల్లో కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈ వేలంలో కోకాపేట నియోపోలీస్ భూములు రికార్డు స్థాయి ధర పలికాయి. రెండో విడత వేలంలో ఎకరాకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా.. 151 కోట్ల రూపాయలు పలికి హెచ్ఎండిఎకు కోట్లు కురిపించాయి. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేటలో భూములు.. కో అంటే కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ–వేలంలో

మిగతా 2లో..



## జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీ విలీనానికి బీజేపీ వ్యతిరేకమట

హైదరాబాద్(జనంసాక్షి): జీహెచ్ఎంసీలో పలు మున్సిపాలిటీలను విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు వెల్లడించారు. మున్సిపాలిటీ విలీనం అశాస్త్రీయంగా ఉందన్నారు. మజ్లిస్ పార్టీకి లబ్ధి చేకూర్చేందుకే మున్సిపాలిటీలను విలీనం చేస్తున్నారని ఆరోపించారు. విలీనంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

## కామారెడ్డిలో కవిత రైల్ రోకో

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు డిమాండ్
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

కామారెడ్డి(జనంసాక్షి):కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట

మిగతా 2లో..

## రాష్ట్రాల అధికారాలను హరించేదిగా కేంద్ర విత్తన బిల్లు



### కేంద్రంపై మంత్రి తుమ్మల మండిపాటు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేందప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు.. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు–2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

### ఢిల్లీ పేలుడు కేసులో సీన్ రీక్రియేషన్


2లో..

అల్-ఫలా విశ్వవిద్యాలయానికి డాక్టర్ షాహిన్

### భారత్‌కు పుతిన్

డిసెంబరు 4-5 తేదీల్లో పర్యటన

2లో..



ఎన్నికల కమిషన్ ఏంచేస్తుందో..!

## సర్పంచ్ పదవి బస్తీమే సవాల్

- బహిరంగ వేలం
- నిర్లజ్జగా రూ.20లక్షలకు దక్కించుకున్న నేత



ఖమ్మం(జనంసాక్షి): తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్పంచి పదవి దక్కించుకోవడం కోసం పలువురు నేతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల ఆ పదవిని బహిరంగ వేలం వేస్తున్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగుగూడెం పంచాయతీ సర్పంచి పదవికి బహిరంగ వేలం వేశారు. వేలంలో ఏడుగురు అభ్యర్థులు పోటీపడగా.. వారిలో అత్యధికంగా ఒకరు రూ. 20లక్షలకు సర్పంచి పదవిని దక్కించుకున్నారు. గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి వేలంలో వచ్చిన నగదు ఖర్చు చేయనున్నట్టు గ్రామస్థులు

మిగతా 2లో..

## పేద దేశాల నుంచి వలసల నిలిపివేత



### బాంబు పేల్చిన ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పేద దేశాల నుంచి అగ్రరాజ్యానికి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. మరోవైపు, వలసదారులకు అన్నిరకాల ప్రభుత్వ సబ్సిడీలు, ఫెడరల్ బెనిఫిట్స్‌ను కూడా నిలివేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు."మనం (అమెరికా) సాంకేతికంగా ముందుకెళుతున్నప్పటికీ.. మన ఇమిగ్రేషన్ విధానం ఆ ప్రయోజనాలను, చాలామంది జీవన పరిస్థితులను దెబ్బతీస్తోంది. అందుకే.. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు వీలుగా.. థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తున్నా. జో బైడెన్ ఆటోపెన్‌తో సంతకం చేసిన లక్షల మంది అక్రమ అడ్మిషన్లను రద్దు చేయనున్నాం. అమెరికాకు ఆస్తి కాని లేదా మన దేశాన్ని ప్రేమించని వ్యక్తులను ఇక్కడి నుంచి పంపించేస్తాం. అమెరికాయేతర పౌరులందరికీ ఫెడరల్ ప్రయోజనాలు, సబ్సిడీలను నిలిపివేస్తాం. దేశ ప్రశాంతతకు భంగం కలిగించే, మన భద్రతకు

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org

శనివారం 29.11.2025



## ఢిల్లీ కాలుష్యంపై ప్రణాళిక ఏదీ?


- మోడీపై రాహుల్ విమర్శలు
- పార్లమెంటులో చర్చిస్తామని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ముప్పు తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నగర వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, పిల్లల పరిస్థితి అయితే మరీ దయనీయంగా మారింది. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇక ప్రజలు బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం మరింత దారుణంగా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఢిల్లీ వాసులు కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఢిల్లీలో జీవించలేక పోతున్నామని వాపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఢిల్లీలో అత్యవసర ఆరోగ్య పరిస్థితిని విధించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఢిల్లీ కాలుష్యంపై చర్చ జరగాల్సిందేనని కోరారు. నేను కలిసిన ప్రతి తల్లి నాకు ఒకటే చెప్పారు. బిడ్డలు విషపూరిత గాలిని పీల్చుకుంటున్నారని. నీరసించి పోవడమే కాకుండా భయపడు తున్నారని చెప్పారు. ఆందోళనగా ఉంటున్నారని వాపోయారు. మోడీ జీ.. భారతదేశ పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మీరెలా మౌనంగా ఉండగల్గుతున్నారు? మీ ప్రభుత్వానికి ఎందుకు అత్యవసర ప్రణాళిక లేదు. జవాబుదారీతనం లేదా? అంటూ రాహుల్ గాంధీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిని పరిష్కరించడానికి దేశానికి ఒక కార్యాచరణ ప్రణాళిక అవసరమన్నారు. మన పిల్లలు స్వచ్ఛమైన గాలికి అర్హులు- సాకులు, పరధ్యానాలు కాదని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చర్చ జరపాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. డిసెంబర్ 1 నుంచే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. నవంబర్ 30న ఆల్ పార్టీ మీటింగ్ జరగనుంది.

## సర్పంచ్ పదవి బస్తీమే సవాల్

తెలిపారు. పూర్తిగా గిరిజన గ్రామమైన జోగుగూడెంలో 1350 మంది జనాభా ఉండగా. 800 మంది ఓటర్లు ఉన్నారు. రెండో దశలో ఈగ్రామంలో పోలింగ్ జరగనుంది. ఈనెల 30 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. సర్పంచి పదవికి వేలం పాట అనంతరం గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు.

## షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ



- అవినీతి కేసులో 21 ఏళ్ల జైలు
- కుమారుడు, కుమార్తెకూ ఐదేళ్ల శిక్ష

**ఢాకా(జనంసాక్షి):** బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఢాకా న్యాయస్థానం గురువారం మూడు అవినీతి కేసుల్లో ఆమెకు 21 ఏళ్ల జైలు శిక్ష విధించింది.ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టు భూకేటాయింపుల్లో అవతవకలకు పాల్పడినట్లు అవినీతి నిరోధక శాఖ ఈ మూడు కేసులు నమోదు చేసింది. మార్చి 10న చార్జిషీట్లను సమర్పించింది. ఒక్కో కేసులో ఏడేళ్ల చొప్పున 21 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ కోర్టు తీర్పుచెప్పింది. ఎటువంటి దరఖాస్తులు లేకుండా, తన అధికార పరిధిని మించి హసీనా ప్లాట్‌ను కేటాయించారని కోర్టు పేర్కొంది. వరుసగా శిక్షలు అమలులో ఉంటాయని వెల్లడించింది. హసీనా గైర్హాజరీలో ఉండగా ఆమె పరారీలో ఉన్న వ్యక్తిగా పేర్కొంటూ కోర్టు తీర్పునిచ్చింది. ఒక్కో కేసులో ఒక లక్ష రూపాయల జరిమానా చెల్లించలేకపోతే మరో 18 నెలల జైలు శిక్ష విధించనున్నట్లు వివరించింది.హసీనా కుమారుడు, కుమార్తె సాజిబ్ వాజిద్ జాయ్, సైమా వాజిద్ పుతుల్‌లపై దాఖలైన కేసుల్లోనూ ఇరువురికి ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. ఇద్దరికీ లక్ష చొప్పున జరిమానా విధించింది. చెల్లించని పక్షంలో ఒక నెల ఎక్కువ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి చెప్పారు. అయితే విచారణ చట్టబద్ధతను హసీనా కొట్టిపారేసారు. తనపై ఉన్న అభియోగాలు రాజకీయపూరితమైన వని హసీనా అభిప్రాయపడ్డారు. కోర్టు మోసపూరితమైనదని ఆరోపించారు .గతేడాది ఆగస్టు 5 నుంచి హసీనా భారత్‌లో నివసిస్తున్నారు. గతేడాది జూలై, ఆగస్టు మధ్య విద్యార్థుల నేతృత్వంలో జరిగిన తిరుగుబాటును హింసాత్మకంగా అణచివేయాలని ఆదేశించినందుకు హసీనాను దోషిగా నిర్ధారించిన ట్రిబ్యునల్ ఈ నెల 17న ఆమెకు మరణశిక్ష విధించింది. వారం రోజులకే ఈ తీర్పు వచ్చింది. హసీనా కుటుంబంతోపాటు గృహ నిర్మాణశాఖ మాజీ మంత్రి షరీఫ్ అహ్మద్, శాఖ అధికారులతో సహా 20 మందిపై ఈ కేసుల్లో విచారణ జరిగింది. ఒకరికి తప్ప 19 మందికి వేర్వేరు శిక్షలు పడ్డాయి.

## థాయ్‌లాండ్‌లో వరదలు..

### 145 మంది మృతి



**బ్యాంకాక్(జనంసాక్షి):** థాయ్‌లాండ్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. దక్షిణ థాయ్‌లాండ్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇప్పటి వరకు 145 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఈ వరదలకు 12 లక్షలకు పైగా ఇళ్లు దెబ్బతిన్నాయని.. అనేక మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను భద్రతా బలగాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. శిథిలాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రహదారుల వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

## శ్రీలంక వరదల్లో 56 మంది మృతి



**కొలంబో(జనంసాక్షి):** శ్రీలంకలోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దిత్వా తుపాను కారణంగా ఆకస్మిక వరదలు కొండచరియలు విరిగిపడడంతో 56 మంది మరణించినట్లు ప్రభుత్వ విపత్తు నిర్వహణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో 21 మంది గల్లంతయినట్లు తెలిపారు. వరద ధాటికి 600కి పైగా ఇళ్లు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కొట్టుకుపోయాయి. అనేక రహదారులు, పొలాలు జల దిగ్బంధమయ్యాయి. వరదల్లో గల్లంతైన వారికోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ఆపరేషన్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. దేశంలోని అనేక నగరాలు వరదలో చిక్కుకుపోవడంతో శ్రీలంక ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను మూసివేసింది. రైలు సర్వీసులు నిలిపివేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. దేశంలోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్ష ముప్పు ఉన్నట్లు స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.శ్రీలంకలో సంభవించిన వరదల్లో దాదాపు 56మంది ప్రాణాలు కోల్పోవడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. కష్ట సమయంలో పొరుగు దేశానికి స్నేహ హస్తం అందించేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో అత్యవసర మానవతా సాయం పంపినట్లు ప్రకటించారు.

# పంచాయతీ ఎన్నికలపై స్టే ఇవ్వలేం

చేస్తున్నారని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. బీసీ రిజర్వేషన్లకు ఆరు వారాల గడువు బీసీ రిజర్వేషన్ల అంశానికి సంబంధించి 6 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు రిప్లై కౌంటర్ దాఖలు చేయడానికి పిటిషనర్‌కు 2 వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీతో పాటు పురపాలక సంఘాల ఎన్నికలు కూడా జరగనున్నాయని, ఆ ఎన్నికల్లోపు ఈ అంశం తేల్చే విధంగా వీలైనంత త్వరగా విచారణను చేపట్టాలని



పిటిషనర్ న్యాయవాది కోరారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. తదుపరి విచారణలో ఈ అంశాన్ని పరిశీలిద్దామన్న హైకోర్టు విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్?ను రాష్ట్ర ఎన్నికల కమిషన్? మంగళవారం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు స్థానాలకు మొత్తం 3 విడతల్లో ఎన్నికలు ఎస్ఈసీ ఎన్నికలు నిర్వహించనుంది. డిసెంబరు 11, 14, 17వ తేదీల్లో పోలింగ్? నిర్వహించనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లను ఇప్పటినుంచే ప్రారంభించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్? నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుంది.

## కోకాపేట భూములకు రెక్కలు

ఎకరం రూ.151.25 కోట్ల రికార్డు ధర పలికింది. నియోపోలిస్‌లోని ప్లాట్ నంబర్ 15, 16లోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా.. రూ.1,353 కోట్లు ఆదాయం లభించింది. హైదరాబాద్ కోకాపేట్ లో ఉన్న భూముల రెండో విడత ఈ-వేలం శుక్రవారం ముగిసింది. నియోపోలిస్ దగ్గర ఉన్న ప్లాట్ నెంబర్ 15 లో ఎకరానికి 151 కోట్ల 25 లక్షలు పలికిన ఎకరం ధర పలికి రికార్డు సృష్టించింది. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16 లో ఎకరం ధర 147 కోట్ల 75 లక్షలు పలికింది.రెండో విడత వేలంలో భాగంగా 9.06 ఎకరాల భూమిని వేలం వేసిన ఊఓఆం .. 1,3 కోట్ల 52 లక్షల ఆదాయాన్ని పొందింది. ఎ÷-లాట్ నెంబర్ 15 లో 4.03 ఎకరాలకు గాను 609 కోట్ల 55 లక్షలు పొందినట్లు ఊఓఆం అధికారులు తెలిపారు. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16 లో 5.03 ఎకరాలకు గాను 743 కోట్లు పొందినట్లు పేర్కొన్నారు. నవంబర్ 25న జరిగిన మొదటి విడత వేలంలో రికార్డు స్థాయిలో ఎకరానికి 137.25 కోట్లు పలికిన సంగతి తెలిసిందే.. కోకాపేట నియోపోలిస్ లో 29 ఎకరాలతో పాటు మూసాపేట దగ్గర ఉన్న 16 ఎకరాల భూములకు వేలం వేసేందుకు సిద్ధమైంది హెచ్ఎండీఏ.డిసెంబర్ 3, 5 తేదీల్లో మిగతా ఎ÷-లాట్లకు ఈ వేలం జరగనుంది. కోకాపేట్ నియోపోలిస్ ప్లాట్లకు ఎకరానికి 99 కోట్లు, కోకాపేట గోల్డెన్ మైల్ ప్లాట్లకు 70 కోట్లు, మూసాపేట్ ప్లాట్ల కు 75 కోట్ల చొప్పున ప్రారంభ ధరను నిర్ణయించింది హెచ్ఎండీఏ. కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేసే వారికి ఆకాశమే హద్దుగా ఎన్ని ఫ్లోర్లయినా నిర్మించుకునేందుకు అనుమతులు ఇస్తారు. ఈ లేఅవుట్‌లో అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. దాదాపు 300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.40 ఎకరాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్స్, 45 మీ. వెడల్పైన రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలను కల్పించారు. అలాగే కమర్షియల్, రెసిడెన్సీ, ఎంటర్‌టైన్‌మెంట్‌ల అవసరాలకు భవనాలు నిర్మించుకునేందుకు అనుమతించనున్నారు.

## కామారెడ్డిలో కవిత రైల్వే రోకో

జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారంకామారెడ్డిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అనంతరం వారు ట్రాక్‌పై కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు అప్రమత్తమైన కామారెడ్డి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి జాగృతి నేతలను అక్కడ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో కవితను అరెస్ట్ చేశారు. ఈ పెనుగులాటలో కవిత చేతికి స్వల్ప గాయమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు అడ్డుకుంటూ కుట్రలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ఇకపోతే కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ టూరిజం, కౌలాస్ కోట ఓ స్పాట్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. మొంథా తుఫానుతో జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని చెప్పుకొచ్చారు. జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జిన్నింగ్ మిల్ కోసం జాగృతి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పేరుతో డబ్బులు తీసుకోవద్దని సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఆయా సమస్యలపై పార్టీలను ప్రశ్నించాలని సూచించారు. రోడ్ల కోసం ఆందోళన చేస్తుంటే జుక్కల్ ఎమ్మెల్యే యువకుల మీద కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. యువతపై నమోదైన కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఉద్యోగులను తిరిగి స్వస్థలాలకు పంపించాలని సూచించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు.

## దీక్షను సెంటిమెంట్ కోసం వాడుకుంటున్నారు

సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో కేసీఆర్, ఆయన పార్టీకి నూకలు చెల్లిపోయాయని భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం బీజేపీ అడ్డు పడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

## కదులుతున్న డొంక

నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నం తదితర నగరాల్లో ఈ డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్న కీలక నిందితులను అరెస్ట్ చేసింది.నాలుగు ప్రాంతాల్లో 5,340 ఎక్స్ సిటీ మాత్రలు, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథాంఫెటమైన్‌ను సీజ్ చేసింది. ఢిల్లీలోని 59 మ్యూల్ ఖాతాలతోపాటు 16 డ్రగ్స్ కేంద్రాలను గుర్తించింది. ఇక నైజీరియాకు చెందిన 107 బ్యాంకు ఖాతాలు ఈగల్ టీమ్ స్తంభింప జేసింది. మల్నాడు రెస్టారెంట్, మహీంద్రా యూనివర్సిటీ కేసులో నైజీరియన్ నిక్‌ను అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా ఈ ముఠాతో దాదాపు 2 వేలకు పైగా డ్రగ్స్ వినియోగదారులు,పెడ్లర్లు ఉన్నట్లు ఈగల్ టీం గుర్తించింది. ఢిల్లీ నుంచి డ్రగ్స్ పార్శిళ్లు.. బూట్లు, దుస్తులు, కాస్మోటిక్ వస్తువులు, చెప్పులు మధ్యలో డ్రగ్స్ పెట్టి కొరియర్ ద్వారా సప్లై చేసినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. శ్రీ మారుతి కొరియర్స్, డీటీడీసీ, ప్రొఫెషనల్ కొరియర్స్, షిప్ రాకెట్, ఇండియా పోస్ట్, ఢిల్లీ వేరీ, బ్లూ డార్ట్, ట్రాక్ ఆన్ తదితర కొరియర్స్ నెట్‌వర్క్‌ను ఈ నైజీరియన్ ముఠా ఉపయోగించినట్లు ఈ కేసు విచారణలో బహిర్గతమైంది. రికొద్ది రోజుల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్‌కు ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ డ్రగ్స్ ఆపరేషన్‌ను ఛేదించింది. ఢిల్లీలో అరెస్ట్ చేసిన 50 మందిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఈ టీమ్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. వీరిని హైదరాబాద్‌కు తరలించిన తర్వాత కోర్టులో హాజరుపరచనుంది. అనంతరం వీరిని మరింత లోతుగా విచారణ జరపనుందని తెలుస్తోంది. ఈ విచారణలో మరిన్నీ కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని ఈగల్ టీమ్ భావిస్తోంది.

## భారత్‌కు పుతిన్

### డిసెంబరు 4-5 తేదీల్లో పర్యటన

**మాస్కో(జనంసాక్షి):**రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. డిసెంబరు 4-5 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు అమలుచేస్తోన్న వేళ పుతిన్ రాక ప్రాధాన్యం సంతరించుకుంది.ప్రధాని నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు ఆయన మన దేశంలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మోదీ-పుతిన్ ద్వైపాక్షికంగా భేటీ కానున్నారు. ఆయన గౌరవార్థం భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రత్యేక విందు ఇవ్వనున్నారు. పుతిన్ పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రష్యా ఆర్థిక వ్యవస్థకు భవన నిర్మాణం, జౌళి, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నిపుణుల కొరత ఏర్పడింది. ఈ క్రమంలో 70వేల మందికి పైగా భారతీయ కార్మికులు, నిపుణులకు రష్యాలో ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఈ మేరకు రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. 2021 తర్వాత పుతిన్ భారత్‌కు రావడం మళ్లీ ఇప్పుడే. గతేడాది ప్రధాని మోదీ పుతిన్ రెండుసార్లు భేటీ అయ్యారు. 2024 జులైలో ఇరుదేశాల శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ప్రధాని మోదీ రష్యాకు వెళ్లారు. ఆ సందర్భంలో మోదీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్' అందుకున్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా రష్యాలోని కజాన్‌లో వీరిద్దరూ మరోసారి సమావేశమయ్యారు. ఇక, ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో పుతిన్-మోదీ భేటీ అయి పలు అంశాలపై చర్చించిన సంగతి తెలిసిందే.

# నయా భారత్ ఎవరి ముందు తలవంచదు

'సర్వజన్ హితయ' అనే నినాదాలు గీత నుంచి స్ఫూర్తి పొందినవే. మహిళల రక్షణపై శ్రీ కృష్ణుడి సందేశమే.. రిజర్వేషన్ల చట్టానికి మార్గనిర్దేశనం. శాంతి, సత్యాన్ని సాధించడం కోసం అవసరమైతే దురాగతాలకు పాల్పడే వారిని అణచివేయాలని గీత మనకు బోధిస్తుంది" అని మోదీ తెలిపారు."గతంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు ఏమీ చేయకుండా చూస్తుండిపోయాయి. కానీ, నయా భారత్ అలా కాదు. ఎవరి ముందు తలవంచదు. దేశ రక్షణ విషయంలో ఎన్నటికీ వెనుకడుగు వేయదు. ఆపరేషన్ సిందూర్‌లో మన సంకల్పాన్ని ప్రపంచం చూసింది. మన మిషన్ సుదర్శన చక్ర.. శత్రువులను నాశనం చేస్తుంది" అని మోదీ వెల్లడించారు. శ్రీకృష్ణుడి స్ఫూర్తితో దేశానికి సుదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గతంలో ప్రధాని తెలిపిన సంగతి తెలిసిందే. రాబోయే పదేళ్లలో దేశంలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా పూర్తిస్థాయి సురక్షా కవచం ఏర్పాటు చేయడమే ఈ మిషన్ ఉద్దేశం. అంతకు ముందు ఉడుపిలో మోదీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం కృష్ణ ఆలయానికి చేరుకున్న ప్రధానికి పుతిగే మఠాధిపతి సుగుణేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అష్ట మఠాధిపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కనకన కిండి (కిటికీ) నుంచి శ్రీకృష్ణుడి మూలవిరాట్‌ను మోదీ దర్శించుకున్నారు. అనంతరం లక్ష కంఠ భగవద్గీత పారాయణంలో ప్రధాని పాల్గొన్నారు. గీతలోని 10 శ్లోకాలను ఆయన అలవోకగా పఠించారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. మోదీ అర్జునుడంటూ కొనియాడారు. ప్రధాని సేవలను ప్రశంసిస్తూ.. 'భారత భాగ్య విధాత' అనే బిరుదును ప్రదానం చేశారు.

## ఢిల్లీ పేలుడు కేసులో సీన్ రీక్రియేషన్

### అల్-ఫలా విశ్వవిద్యాలయానికి డాక్టర్ షాహిన్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం గా సాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తును విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహిన్ ను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సీన్ రీక్రియేషన్ కోసం నిందితులతో సంబంధమున్న అల్-ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు డాక్టర్ షాహిన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. తామంతా కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు ఆమె అంగీకరించింది. వీటిని ఉపయోగించి పాక్‌కు చెందిన జైషే ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపింది. గురువారం విచారణలో భాగంగా డాక్టర్ షాహిన్ తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. అల్-ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశంలో వారి వివాహం జరిగినట్లు తెలిపాడన్నారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడు గురు నిందితులను లఖ్‌నవూ, కాన్పూర్, సహరన్‌పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్‌లకు తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు షాహిన్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించడంతో అల్-ఫలాలోని ఇతర మహిళా వైద్యులను కూడా ఆమె ప్రభావితం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. యూనివర్సిటీలో ఎవరైనా ఉగ్ర మద్దతుదారులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. వారిని గుర్తించడానికి నిఘా వర్గాలు పని చేస్తున్నాయన్నారు. అల్-ఫలాలో దర్యాప్తు తర్వాత తదుపరి విచారణ కోసం షాహిన్‌ను లఖ్‌నవూ, కాన్పూర్‌లకు తీసుకువెళ్లనున్నారు. అనుమానితులకు ఆయా ప్రదేశాల్లోని వ్యక్తులతో ఉన్న పరిచయాలు, ఎవరెవరు వారికి సహకరించారు అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్‌తో మరికొందరు వైద్యులకు కూడా సంబంధాలు ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఉగ్ర మాడ్యూల్ ఆసుపత్రులు, క్లినిక్‌ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. సహాయం కోసం విద్యావంతులైన వ్యక్తులను నియమించుకుంటున్నట్లు గుర్తించామన్నారు.

## భారత న్యాయనిపుణుడికి అరుదైన గౌరవం..

### 'ఇజ్రాయెల్-పాలస్తీనా' కమిషన్‌కు నేతృత్వం

న్యూయార్క్(జనంసాక్షి):ఒడిశా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మురళీధర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో మానవహక్కుల ఉల్లంఘనపై విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన కీలక ప్యానెల్‌కు ఆయన నేతృత్వం వహించనున్నారు. ఇజ్రాయెల్-గాజా ఉద్రిక్తతలను ప్రపంచం మొత్తం ఆసక్తిగా చూస్తున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన ఒక మానవ హక్కుల బృందానికి భారతీయ న్యాయమూర్తి నేతృత్వం వహించడం విశేషం.ఇజ్రాయెల్, 'ఆక్రమిత పాలస్తీనా ప్రాంతం'లో మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరపడం ఈ ప్యానెల్ ప్రధాన బాధ్యత. ఈ స్వతంత్ర అంతర్జాతీయ విచారణా కమిషన్‌కు గతంలో బ్రెజిల్ న్యాయనిపుణుడు పాలో సెర్గియో పిన్హీరో నేతృత్వం వహించారు. ఇజ్రాయెల్-పాలస్తీనా సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న వేళ జస్టిస్ మురళీధర్ ఇవ్వబోయే నివేదికలకు చాలా ప్రాధాన్యం ఉండనుంది.కీలక తీర్పులు, ప్రగతిశీల ఆలోచనలతో జస్టిస్ మురళీధర్ గుర్తింపు పొందారు. 1984లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత దిల్లీ హైకోర్టుకు మారారు.

## పేద దేశాల నుంచి వలసల నిలిపివేత..

ముప్పుగా మారే వారిని బహిష్కరిస్తాం. తిరోగమన వలస విధానంతోనే ఈ లక్ష్యాలను సాధించగలం" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.శ్వేత సౌధానికి రెండు బ్లాకుల దూరంలో బుధవారం మధ్యాహ్నం (అమెరికా కాలమానం ప్రకారం) కాల్పులు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నేషనల్ గార్డ్‌కు చెందిన ఓ సభ్యురాలు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు గాయపడ్డారు. నిందితుడిని అఫ్గాన్‌కు చెందిన రెహ్మానుల్లా లకన్‌వాల్‌గా గుర్తించారు. సీఐఏ మద్దతు ఉన్న అఫ్గాన్ ప్రత్యేక సైనిక విభాగంలో అతడు కొన్నాళ్లు పనిచేసి అమెరికాకు వలస వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ వలసలపై తాజా నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. అఫ్గాన్‌తో సహా మరో 18 దేశాలకు చెందిన గ్రీన్ కార్డ్ హోల్డర్స్‌ను అధికారులు సమీక్షించనున్నారు. పేద, అభివృద్ధి అంతగా లేని దేశాలను థర్డ్ వరల్డ్ కంట్రీస్‌గా పిలిచేవారు. దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని అనేక దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం వీటిని తక్కువ ఆదాయం కలిగిన దేశాలుగా పేర్కొంటున్నారు. దక్షిణ సూడాన్, సోమాలియా, నైగర్, బుర్కినా ఫాసో, బురుండి, అఫ్గానిస్థాన్, మడగాస్కర్, ఇథియోపియా, లైబీరియా, పాకిస్థాన్, సిరియా, ఉగాండా వంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి.

## త్వరలో వెనెజువెలా భూభాగంపై ఆపరేషన్లు : ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):వెనెజువెలాకు చెందిన మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడానికి అమెరికా సిద్ధమవుతోందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అతిత్వరలో వెనెజువెలా భూభాగంలో ఆపరేషన్లు చేపడతామన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి సముద్రం మీదుగా ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోతోందని.. దీంతో వాటిని ఆపడానికి భూభాగంపై నుంచే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైనా తమ దేశంలోకి మాదక ద్రవ్యాలు సరఫరా చేయడాన్ని ఆపాలని వెనెజువెలాను మరోసారి హెచ్చరించారు. అమెరికా ఇప్పటికే కరేబియన్ సముద్రంలో భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది. అమెరికా దళాలు జరిపిన దాడుల్లో 80మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తాజాగా ట్రంప్ చేసిన ప్రకటనతో.. ఏ క్షణమైనా అగ్రరాజ్యం వెనెజువెలా భూభాగంపై దాడి చేసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెనెజువెలాలో అమెరికా దళాలు చొరబడొచ్చని ప్రచారం జరుగుతోంది. వెనెజువెలా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు.

## గ్రీన్‌కార్డు ఇంటర్వ్యూలని పిలిచి అరెస్టులు..!

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికాలో శాశ్వత నివాసానికి జారీ చేసే గ్రీన్ కార్డు కోసం ఎంతోమంది ఎదురుచూస్తుంటారు. అలాంటివారే లక్ష్యంగా గ్రీన్ కార్డు ఇంటర్వ్యూలకు అని పిలిపించి.. భద్రతాధికారులు అరెస్ట్‌లు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అమెరికా మీడియాలో వచ్చిన కథనాలు ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఆ కథనాల ప్రకారం.. శాన్‌డియాగోలోని యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ కార్యాలయంలో గ్రీన్ కార్డు ఇంటర్వ్యూ కోసం వచ్చిన ఓ వ్యక్తితో పాటు వారి అమెరికన్ భాగస్వామిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలోనే అరెస్టుల విషయం వెలుగులోకి వచ్చింది. వీసా గడువు ముగిసినా కూడా ఇంకా దేశంలోనే ఉన్నవారినే లక్ష్యంగా చేసుకొని ఈ అరెస్టులు జరుగుతున్నాయని ఇమిగ్రేషన్ న్యాయవాది సమన్ నస్సేరి తెలిపారు. 'ఐసీఈ, యూఎస్‌సీఐఎస్‌లు ఒక విధానాన్ని అమలుచేస్తున్నాయి. వీటి కార్యాలయాల్లో వీసా గడువు ముగిసిన వారిని అదుపులోకి తీసుకుంటున్నాయి. గ్రీన్‌కార్డు ఇంటర్వ్యూల కోసం అని పిలిపించి.. ఐసీఈ అరెస్టులు చేస్తోంది' అని తెలిపారు. గత వారం ఇలాగే ఇంటర్వ్యూల కోసం వచ్చిన తన అయిదుగురు క్లయింట్‌లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

## సందీప్ మక్తాలా ప్రపంచవ్యాప్త గుర్తింపు

# తెలంగాణకు గర్వకారణం

- మంత్రి శ్రీధర్ బాబు
- మర్యాదపూర్వకంగా కలిసిన యూఏఈ గోల్డెన్ వీసా హానరీ సందీప్ మక్తాలా



**హైదరాబాద్, నవంబర్ 28 (జనంసాక్షి) :** సందీప్ మక్తాలా ప్రపంచవ్యాప్త గుర్తింపు తెలంగాణకు గర్వకారణమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ టెక్నాలజీ నాయకుడు సందీప్ కుమార్ మక్తాలా, ఇటీవల రాజభవన మద్దతుతో ప్రకటించిన యూఏఈ గోల్డెన్ వీసా ఘనతను అందుకుని శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన రాక సందర్భంగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అద్భుతమైన ఫ్లాష్‌మాబ్‌తో ఘన స్వాగతం లభించింది. అనంతరం ఆయన భార్య భాగ్యలక్ష్మితో కలిసి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును మంత్రివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. భారతదేశానికి తిరిగొచ్చిన వెంటనే, మొదటి విజిట్‌గా మంత్రిని కలవడం ద్వారా, తెలంగాణ ప్రభుత్వంపై తనకు ఉన్న కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసినట్లు మక్తాలా తెలిపారు. తెలంగాణ గర్వసుతుడు అయిన సందీప్ మక్తాలా, తెలంగాణ ఉద్యమం సమయంలో సాంకేతిక సేవలు, వాలంటీర్ల సమన్వయం, యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు వంటి కీలక భూమిక పోషించిన విషయం తెలిసిందే. రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న అనుబంధం, బాధ్యత భావం, ఇప్పటికీ ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలు, పెట్టుబడులు, ఇన్నోవేషన్ కార్యక్రమాల రూపంలో కొనసాగుతున్నాయి. మంత్రిని కలిసిన సందర్భంలో, తెలంగాణ గ్లోబల్ కనెక్టివిటీ, పెట్టుబడుల రాక, స్టార్టప్ ఇకోసిస్టమ్ అభివృద్ధి, టెక్నాలజీ–పరిశ్రమల రంగాల పురోగతికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని మక్తాలా హామీ ఇచ్చారు. యూఏఈ గౌరవం పొందడం తనకు మరింత బాధ్యతను గుర్తుచేసిందని, ఈ గుర్తింపును తెలంగాణ అభివృద్ధికి ఉపయోగిస్తానని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ "సందీప్ మక్తాలా ప్రపంచవ్యాప్త గుర్తింపు తెలంగాణకు గర్వకారణం. రాష్ట్రాన్ని అంతర్జాతీయ వేదికలపై ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టడంలో ఆయన పాత్ర అనివార్యం" అని అభినందించారు. రాష్ట్ర ఆవిష్కరణల దిశగా, పరిశ్రమల వృద్ధిలో, అంతర్జాతీయ భాగస్వామ్యాలు పెంపొందించడంలో మక్తాలా గారి సహకారాన్ని ఆయన స్వాగతించారు. 63 దేశాలలోని 2,843 కంపెనీలకు ప్రతినిధిగా పనిచేస్తున్న డబ్ల్యూటీఐటీసీ చైర్మన్‌గా, యూఏఈ గౌరవం తనపై పెట్టిన విశ్వాసానికి ప్రతీకగా భావిస్తున్నానని, "తెలంగాణకు గ్లోబల్ బ్రిడ్జెస్‌ను నిర్మించడం నా బాధ్యత" అని సందీప్ మక్తాలా పునరుద్ఘాటించారు.

## మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ 'పూలే'కు నివాళులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే కు 135 వ వర్ధంతి సందర్భంగా సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, సిబ్బంది నివాళులు అర్పించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో 'పూలే' చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంఘ సంస్కర్త పూలే సమాజానికి, బడుగు వర్గాలకు చేసిన సేవలను చిన్నారెడ్డి, దివ్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, పోలీస్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఉమేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

**సీఎం ప్రజావాణిలో 276 దరఖాస్తులు**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 276 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 100, రెవెన్యూ శాఖకు సంబంధించి 38, ఇందిరమ్మ ఇండ్ల కోసం 68, నీటి పారుదల శాఖకు 46, దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 70 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



# సమస్యలు పరిష్కరించని కాంగ్రెస్

- నగరంలో అధ్వాన్న రోడ్లను పట్టించుకోరా?
- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

**హైదరాబాద్, నవంబర్28 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా ఏదైనా చిన్న సమస్యను కూడా పరిష్కరించలేదని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఉప్పల్ హైదరాబాద్ రోడ్డును రెండేళ్లయినా బాగు చేయడంలో విఫలం అయ్యారని అన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం లో ఉండగా జాతీయ రహదారిని బాగు చేయాలన్న ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. గత రెండేళ్లుగా ఎందుకు దీనిపై అశ్రద్ధగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. నగరంలో అనేక రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎంతసేపు ఎలక్షన్లు కలెక్షన్లు అన్న రీతిలో పాలన సాగుతోందని ప్రభాకర్ మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల పేరుతో ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లపై వెనక్కి తగ్గినందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తమకు అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. హైదరాబాద్‌లో నాడు బీఆర్ఎస్ భూములు లాక్కున్నట్టే నేడు కాంగ్రెస్ పార్టీ లాక్కుట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న భూములను అప్పనంగా కొట్టేసే ప్రయత్నం సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ భూ కుంభకోణాలకు హద్దు లేదు.. దీనికి మూల్యం చెల్లించక తప్పదంటూ హెచ్చరించారు. భూముల కోసమే జీహెచ్ఎంసీ పరిధి విస్తరించినట్లుగా ఉందని అన్నారు. వసతుల కల్పన లేకుండా పరిధి విస్తరిస్తే ఏం లాభమని అన్నారు.

# అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం

- అవార్డుల ప్రదానోత్సవం లో పాల్గొన్న ఉప్పల




**హైదరాబాద్ (జనంసాక్షి) :** డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. కీర్తి ఆర్ట్స్ అకాడమీ సాంస్కృతిక, ఈవెంట్ సంస్థ - 2017 బిందు లిమ్కా గిన్నెస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ప్రెసిడెంట్, కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో డా. ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా జాతీయ స్థాయి నృత్య, సంగీతోత్సవం -సీజన్-8 పురస్కారాల ప్రదానోత్సవం - 2025 లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భగా వివిధ రంగాల్లో రాణించిన వారికి పురస్కారాలు అందజేశారు. అవధానుల మురళి కృష్ణ (పాఠశాల సహాయకుడు (గణితం), జెడ్.పీ.హెచ్.ఎస్ ముదిగొండ, ఖమ్మం జిల్లా), మొహమ్మద్ మౌలాలి (ఎఫ్.ఏ.సీ. హెడ్‌మాస్టర్, పాఠశాల సహాయకుడు (గణితం), జెడ్.పీ.హెచ్.ఎస్ పెరువంచ, ఖమ్మం జిల్లా), డా. నారాల రుక్మరావు (సంస్థాపకుడు, చైర్మన్ యశోద ఫౌండేషన్)లు అవార్డులు అందుకున్నారు. అలాగే పచిమట్ల భూపతి గౌడ్

కూచిపూడి నాట్య గురు, నటరాజ నృత్య కళా నిలయం, పీ. మాధవి, కూచిపూడి నాట్య గురు నృత్యకళా అకాడమీ జి. శ్రీవంత్.కొరియోగ్రాఫర్ వైరస్ డాన్స్ స్టూడియో ఎం. తేజస్విని సంతోష్, కూచిపూడి నాట్య గురు నాట్య తరంగిణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డాన్స్ నవీన్ కొరియోగ్రాఫర్ మూన్ వాక్ డాన్స్ స్టూడియో రాజు కొరియోగ్రాఫర్ రాజ్ డాన్స్ అకాడమీ జులా శ్రీనివాస్ సీనియర్ కరాటే మాస్టర్.. వీరందరికీ ఉప్పల శ్రీనివాస్ గుప్త అభినందనలు తెలిపారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు అన్ని విధాలా అండగా వుంటుంది అని ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక మందికి తాను ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తున్నాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, సోషల్ అక్టివిస్ట్ వసంత రాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గడిచిన పదేళ్లలో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నమైన పరిస్థితుల నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రైతులకు వ్యవసాయం దండగ కాదు.. పండగ చేయాలన్న సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోన రాష్ట్ర సర్కార్ టిపిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ మార్గదర్శకంలో సమన్వయం, వ్యూహాత్మక ప్రణాళికలతో రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తోందనీ టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని గాంధీభవన్ లో శుక్రవారంనాడు విలేకరులతో శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని విశ్వసించి రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లింపు, రైతు బీమా వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలపై అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంపై ఒక లక్ష కోట్ల రూపాయలకు పైగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఖర్చుపెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసి వెళ్ళిన లక్షల కోట్ల అప్పులు, ఎన్నో చిక్కుముళ్ళు, ఎన్నెన్నో సమస్యలు, అడుగు వేయాలంటే చీకటి పరిస్థితులు ఉన్న రోజుల నుంచి వెలుగు వైపు రాష్ట్ర ప్రభుత్వాన్ని, రైతాంగాన్ని నడిపించేందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ధరణిని అడ్డం పెట్టుకొని గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ముప్పు తిప్పలు పెడితే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చి రైతులకు అండగా నిలబడి గ్రామ సభలు పెట్టి రైతుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఎప్పుడు లేని విధంగా తొలి ఏడాదిలో 60 వేల ఉద్యోగ నియామకాలు, మహిళల సాధికారత, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ, సామాజిక న్యాయం వంటి ఎన్నో అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు 20,615 కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతు భరోసా క్రింద తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తోందనీ టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి అన్నారు.

## ప్రేమించిన యువతికి మరో యువకుడితో వివాహం

- ఆత్మహత్య చేసుకున్న ప్రేమికుడు

**నిజామాబాద్, నవంబర్ 28 (జనంసాక్షి) :** ప్రేమించి మోసపోయానని గ్రహించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిజామాబాద్ జిల్లా దొంచందకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి.. ఏరుగట్లకు చెందిన ఓ యువతితో ఆరేళ్లుగా ప్రేమలో పడ్డారు. ఇరువురు ఎంతో అన్యోన్యంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తాను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకునేందుకు లండన్ నుంచి నిజామాబాద్ వచ్చారు. అయితే.. సదరు యువతి తల్లిదండ్రులు ఆమెకు మరో యువకుడితో పెళ్లి జరిపించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్‌రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శ్రీకాంత్‌రెడ్డి మృతిచెందారు. ఈ ఘటనతో శ్రీకాంత్ కుటుంబం.. నిజామాబాద్ పట్టణంలో మృతదేహంతో ఆందోళనకు దిగింది. ఇంతలో పోలీసులు వీరి ఆందోళనను అడ్డుకున్నారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీకాంత్‌రెడ్డి మృతిపై నిజామాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- ప్రభుత్వ హామీ నిలబెట్టుకోవాలి
- టిఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి




**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 28(జనం సాక్షి):** ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, పీఆర్సి, పెండింగ్ 5 డీఏలను వెంటనే చెల్లించాలని టిఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలోజు మంజుల అధ్యక్షతన శుక్రవారం ఉన్నత పాఠశాల కురవిలో జరిగిన టిఎస్ యూటీఎఫ్ కురవి మండల మహాసభలో ముఖ్య అతిథిగా మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, దాచుకున్న జీపీఫ్, టిఎస్ జి ఎల్ ఐ, మెడికల్ బిల్లులు, సరేండర్ లీవ్స్ బిల్లులు మరియు రిటైర్ అయినా వారి గ్రాట్యూటీ, బెనిఫిట్స్ రెండేళ్లుగా చెల్లించకపోవడంతో అందరూ ఇబ్బందులు పడుతున్నారని నెలకు 700 కోట్లు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని అన్నారు. అధికారం లోకి రాగానే పీఆర్సి ప్రకటిస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ ఊసే లేదని అన్నారు. ప్రతి ఐదేండ్లకు ఒకసారి ఇవ్వాల్సిన పీఆర్సి ని వెంటనే నివేదిక తెప్పించకుని 30 శాతానికి తగ్గకుండా జులై 2023 నుండి అమలు చేయాలనీ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెనుశాపంగా ఉన్న సీపీఎస్ నువ్వు రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆరు నెలలకు ఇవ్వాల్సిన డిఏ పెండింగ్ లో ఉన్న 5 డీఏ లను ప్రకటించాలని, రాష్ట్రం లోని అందరి ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని, అన్ని గురుకులాలకు ఒకే డైరెక్టరెట్ ను ఏర్పాటు చేయాలని, రాష్ట్రం లోని అన్ని గురుకులాలను, మోడల్ స్కూల్స్ ను, కేజీబీవీ లను ప్రభుత్వ విద్యాశాఖలో విలీనం చెసి 010 ద్వారా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేయకపోతే భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఉపాధ్యాయులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్, మండల ప్రధాన కార్యదర్శి ఎం ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీధర్, బాబు, ప్రదీప్, రామకృష్ణ, కృష్ణకుమారి, మాదవి, రీఛా, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, సలీమ్, అష్మత్ పాషా, రమేష్, లక్ష్మి, సురేష్, భాస్కర్, సింధు, వీరభద్రం, యాకమ్మ, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ధరకు బంగారమంటూ స్థానికులను

# మోసం చేసిన దంపతుల అరెస్టు




**పాలకుర్తి, నవంబర్ 28(జనంసాక్షి) :** తక్కువ ధరకే బంగారం ఇస్తానంటూ స్థానికులను బురిడి కొట్టించి లక్షలు కాజేసిన ఘటనలో బార్య, భర్తలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై దూలం వనకుమార్ తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్లో మీడియా సమావేశంలో ఎస్సై దూలం వన్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన సింగపురం గౌరమ్మ, ఆమె భర్త వెంకటయ్యలు గ్రామంలో కొత్త ఇల్లు నిర్మించుకున్నారు. ఇంటి నిర్మాణానికి పెద్ద మొత్తంలో ఖర్చు కాగా, తమ ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని నమ్మించి అమాయకుల నుంచి డబ్బులు వసూల్ చేయాలని పథకం పన్నారు. అదే క్రమంలో గ్రామానికి చెందిన మంద రజిత, బొమ్మగాని పద్మలను తన మాస్టర్ ప్లాన్ ను ఎంచుకున్నారు. వారిని కలిసి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటిలో లంకె బిందెలు దొరికాయని దానిలో పెద్ద మొత్తంలో బంగారం దొరికిందని తెలిపారు. మీరు ఆప్తులు కాబట్టి మార్కెట్లో ఉన్న ధర కంటే తక్కువ ధరకు బంగారం ఇస్తానని మీ అదృష్టం మారుస్తానని ఇరువురి మహిళలను నమ్మబలికారు. బంగారం పై ఆశతో అమాయక మహిళలు అందిన కాడల్లా అప్పులు చేసి బొమ్మగాని పద్మ రూ.4.74 లక్షలు, మంద రజిత రూ.6 లక్షల 7 వేలు, గాదం జయమ్మ రూ.5.98 లక్షలను గౌరమ్మకు అప్పజెప్పారు. జఫర్గడ్ మండలంలోని కోనాయిచలంకు చెందిన నలుగురు మహిళల నుంచి రూ. 15 లక్షలు తీసుకున్నారు. డబ్బులు ఇచ్చిన తర్వాత బంగారు కోసం అడుగుతుంటే దాటవేసే సమాదానాలు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు. దీంతో మోసపోయామని భావించి మహిళలు పోలీస్‌స్టేషన్ ను ఆశ్రయించారు. తమకు జరిగిన అన్యాయంపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు. చేశారు.

## బహుజనులకు విద్యకు బాటలు వేసిన విద్యావేత్త పూలే

- పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్



**హనుమకొండ (జనంసాక్షి) :** బహుజనులకు విద్య అందించి వారి జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు జ్యోతిబా పూలే అని పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగం మల్లేశ్వర్ గుర్తు చేసుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం, దూరవిద్య కేంద్రంలోని పూలే ప్రాంగణంలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లేశ్వర్ మాట్లాడుతూ అణచివేతకు గురైన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు అన్నారు. బడుగుల సాధికారత కల్పించడంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాస్ అధ్యక్షులు తాదూరి శాస్త్రి, పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, పాస్ నాయకులు డాక్టర్ కే బిక్షాలు, శ్రీరామ్ వీరయ్య, డాక్టర్ ఎన్ వీణ, కందుల తరుణ్, తుర్పాటి వేంకటేష్, మాలోత్ సురేందర్, పి.వైష్ణవి, యశస్విని, డాక్టర్ ఎస్ జ్యోత్న తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట ఎస్ఐ గన్ మిస్ కేసులో దర్యాప్తు

**హైదరాబాద్, నవంబర్28 (జనంసాక్షి) :** అంబర్‌పేట్ ఎస్ఐ గన్ మిస్సింగ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గన్ మిస్సింగ్‌పై ఎస్ఐ భానుప్రకాష్ రెడ్డి పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ పెట్టానో గుర్తులేదు అంటూ సమాధానాలు ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భాను ప్రకాష్ ఐదు నెలల క్రితమే గన్‌ను మిస్ చేశాడు. జర్నీలో ఎక్కడో బ్యాగ్ పోగొట్టుకున్నా అని చెబుతూ వచ్చాడు. అయితే గత ఐదు నెలల నుంచి గన్ మిస్ అయిన విషయాన్ని పై అధికారులకు చెప్పకుండా ఎస్ఐ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. మరొక ఉద్యోగం రావడంతో ఏపీకి వెళ్లేందుకు ఎన్వోసీని ఎస్ఐ అడుగగా.. సర్వీస్ రివాల్వర్ ఇవ్వాలని వారు సూచించారు. దీంతో అసలు బండారం బయటపడింది. ఎస్ఐ భానుప్రకాష్ తన గన్‌ను మిస్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో అంబర్‌పేట్ పోలీసులు ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోంది.రోవైపు పోలీసు శాఖకు మచ్చ తెచ్చే విధంగా ఎస్ఐ ప్రవర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లను ఆపాల్సిన ఎస్ఐ.. విపరీతంగా బెట్టింగ్‌లు ఆడి లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. అంతే కాకుండా బెట్టింగ్ కోసం ఏకంగా తన పొలాన్నే అమ్ముకున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కడప జిల్లాలో ఉన్న రాయచోటిలో పొలాలను ఎస్ఐ అమ్ముకున్నాడు. దాదాపు రూ.96 లక్షలకు పైగా డబ్బులను ట్రాన్సాక్షన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# మహానటి సావిత్రి 90వ జయంతి వేడుకలు

- డిసెంబర్ 1నుంచి 6 వరకు రవీంద్రభారతిలో నిర్వహణ

**హైదరాబాద్, నవంబర్28 (జనంసాక్షి) :** మహానటి సావిత్రి 90వ జయంతి సభలను నిర్వహించబోతున్నట్లు ఆమె కూతురు విజయ చాముండేశ్వరి ప్రకటించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో డిసెంబర్ 1 నుంచి 6 వరకు 'సావిత్రి మహౌత్సవ్' పేరిట ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రముఖ కళా సంస్థ 'సంగమం' ఫౌండేషన్‌తో కలిసి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో సావిత్రి గారి సినిమాల ప్రదర్శన, పాటల పోటీలు ఉంటాయి. డిసెంబర్ 6న జరిగే సావిత్రి 90వ జయంతి సభలో 'మహానటి' చిత్ర దర్శక నిర్మాతలైన నాగ్ అశ్విన్, ప్రియాంకా దత్, స్వప్నాదత్, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిషోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యని ప్రత్యేకంగా సత్కరించనున్నారు. మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సభకి భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నారు. చలన చిత్ర ప్రముఖులు ఆత్మీయ అతిథులుగా విచ్చేయనున్నారు.

# స్త్రీ స్వర విప్లవం ఓల్గా

ఓల్గా తెలుగు సాహిత్యంలో పెనుమార్పులు సృష్టించి ప్రజలను చైతన్యపరిచే శక్తి కొందరికే ఉంటుంది. తన రచనలతో స్త్రీలోని ఆత్మ గౌరవాన్ని ధైర్యాన్ని పెంపొందించిన మహిళా శక్తి ఓల్గా. తెలుగు సాహిత్యంలో ఎనలేని కృషిచేసి స్త్రీవాద సాహిత్యానికి అద్యురాలిగా నిలిచింది. కథ, నవల, కవిత్వాలు, వ్యాసం, సినిమాలు, నృత్య నాటిక,విమర్శ లాంటి ఎన్నో రచనలు చేసిన ఏకైక రచయిత్రి ఓల్గా. ఈమె అసలు పేరు పోపూరి లలిత కుమారి. గుంటూరు జిల్లా,చుండూరు మండలం,యెడ్లపల్లి గ్రామంలో నవంబర్,27,1950 న జన్మించింది.తండ్రి వెంకట సుబ్బారావు తల్లి వెంకటసుబ్బమ్మ .ఓల్గా గారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఎం ఎ తెలుగు చదివారు. ఆ తర్వాత వి ఎస్ ఆర్ కళాశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. చలం,కొడవటిగంటి కుటుంబరావు రచన వల్ల ప్రభావితమై స్త్రీ చైతన్యాన్ని అంశముగా తీసుకొని రచనలు చేయడం ప్రారంభించారు స్త్రీవాద సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని మహిళల హక్కుల కోసం తనదైన శైలిలో వివాదస్పద రచనలు చేస్తూ ఎన్నో విమర్శలు అవమానాలు ఎదుర్కొంది. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ తన రచనల ద్వారా సమాజాన్ని బాల్యవివాహాలు, వితంతు వివాహం మూఢనమ్మకాల బారిన పడకుండా పాటుపడింది. విరసంలో సభ్యురాలుగా ఉంటూ మగవారితో సమానంగా లింగభేదం, అసమానత్వం అణచివేత లాంటి విషయాలపై ఆమె రచనల ద్వారా తిరుగుబాటు చేసింది.ఈమె కేవలం రచయిత్రి గానే కాకుండా కమ్యూనిస్టుగా వామపక్ష భావజాలంతో ఉండేది. స్త్రీ పురుష బేధం లేకుండా మేధస్సులో ఇద్దరూ సమానమని విషయాన్ని గుర్తించాలని అప్పుడున్న లింగభేదకులకు తెలియజేశారు. మూఢనమ్మకాల కాలంలో సంఘాల సహకారం తీసుకోకుండా రచనల ద్వారానే ప్రజల్లో అవగాహన కల్పించాలని అనుకున్నారు.స్త్రీవాదం అంటే పురుషాధిపత్యం అని పెడదారి పెట్టేవాళ్ళు ఉంటారు. స్త్రీవాదమంటే పురుషాధిపత్యం కాదని కాలరాస్తున్న స్త్రీ హక్కులను కాపాడటం అని ఆమె చెప్పారు. స్త్రీలు వంటింటి కుందేలు కాదని వాళ్ల లో జ్ఞానం,మేధస్సు,చేతనత్వం ఉంటుందని సమాజంలో వాళ్లకి చోటు ఉంటుందని సమాజంని బాగుపరచటంలో వాళ్ళకి భాగస్వామ్యం ఉంటుందని సమాజంలో చోటు కల్పించాలని ఆమె చేసిన రచనలకు ఎన్నో వివాదాస్పద చర్చలు లేవనెత్తాయి ఎన్నో అవమానాలు ఎన్నో విమర్శలు అయినప్పటికీ అన్నింటినీ తట్టుకొని ఆమె కలం స్త్రీవాదం కదం తొక్కింది స్త్రీ ఔన్నత్యాన్ని లోకమంతా చాటి చెప్తూ స్త్రీ ప్రగతికి నిచ్చెనలు వేసాయి ఆమె రచనలు.అవగాహన లేని అప్పటి సాంఘిక పరిస్థితులలో అర్థం చేసుకోవడం అంతకన్నా లేకుండా పోయింది.ఎదుటివారి ఆలోచనలను దృష్టిలో పట్టించుకోకుండా ప్రాచీన కవులు ఇష్టం వచ్చినట్టుగా వాళ్లకు ఎదురైన పరిస్థితులను మాత్రమే రాశారు కానీ సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని కాదు అలాంటి కోవలోకి చెందుతాడు వేమన స్త్రీలను ఆధ్యాత్మిక రంగంలోకి వెళుతున్న పురుషులనూ ఆపే వాళ్ళు గాని చూశాడు కానీ స్త్రీ యొక్క మనస్తత్వాన్ని గ్రహించలేకపోయాడని ఓల్గా ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. మనం అనుకున్నదే నిజం కాదు వాస్తవ సత్యం మరొకటి ఉంటుందనే విషయాన్ని ఓల్గా గారు గ్రహించి సమాజంలో ఆమె యొక్క రచనతో వెల్లడించారు.స్త్రీని ప్రపంచంతో ముడి వేయడం స్త్రీవాదం అని ఆమె ఉద్దేశం కానీ పురుషాధిపత్యం కాదనీ అన్నారు.స్త్రీని ఒక వస్తువుగానే చూసే ధోరణిని మార్చాయి ఓల్గా గారి రచనలు.ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొన్నప్పటికీ ఆమె సాహిత్యాన్ని ఆపకుండా నిరంతరం రచనలు చేస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తూ ప్రజలకు జరుగుతున్న విషయాలపై అవగాహన కల్పిస్తూ నిత్యం శ్రమించారు.మగవారు రచనలు చేస్తే మేధోపరమైన ఆవరణ ఉంటుందని అదే స్త్రీలు రాస్తే వ్యక్తిగత ఆవరణ ఉంటుందని ఎన్నో చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా ఆమె యొక్క రచన స్త్రీవాదం వైపు అడుగులు వేసింది ఆమె రచనల గళం స్త్రీల యొక్క అణచివేతను విప్పింది. ఓల్గా గారి రచనలు సమాజంపై మార్పును తేవడమే కాకుండా స్త్రీలపై అణచివేతను కూడా తగ్గించాయి ఎన్నో అశ్లీల,నీచపు రచనలు చేసిన వారు కూడా స్త్రీవాద కవిత్వాలు రాగానే వాళ్ల యొక్క రచనలకు అడ్డుకట్ట వేశారు. స్త్రీల శరీర భాగాలను వర్ణించి రాసేవారు ఉన్నారు వాళ్లని సమాజం నిందించట్లేదు వారి యొక్క శరీరాన్ని ఒక వస్తువుగా నీచంగా,అసభ్యంగా వాడుకుంటూ స్త్రీ భాగాలను నీచంగా చేస్తున్నారని సభ్యసమాజాన్ని కడిగి పరేసింది ఓల్గా. ప్రాచీన కాలంలో స్త్రీ యొక్క శరీరంపై భయంకరమైన రాతలు వ్యంగ్యంగా రాసిన పురుషుడిని మెచ్చుకుంటూ స్త్రీని మాత్రం రచనలు చేయగానే సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారనే మాట అంటున్నారు లింగ బేధం అనేది శరీరానికే కానీ మనసుకు కాదని సమానత్వం అనేది లింగ బేధంతో ముడిపెట్టకూడదనే విషయాన్ని తన రచనల ద్వారా సూటిగా,నిక్కచ్చిగా,వాస్తవికంగా చెప్పారు. స్త్రీ యొక్క భావోద్వేగాన్ని వాస్తవికతను ఆమె రచనల్లో ఇంకింప చేశారు ప్రతిపత్తి,ఆదర్శం వైపు ఆమె యొక్క గమనం సాగింది. ఓల్గా తెలుగు సాహితీ ప్రపంచంలోనే అఖండ నది ప్రవాహం అని గొల్లపూడి మారుతీ రావు గారు ప్రశంసించారు.స్త్రీ ఉద్యమానికి ప్రతికగా నిలిచిన ఓల్గా రచనలు ఎంతో ప్రఖ్యాతిగాంచినవి స్వేచ్ఛ ,స్త్రీ పురుష సంబంధాలపై, మహిళపై జరుగుతున్న అనేక దాడులు,హింసను తరతరాలుగా జరుగుతున్న అణచివేతను విప్పి చెబుతుంది. స్త్రీలపై జరిగిన పైశాచిక దాడుల గురించి ఎంతో ఉద్యమించారు స్త్రీని ఎప్పుడు ఆ దృష్టి కోణంతో చూడవద్దని వారికంటూ ఒక ఉనికి అస్తిత్వం ఉంటుందని తప్పుడు రాతలు రాసి వారి యొక్క గౌరవాన్ని భంగపరచకూడదని వాదించారు. ఎంతో మంది స్త్రీవాద రచయితలు ఈ హేళనలు అవమానాలకు గురయ్యారు. ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటి పైన మా నాన్న పేరే ఉంటుంది, నీలి కవితలే రాస్తాము, సంకెళ్లు తెగుతున్న సంగీతం, లేబర్ రూమ్, పంజరాన్ని కాను పక్షిని కాను, నేను ఋతువునైన వేళ అంటూ ఎన్నో రచనలతో కవయిత్రిలందరూ సమాజంలో జరుగుతున్న ఆకృత్యాలను చీల్చి చండాలారు.స్త్రీకి వేసిన బానిసత్వపు సంకెళ్ళని తెంచారు. స్త్రీల పై జరిగిన హింసపై ఉక్కు పాదం మోపారు. స్త్రీ కవిత్వం రాయడానికి రాజకీయ కథలు ప్రేరణగా నిలిచాయి.అస్మిత వంటి వర్క్ షాప్ లలో రచనలు చేస్తూ కార్యదర్శిగా ఉన్నారు.సహజ,ఆకాశంలో సగం,మానవి వంటి కథలు. ఆంగ్లం నుండి తెలుగు అనువాద రచనలు,సినిమాలు,సీరియల్స్, పురాణాలు ఆధారంగా సీత సూర్పనఖ వంటి రచనలు సృజనాత్మకతతో రాశారు ఎడిటెడ్ రచనలైన మాకు గోడలు లేవు,నీలి మేఘాలు వంటి అనేక రచనలు కవిత్వాలు రాసిన ఘనత ఓల్గా గారికి దక్కుతుంది. తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ స్త్రీ రచయిత్రి పురస్కారం ఇవ్వడం జరిగింది.ఈమె రాసిన కథలన్నీ ఓ ప్రభంజనమే తోడు అనే కథల సంపుటికి నంది అవార్డు లభించింది తోడు అనేది కేవలం పురుషుడికి ఎక్కువ అవసరమని పురుషుడు మరణించాక స్త్రీ ఎంతో స్వేచ్ఛగా తన తనకు నచ్చినట్టు స్వేచ్ఛతో ఉండగలదు. అదే భార్య మరణించిన పురుషుడు భార్య లేకపోతే తనకు సంబంధించిన పనులు చేసుకోలేడని రోజు సేవలు చేసే స్త్రీ తనకి అవసరమవుతుందని ఆ తోడు కథలలో ఎంతో కళ్ళకు కట్టినట్టు కథను రాయడం జరిగింది. అంతేకాకుండా విముక్త కథల సంపుటిని రాయడం జరిగింది ఈ విముక్త కథలకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.స్వేచ్ఛ నవల ఆంధ్ర రాష్ట్రంలో ఓ విప్లవనే తీసుకొచ్చింది. ఎన్ని రచనలు చేసినప్పటికీ ఆమె యొక్క రచనలన్నీ స్త్రీ యొక్క హక్కులను గుర్తించడం, స్త్రీ అభివృద్ధి చెందడం అందుకుగాను ఆమె యొక్క రచనల్లో మాట్లాడలేని వారు మాట్లాడాలని మాట్లాడగలిగిన స్త్రీలందరూ బయటకు వచ్చి సమాజాన్ని ఎదుర్కోవాలన్నారు. ఎంత వ్యతిరేకత వచ్చినప్పటికీ ఆమె యొక్క రచనలు ప్రజల్లో వ్యాప్తి చెందడమే కాకుండా ఎంతో మార్పును కూడా సృష్టించాయి. ఆ మార్పే తెలుగు సాహిత్యంలో ఆమెకు ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టింది. మానవతా విలువల్ని నేర్పే శక్తి కేవలం సాహిత్యానికి మాత్రమే ఉందని అది పుస్తకాలు చదవడంతో మాత్రమే సాధ్యపడుతుందని ఆమె ఎన్నో పుస్తక ప్రదర్శనలలో చెప్పడం జరిగింది .ఆమె రాసింది సాహిత్యం అయినప్పటికీ జరుగుతున్నది మాత్రం వాస్తవం.స్త్రీ ప్రసవానికి సెలవులు అని కూడా చట్టం రావడం మిగతా హక్కులు పొందటం జరిగింది. స్త్రీ వల్ల యుద్ధాలు జరిగాయంటారు కానీ స్త్రీకి అవమానం జరగడం వల్ల యుద్ధాలు జరిగాయని తెలుసుకోలేకపోతున్నారు. స్త్రీకి స్త్రీ ఏ శత్రువు అన్నమాటను నిజం చేస్తూ స్త్రీ జాతిని మరింత హేళన చేస్తున్నారు.స్త్రీని మరో మహిళ అర్థం చేసుకొని అనుకున్నది సాధించగలరని ధైర్యాన్నిస్తే ఆ మహిళ అన్ని రంగాలలో ముందుకెళ్లవచ్చు గొప్ప సమాజాన్ని నిర్మించవచ్చు. అనే వాస్తవాన్ని ఓల్గా నిరూపించి తెలుగు స్త్రీలందరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. పురుషాధిపత్యం స్త్రీ హింసలకి చరమగీతం పాడారు. ఓల్గా గారి రచన రానున్న తరాలకు స్త్రీ యొక్క స్వేచ్ఛకి, విముక్తికి, ఎదుగుదలకి గొప్ప మార్గదర్శకత్వం.



**కాల్వ నిఖిత,**
**6309767894.**

# భారతదేశంలో రైతులు - ఎదుర్కొంటున్న సమస్యలు!



భారతదేశ భూభాగంలో రైతు జీవితం ఇప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ వెన్నెముక గా కొనసాగుతున్నా ఆ వెన్నెముక మాత్రం రోజురోజుకు బలహీనపడుతున్న వాస్తవం కనిపిస్తుంది. తాజా ఆర్థిక సర్వే ప్రకారం 2022-23లో దేశ స్థూల దేశీయోత్పత్తికి వ్యవసాయం, అనుబంధ రంగాల కలిపి వాటా సుమారు 16 శాతం పరిధిలో ఉండగా అదే సమయంలో పని దళంలో దాదాపు 46 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. ఇది ప్రతి రైతు కుటుంబానికి వచ్చే సగటు ఆదాయం ఇతర రంగాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉందని చూపుతుంది. నాభార్డ్ నిర్వహించిన గ్రామీణ ఆర్థిక సమావేశ సర్వే ప్రకారం గ్రామీణ కుటుంబాల నెలవారీ సగటు ఆదాయం 2016-17లో సుమారు రూపాయలు 8,059 నుంచి 2021-22లో రూపాయలు 12,698కి పెరిగినా అప్పుల భారమే అధికమై 2016-17లో 47.4 శాతం గ్రామీణ కుటుంబాలు అప్పు బాదరబందిలో ఉంటే 2021-22లో ఈ శాతం 52కి పెరిగింది. అంటే గ్రామీణ జీవితంలో ఉన్న ప్రతి రెండు కుటుంబాల్లో ఒకటి అప్పు భారంతో కృంగిపోతున్న పరిస్థితి. ఈ నేపథ్యంతో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మీరు పేర్కొన్న నాలుగు అంశాలు దేశవ్యాప్తంగా కోట్లాదిమంది రైతుల రోజువారీ వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయి.

మొదటిగా ప్రకృతి వైపరీత్యాల రూపంలో మారుతున్న వాతావరణ నమూనాలు భారతీయ రైతుని అత్యంత అస్థిర స్థితిలోకి నెట్టేశాయి. గత ఐదేళ్లలో వరదలు, అకాల వర్షాలు, వడగళ్ల వాన, దీర్ఘకాల వడగాల్పు, ఉష్ణ అలలతో పాటు శీతల తరంగాల తీవ్రత పెరిగింది. ఈ ధరల హెచ్చుతగ్గులు వినియోగదారులకు భారంగా మారడమే కాదు రైతు చేతిలో పెట్టుబడులు తిరిగి రాకపోవడం, అప్పులు తీర్చలేకపోవడం వంటి గొలుసు సమస్యలను నిర్మిస్తాయి. పంజాబ్‌లో 2025లో నమోదైన గత ముప్పై ఏళ్లలోనే అత్యంత తీవ్రమైన వరదలు లక్షల ఎకరాల పంట నేలమట్టం చేయడం, వేలాది కుటుంబాలు ఇళ్లను కోల్పోవడం వంటి సంఘటనలు వాతావరణ విపత్తులు ఒక జిల్లాలో జరిగే ప్రాంతీయ సమస్య కాదని దేశవ్యాప్తంగా రైతు జీవన భద్రతను కదిలించే సంక్షోభమని తెలియజేస్తాయి. చిన్న, సన్న కర్షకుల దగ్గర భూస్వామ్యం తక్కువ ఉన్నా, పొలాల్లో పెట్టిన పెట్టుబడిలో పెద్ద భాగం అప్పుగా సమకూర్చుకోవాల్సి రావడంతో ఒక వరద, ఒక అకాల వర్షం, ఒక వడగళ్ల వాన వారి జీవితాన్ని పూర్తిగా తలకిందులు చేసే స్థితి ఏర్పడుతోంది.

రెండవది కల్తీ పురుగు మందులు, కల్తీ విత్తనాలు రైతు నమ్మకాన్ని దెబ్బతీస్తున్న నిశ్శబ్ద వ్యాధిలా మారాయి. మార్కెట్‌లో బ్రాండెడ్ కంపెనీల పేర్లు దొంగిలించిన లోకల్ లేబుళ్లు, నిగనిగలాడే ప్యాకెజింగ్ వెనక నాణ్యత లేని రసాయనాలు దాగి ఉండడం సాధారణమైన పరిణామంగా మారింది. రైతు నాణ్యమైన విత్తనం కొనుగోలు చేశానని భావించి ఎకరానికి వేల రూపాయలు పెట్టుబడి పెట్టినా మొలక శాతం తక్కువగా ఉండటం, మొక్కలు పెరిగాక పుష్ప దశలో లేదా గింజ నిండి రావాల్సిన సమయంలో విత్తన లోపం వెలుగులోకి రావడం వల్ల మొత్తం పంట నష్టమవుతోంది. కల్తీ పురుగు మందులు పంటలో కీటక నియంత్రణకు సహకరించకపోగా ఎన్నో సందర్భాల్లో పురుగు నిరోధక శక్తి తగ్గించి తదుపరి సీజన్లలో మరింత తీవ్రమైన దాడులకు దారితీస్తాయి. ఈ కల్తీ మందుల ప్రభావం నేల ఆరోగ్యంపైనా, నీటి గుణాత్మకతపైనా, రైతు కుటుంబ ఆరోగ్యంపైనా పడుతుంది. అధికారిక స్వాధీనం, దాడులలో ప్రతి ఏటా వేల లీటర్ల కల్తీ పురుగు మందులు స్వాధీనం అవుతున్నాయన్న వార్తలు వస్తూనే ఉన్నా గ్రామ స్థాయిలో చిల్లర విక్రయాల్లో పర్యవేక్షణ బలహీనంగా ఉండటంతో వేలాది రైతులు ప్రతి సీజన్లో కొంత శాతం ఇలా మోసపోవాల్సి వస్తోంది. చిల్లర స్థాయిలో నమ్మకమైన కోఆపరేటివ్ దుకాణాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా నాణ్యమైన ఇన్పుట్ సరఫరా ఇంకా సమగ్రంగా నిలబడకపోవడం వల్ల రైతు మార్కెట్లోకి వచ్చేసరికి దాని నిజస్వరూపం గుర్తించే శాస్త్రపరమైన సాధనాలు చేతిలో లేకపోవడం కూడా పెద్ద సమస్య. ఈ పరిస్థితిలో ప్రయోగాత్మక వంగడాలు వేసే అవకాశమూ లేకపోవడంతో ఒక సీజన్లో జరిగిన పొరపాటు తరువాతి రెండుమూడు సంవత్సరాల వరకు అప్పు బాటలో జరపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

మూడవ సమస్య రైతు చేతిలో పెట్టుబడి లేక ఆర్థికంగా ఇబ్బంది పడడం. దేశ ఉపాధి నిర్మాణంలో వ్యవసాయం 42-46 శాతం పని దళానికి ఉపాధి ఇస్తున్నా ఆర్థికోత్పత్తిలో దాని వాటా 16 శాతానికి మాత్రమే పరిమితమయ్యింది. అంటే ప్రతి వ్యవసాయ కార్మికుడికి వచ్చే ఉత్పత్తి విలువ, ఆదాయం ఇతర రంగాలతో పోలిస్తే బాగా తక్కువ. ఈ ఆదాయం నుంచి కుటుంబ అవసరాలు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఖర్చులు తీర్చుకున్నాక పెట్టుబడిగా పొలంలో తిరిగి పెట్టడానికి రైతు చేతిలో మిగిలేది చాలా స్వల్పం. నాభార్డ్ సర్వే ప్రకారం అప్పుల్లో ఉన్న వ్యవసాయ కుటుంబాల సగటు బకాయా అప్పు రూ.1,04,602గా నమోదయ్యింది. దీన్ని చూస్తే చిన్న రైతు వద్ద ఉన్న భూమి విలువ, పంట ఉత్పత్తి విలువతో పోలిస్తే అప్పు భారమే ఎక్కువగా ఉందని అర్థమవుతుంది. ఎరువుల ధరల మార్పులు, డీజిల్, విద్యుత్ ఛార్జీలు, కార్మిక వేతనాలు, నీటి అద్దెలు నిరంతరం పెరుగుతుంటే కనీస మద్దతు ధరలు అన్ని పంటలకు వర్తించకపోవడం, మార్కెట్‌లో మధ్యవర్తుల ఆధిపత్యం తీరని సమస్యలుగా నిలుస్తున్నాయి. పంట బీమా పథకాలు అమల్లో ఉన్నా క్లెయిమ్‌లు వచ్చేసరికి సర్వే ప్రక్రియలలో లోపాలు, ఆలస్యం, కంపెనీ-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సెటిల్‌మెంట్లు సాగదీత తదితర కారణాలతో రైతుకి సమయానుకూల సహాయం చేరకపోవడం కూడా అతని ఆర్థిక బలహీనతను మరింత లోతుగా నెడుతోంది.

నాలుగవ సమస్యగా రైతుకు అప్పులు ఎక్కడ పుట్టకపోవడం, అంటే సకాలంలో సరైన వడ్డీ రేటుతో సురక్షితంగా లభించాల్సిన సంస్థాగత రుణం చాలామంది రైతులకు లభించకపోవడం. నేడు ఆర్థిక సమావేశంపై ప్రభుత్వాలు, బ్యాంకులు చేసే ప్రయత్నాల వల్ల వ్యవసాయ కుటుంబాల్లో సంస్థాగత రుణాల భాగస్వామ్యం పెరిగింది. తాజా 2021-22 డాటా ప్రకారం వ్యవసాయ కుటుంబాలు తీసుకున్న మొత్తం అప్పుల్లో విలువ పరంగా 87 శాతం సంస్థాగత మార్గాల ద్వారానే ఉండగా, సంస్థాగత మూలాల నుంచి అప్పు తీసుకున్న వ్యవసాయ కుటుంబాల శాతం 2016-17లో 60.5 నుంచి 2021-22లో 75.5కి పెరిగింది. అయినా మొత్తం రైతు సమాజంలో అరకు పైగా కుటుంబాలు అప్పుల్లో మునిగిపోయే స్థాయి 52-53 శాతం వద్దే ఉండటం, ఈ అప్పులు కూడా గణనీయమైన వడ్డీ రేట్ల వద్ద ఉండటం రైతు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తీవ్రంగా పరిమితం చేస్తున్నాయి. అదనంగా 23-24 శాతం వ్యవసాయ కుటుంబాలు ఇంకా నాన్-ఇన్‌స్టిట్యూషనల్ మూలాలైన గ్రామ సాహుకారులు, కమిటీలు, వ్యక్తిగత అప్పులపై ఆధారపడి ఉన్నట్టు నాబార్డ్ డాటా స్పష్టం చేస్తోంది. చిన్నభూమి ఉన్న రైతుకు తగిన కోలాటరల్ లేకపోవడం, పాత బకాయిల కారణంగా రికార్డులు దెబ్బతినడం, బ్యాంకుల్లో ఫైళ్లు తిరిగే వ్యవస్థపై అవగాహన లేకపోవడం వంటి అనేక కారణాల వల్ల ఈ రైతు వర్గానికి అధికారిక బ్యాంకు రుణం "ఎక్కడ పుట్టకపోవడం" వాస్తవంగా మిగులుతోంది. ఫలితంగా రైతు సోకే అడ్వాన్స్‌లు, వస్తురూపంలో ఇచ్చే ఇన్‌పుట్ రుణాలు అధిక వడ్డీతో తిరిగి తీసుకోవాల్సి రావడం, పంట యాజమాన్యంపై లోని ప్రమాదాన్ని తాను ఒక్కడే భరించాల్సి రావడం జరుగుతోంది.

ఈ ఆర్థిక కష్టాలు, ప్రకృతి వైపరీత్యాలు కలసి మనం ఎక్కువగా స్పష్టంగా చూసే దృశ్యంగా రైతు ఆత్మహత్యల సమస్యగా బయటపడుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 డాటా ప్రకారం ఆ ఏడాది దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారి మొత్తం సంఖ్య 1,71,418లో వ్యవసాయ రంగానికి చెందిన వ్యక్తులు 10,786 మంది. వీరిలో 4,690 మంది పంట పండించే కర్షకులు, 6,096 మంది వ్యవసాయ కూలీలు.

ఇన్నాళ్లుగా రైతు సమస్యలను సంఖ్యల రూపంలో మాత్రమే చూసిన దృష్టికోణం నుండి బయటకు వచ్చి రైతు జీవితం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అమూల్యమైన వ్యవస్థగా చూడాల్సిన అవసరం స్పష్టమవుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుంచి మార్కెట్ అస్థిరతల దాకా, కల్తీ ఇన్‌పుట్‌ల నుంచి అప్పు బారిన పడే వాస్తవాల దాకా, ఈ నలుదిశలా కుదిపే సంక్షోభం రైతు ఒక్కడి సమస్య కాదు దేశ సామూహిక బాధ్యత. సమగ్ర వ్యవసాయ విధానాలు, బలమైన మద్దతు వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం, నమ్మదగిన మార్కెట్లు రైతుకు చేరితేనే ఈ విరుగుడులు తగ్గుతాయి. రైతు బతికినప్పుడే దేశం బతుకుతుంది రైతు నవ్వినప్పుడే జాతి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం.**

# కగార్ యుద్ధంలో మనమేవైపు?



నేడు జరుగుతున్న కగార్ యుద్ధం మావోయిస్టుల నిర్మూలన కోసం కాదు. ప్రజల్ని కావాలని అలా భ్రమింప చేస్తున్నారు. అక్కడ ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ల పరం చేసుకోవడానికి ప్రభుత్వంతో ప్రజలపై కార్పొరేట్లు చేస్తున్న యేద్ధమే కగార్ యుద్ధం. ఆదివాసీల కాళ్ళ కింద ఖనిజ సంపద ఉన్నందుకు 2005 నుంచి ఆదివాసీలు వేటాడి వెంటాడి చంపబడుతున్నారు. ఏ ఒక్క హత్యాకాండపై కూడా ప్రభుత్వాలు చట్టపరంగా వ్యవహరించకుండా న్యాయాన్ని కనపడకుండా చేస్తున్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు కార్పొరేట్లు ఖనిజ సంపదను ఏ విధంగా దోచుకెళ్ళాలని అనేక రకాలుగా ప్రయోగాలు చేస్తున్నారు. ఆ ప్రయోగాలను అమలు చేస్తున్నది ప్రభుత్వాలే. అదే 2005 సల్వాజుడుం 2024 ఆపరేషన్ కగార్. సల్వాజుడుంలో 1000 మందికి పైగా ఆదివాసీలు హత్యగావించబడితే నేడు జరుగుతున్న కగార్ యుద్ధంలో ఇప్పటికైతే 800లకు పైగా మరణాలు బయటికి వచ్చాయి. అవి మావోయిస్టులవి కావచ్చు, ఆదివాసీలవి కావచ్చు. లొంగుబాటులకైతే లెక్కేలేదు. అయితే జరుగుతున్న లొంగుబాట్లు కూడా అందరు కూడా క్యాంపుల్లో బందీలుగా ఉండిపోతున్నారు. ఈ కగార్ యుద్ధం హింసా ప్రతిహింసల గురించి చర్చించే అవకాశమే లేకుండా పోయింది. ఎందుకంటే హక్కుల సంఘాలను, ప్రజాస్వామిక వాదులను ఘటనలపై విచారించే అవకాశమే లేకుండా చేస్తున్నారు. చివరికి బస్తర్ ప్రాంతాన్ని భారతదేశంలోనే ఒక నిషేధ ప్రాంతంగా మార్చేసింది. మనం ఎవ్వరం కూడా అక్కడికి వెళ్ళలేము. చివరికి ఆదివాసీ నాయకుడు మాడివి హిడ్మా అంత్యక్రియలకు కూడా ఎవ్వరినీ వెళ్ళనీయకుండా ప్రభుత్వం కట్టుదిట్టం చేసింది. వెళ్ళిన ఆదివాసీ హక్కుల కార్యకర్త సోనీసోరీపై నిర్బంధాన్ని అమలు చేసింది. ఇది 20 ఏళ్ళుగా జరుగుతున్న ఆదివాసీలపై దాడి. ఈ దాడిలో ఆనాటి నుంచి ఈనాటి వరకు వాళ్ళ జీవించే హక్కు అమలు జరగడం కన్నా వేటాడబడుతున్నాయనేది సత్యం. అది కూడా ప్రభుత్వ బలగాలచే ప్రభుత్వం నియమించిన సాయుధ బలగాలే. కాబట్టి రాజ్యాంగం అమలు కాని చోట ఆదివాసీ చట్టాలు అమలు కాని చోట ఆదివాసులు పోరాడుతూనే ఉంటారు. ఆ పోరాటాన్ని నిశ్శబ్దం చేయడానికి ప్రభుత్వాలు యుద్ధాలు ప్రకటిస్తూనే ఉన్నాయి. ఆ యుద్ధంలో మనమెటువైపో తేల్చుకోవాల్సిన పరిస్థితి మనందరిపై ఉన్నది. ప్రభుత్వాలు మాత్రం కార్పొరేట్ల వైపున్నట్లుగా ప్రకటిస్తూ ఈ హత్యాకాండను కగార్ యుద్ధాన్ని నిలువరించడంలో అచేతనంగా మారాయి. చివరికి శాంతి చర్చలను జరపడానికి కూడా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేలేని అసహాయ స్థితిలో ఉన్నది. కాబట్టి యుద్ధం ఆగినా, ఆగకపోయినా ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాడుతారనేది మాడివి హిడ్మాను పోరాట స్ఫూర్తిగా తీసుకుంటున్నారనేది జరిగిన పరిణామాల వలన తెలుస్తున్నది.

మధ్యభారతంలో చత్తీస్‌ఘడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, ఝార్ఖండ్, మహారాష్ట్ర లో ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న మావోయిస్టు ఉద్యమం సాయుధంగా కొనసాగుతుందని దాని అణచివేత పేరుతో ఒక పెద్ద యుద్ధాన్నే భారత పాలక వర్గాలు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలనే తేడా లేకుండా నిరంతరం కొనసాగిస్తూనే వస్తున్నాయి. దానికి ఆపరేషన్ కగార్ అనేది పరాకాష్టగా మారింది. కానీ కగార్ భౌతికంగా మధ్యభారతానికే పరిమితం కావచ్చు కాని విషయ పరంగా మాత్రం అది దేశం ఎల్లలను కూడా దాటిపోయింది. ఈ అణచివేత అనేది దేశంలో ప్రజాస్వామ్యమో రాజ్యాంగం న్యాయవ్యవస్థ అనేది ప్రజలకు ఏ రకంగా ఉపయోగపడవు, కేవలం పెట్టుబడిదార్లకు సామ్రాజ్యవాదులకు రాజకీయ నాయకులకు మాత్రమే ఉపయోగపబడాయి.

1980లో ప్రవేశించిన దండకారణ్య విప్లవోద్యమం ఈనాటికి సరిగ్గా 55 ఏళ్ళ ఉద్యమంగా గుర్తించవచ్చు. ఈ విప్లవోద్యమంలో విప్లవకారులు తమ సమస్యలు, తమ స్వార్థాల కన్నా ప్రజల సమస్యలు, భూమి సమస్యలు, ఆదివాసీ హక్కుల చట్టాలు, పేసా చట్టం, అటవీ హక్కుల చట్టం, గ్రామ సభ తీర్మాణము, 5వ షెడ్యూలు, 6వ షెడ్యులు వీటినన్నింటిని అమలులోకి తేవాలనే పోరాటమే ఆదివాసీల పోరాటంగా ముందుకు తీసుకువచ్చాము. ఇందులో భాగంగానే జార్ఖండ్ నుండి మొదలు పెడితే బస్తర్ వరకు పెట్టుబడిదారులు పెట్టబడులు పెట్టడానికి కొన్ని దశాబ్దాల కాలం వారికి అనుకూలించని పరిస్థితి ఏర్పడింది. ఆ స్థితిలో నుండే ఉద్యమాన్ని అణచాలనే ఒక ప్రక్రియలో భాగంగా సల్వాజుడుం, గ్రీన్‌హంట్, సమాధాన్, ప్రహార్ లాంటి మిలటరీ ఆపరేషన్లను ప్రభుత్వాలు కొనసాగించాయి. చివరికి 2008లో ఏర్పడినటువంటి అత్యున్నత నిపుణుల కమిటి అనేక సలహాలను నిర్ణయాలను ప్రభుత్వానికి తెలియజేసింది కూడా. ఆ కమిటీ కూడా నక్సలైట్లు లేవనెత్తుతున్న సమస్యల్లో సామాజిక ఆర్థిక రాజకీయ అంశాలున్నాయి. వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకునే ప్రయత్నం ప్రభుత్వం చేయాలని ఆ కమిటీ, హక్కుల సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాయి. ఒకవైపు సల్వాజుడుం మీద దాన్ని రద్దు చేయాలని తీర్పు 2011 లో వచ్చేనాటికే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను 2009లో ప్రకటించి, పారామిలటరీ బలగాల క్యాంపులను ఏర్పరచి ఆదివాసీల అణచివేతను కొనసాగిస్తున్న స్థితి ఏర్పడింది. సల్వాజుడుం ను నిలువరించాలనే బుద్ధిజీవుల ప్రయత్నం ఆచరణకు రాకుండానే మరొక అణచివేత క్యాంపేయిన్‌కు ప్రభుత్వాలు ప్రారంభించాయి. 2005 నుంచి 2011 వరకు 644 గ్రామాలు 1,50,000 మంది ఆదివాసీల విస్తాపన 1,085 మంది ఆదివాసీల హత్యాకాండతో సల్వాజుడుం విధ్వంసం కొనసాగింది. ఏ ఒక్క ఘటన మీద న్యాయవ్యవస్థ స్పందించలేదు. ఆదివాసీలు ఈ దేశ ప్రజలు కాదన్నట్టుగానే దేశంలో ఉన్న అన్ని ప్రతిపక్ష పార్టీలు వ్యవహరించాయి. వారికి న్యాయం దొరికే అవకాశమే లేని స్థితి కొనసాగింది. 2009 లో ప్రారంభమైన గ్రీన్‌హంట్ అనేక ఎన్‌కౌంటర్లతో ఆదివాసీలను ఉద్యమకారులను అత్యంత క్రూరంగా హత్య చేసిన స్థితి కొనసాగింది. అందులో భాగంగానే 2011లో ఆనాడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కిషన్‌జీని కూడా అత్యంత కిరాతకంగా చంపారు. ఉద్యమకారులను ఇంత కిరాతకంగా చంపుతున్నారంటే ఆదివాసీలను ఇంకెంత ఘోరంగా చంపారో మన భాషలో చెప్పలేము. 2014 ఉంచి మోడి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ఉద్యమ అణచివేతకు సంబంధించి హత్యాకాండను మిలిటరీ బలగాలను విశ్వసించడమే తప్ప ఒక్కసారి కూడా ఒక శాంతియుత పరిష్కారం వైపుగా మోడీ ప్రభుత్వం కొనసాగలేదు. కానీ 2004 ఆంధ్రప్రదేశ్ చర్చల కాలం తరువాత కేంద్రం నుంచి చిదంబరం తర్వాత మోడీ ప్రభుత్వం కూడా చర్చలకు సుముఖమనే ప్రకటన నిరంతరం ఇస్తూ వచ్చింది. కానీ కేంద్రంలో చర్చల కోసం ప్రయత్నించిన నాయకత్వం కూడా ఎన్‌కౌంటర్లో చంపబడింది. అందులో భాగమే ఆజాద్, హేమచంద్రపాండేల వాంకిడిలో జరిగిన హత్యాకాండ. 2024 నుంచి ప్రారంభమైన ఆపరేషన్ కగార్ కూడా ఈ వ్యాసం రాసే సమయానికి 780కి పైగా హత్యాకాండలను కొనసాగించింది. చివరిగా మల్కాన్‌గిరిలో నవంబర్ 18, 19 తేదీలలో జరిగిన ఎన్‌కౌంటర్లను మనం గుర్తించవచ్చు. మొత్తంగా హిడ్మా బూటకపు ఎన్‌కౌంటర్‌ను పరిశీలిస్తే ఒక ఆదివాసీ, 5వ తరగతి మాత్రమే చదివిన వాడు, దేశ విప్లవోద్యమంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో కేంద్ర కమిటి స్థాయికి ఎదగడమనేది ఒక గొప్ప పరిణామంగా భారత దేశంలోని వివిధ వర్గాలు భావిస్తున్నాయి. నేడు ఆదివాసీ స్థాయి నుంచి విప్లవకారుడిగా మారిన హిడ్మా ను అదే స్థాయిలో సజీవంగా పట్టుకొని చిత్రహింసలకు గురి చేసి మారెడుమిల్లి ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లుగా ప్రకటించి హత్య చేయడమనేది ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. నేడు ప్రజలు ప్రతిపక్షాలందరు కూడా హింసను,కగార్ హత్యాకాండను అమలు చేస్తున్న మోడీ,షాల గురించి చర్చించడం లేదు. విప్లవోద్యమంతో పాటు ఎదిగి వచ్చి కేంద్రకమిటి స్థాయికి ఎదిగినటువంటి మాడివి హిడ్మా గొప్పతనాన్ని దేశం చర్చించుకుంటుంది. విశ్వవిద్యాలయాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. నేరస్తులుగా మోడీ కేంద్ర ప్రభుత్వం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వంగా మిగిలిపోయాయి. ఈ నేపథ్యంలో ఇది హింసా ప్రతిహింసల మధ్య చర్చలుగానే యుద్ధాలుగానే అర్థశతాబ్దానికి పైగా కొనసాగుతున్నాయి. ఇది మావోయిస్టులకు ప్రభుత్వాలకి మధ్య యుద్ధం అసలే కాదు. ఏవైతే రాజ్యాంగం కల్పించిన హక్కులున్నాయో వాటిని అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన పార్టీలు ప్రభుత్వాలుగా మారి ప్రజల్ని విభజించి పాలించి ప్రజల్లో అంతర్గత దాడులు చేయించడం తప్ప ఒక ప్రజాస్వామిక పరిపాలన కొనసాగించడం లేదు. నిజంగానే ప్రజలందరికి సమస్యలు ఉన్నాయి. ఆ సమస్యలపై ప్రజలు ప్రజాస్వామిక పద్ధతిలలో పోరాటాలు చేశారు. ఫలితాలు శూన్యమైన నేపథ్యంలో తప్పనిసరై పీపుల్స్ వార్ ఉద్యమం వైపు వారి ఆచరణను ఎన్నుకున్నారు. ప్రజలు సాయుధ పోరాటాలు చేస్తున్నారని ప్రభుత్వాలు సాయుధంగా అణచివేయడానికే బూటకపు ఎన్‌కౌంటర్ అణచివేత విధానాన్ని కోరుకున్నారు. కానీ ఈ హింసా ప్రతిహింసల మధ్య విధానాన్ని ప్రజాస్వామిక పద్ధతిలో పరిష్కరించాలని ప్రభుత్వాలు ఎన్నుడూ భావించలేదు. మావోయిస్టు ఉద్యమాన్ని, నక్సలిజాన్ని నిర్మూలించడం అంటే ప్రజల మౌళిక సమస్యలను పరిష్కరించడమనేదే అంతిమం. కానీ ప్రభుత్వాలు కార్పొరేట్లతో సామ్రాజ్యవాదులతో దళారులుగా మారిన నేపథ్యంలో ప్రజల సమస్యలను పరిష్కరించకుండా వాటిని అణచివేయడానికి సాయుధ బలగాలను సాంకేతికతను పెంచుకోవడమే లక్ష్యంగా అణచివేత సాధనాలనైతే తమ బడ్జెట్‌ను తరలిస్తున్నాయి తప్ప విద్యా వైద్యం జీవనోపాధి అంశాలపై ప్రభుత్వాలు ఎప్పటికి కూడా ఒక శాస్త్రీయమైన దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వాలు అణిచివేతకు సాధికారతను తెచ్చుకోవడం కోసం న్యాయవ్యవస్థను, పత్రికా వ్యవస్థను నిశ్శబ్దం చేయడం, తమ ఆధీనంలోకి తెచ్చుకోవడంతో ప్రభుత్వాలపై ఉన్నటువంటి అవిశ్వాసమే ఈ వ్యవస్థలపై ఏర్పడుతుండడంతో ప్రజలకు కూడా పోరాటం తప్ప మరో మార్గం లేదనే విషయం స్పష్టమవుతుంది. కాబట్టి ప్రభుత్వాలు తమ నేర స్వభావం బహిర్గతమైనప్పటికి తాము దోపిడి వర్గం తొత్తులుగా ఉన్నామనే విషయం తెలిసినప్పటికి ప్రజాస్వామిక విలువలు రాజ్యాంగం అమలులో భాగంగా ప్రజల్ని శాంతియుతంగా పరిపాలిస్తామనే ఆశ్వాసాన్ని ప్రజలకు ఇవ్వగలిగితే హింసా ప్రతిహింసల స్థానంలో ఒక ప్రజాస్వామిక శాంతి ఏర్పడుతుంది. ఏదైనా మొదలు కావడమే కష్టమైన స్థితి. ఇది ప్రజలకు చెందని ప్రజాస్వామ్యంగా భారత ప్రజాస్వామ్యం మిగిలిపోతుందనే విషయం ప్రజలందరికి తెలియవచ్చింది. అందులో భాగంగానే బస్తర్ పర్యావరణ విధానం దేశ రాజధాని ఢిల్లీలో అమలు చేయాలని ఢిల్లీలో ఉన్న విద్యార్థి రంగం బహిరంగంగా నినాదాలు చేయడం, బయటికి రావడం చివరికి మాడివి హిడ్మేను తమవాడిగా భావించడం చూస్తేనే ప్రభుత్వాలు ప్రజలకు అనుగుణమైన పాలనను అందివ్వడం లేదు. పర్యావరణం పూర్తిగా విషతుల్యంగా మారి జీవించే హక్కును హరిస్తున్నప్పటికి ప్రభుత్వాలు పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. కానీ మధ్యభారతంలో ఆదానికి ఇచ్చిన 28 బొగ్గు బ్లాకల నేపథ్యంలో 3 లక్షల వృక్ష సంపదను నరికివేస్తున్నారు. ఇప్పటికి రెండు లక్షలకు పైగా నరికివేయబడ్డాయి. దేశరాజధానిలో శ్వాస తీసుకోవడం కూడా కష్టమైపోయింది. దానికి సంబంధించి ఇప్పటికి కూడా ప్రభుత్వం దగ్గర సరియైన పరిష్కారం లేదు. విశ్వవిద్యాలయ విద్యార్థులు, బస్తర్‌లో అమలు జరుగుతున్న పర్యావరణ విధానాన్ని దేశ రాజధాని ఢిల్లీలో అమలు చేయాలని కోరుకోవడం ఏ విధంగా నేరమవుతుంది. అడవిని కాపాడి పర్యావరణాన్ని రక్షించి ఢిల్లీ ప్రజల జీవించే హక్కును రక్షించడం కోసం ఆదాని బొగ్గుగణుల కోసం అడవి నరికివేతను నిలిపివేసే ప్రక్రియను చేపడితే కొంతవరకైనా బాగుండేది. అదీ గాక ఈ కగార్ నేపథ్యంలో హత్యలు నిలువరించడం కోసం చర్చలు జరపాలని 8 నెలలుగా మావోయిస్టు పార్టీ చేస్తున్న ప్రయత్నాన్ని పక్కకు నెట్టేసింది. ప్రభుత్వం పూర్తిగా హింసనే నమ్ముతున్నది. ప్రభుత్వం చర్చలకు శాంతికి సిద్ధపడడం లేదు. ఒకరకంగా ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా పరిపాలన చేయడం లేదు. కేవలం కార్పొరేట్ల కోసం అది కూడా ఆదాని, అంబానీల కోసమే పర్యావరణ విధ్వంసమైనా, మానవ హననమైనా ఎంతటి హింసనైనా కొనసాగించాలనే రాజ్యాంగ ఉల్లంఘనకు ప్రభుత్వాలు పాల్పడుతున్నాయి. మనం కూడా ఢిల్లీ లాంటి పరిస్థితిని ఎదుర్కోవలసిన పరిస్థితి వస్తుంది. కాబట్టి అందరికి జీవించే హక్కు ప్రమాదంలో పడుతుంది. ప్రభుత్వాల తప్పుడు నిర్ణయాలతో అర్బన్ ఏరియాలలో అటువంటి పరిస్థితి వస్తే దండకారణ్యం లాంటి చోట ఆపరేషన్ కగార్ లాంటి వాటితో ప్రభుత్వమే ఆదివాసీల ఉద్యమకారుల జీవించే హక్కును అణిచివేస్తున్నది. మౌనంగా ఉన్న మేధావుల్లారా మౌనం వీడక పోతే రేపు భారతదేశంలో జీవించే హక్కు ఎవ్వరికైనా ప్రమాదంగా మారే అవకాశం ఉన్నది. గతంలో 2012 బాసగూడ ఎన్‌కౌంటర్ పై నియమించిన అగర్వాల్ కమీషన్ 2019 షాద్‌నగర్ దిశ ఎన్‌కౌంటర్ పై నియమించిన సిర్పుర్కర్ కమీషన్‌లు ఇవి ఎన్‌కౌంటర్లు కావు ప్రభుత్వం హత్యలే అని స్పష్టంగా చెప్పినప్పటికి ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు కగార్ 80 ఎన్‌కౌంటర్లపై విచారణ కమీషన్‌లను ఏర్పాటు చేసిన అవి అటువంటి నివేదికలనే సమర్పిస్తాయి, కానీ ఫలితం మాత్రం శూన్యంగా ఉంటుంది. అందుకే ప్రజాస్వామిక వ్యవస్థ విఫలమైందనే భావన ప్రజలందరిలోకి బలంగా చేరుతుంది. ఇకనైనా ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పాటించే ప్రయత్నం చేయండి.



**ఎన్ నారాయణరావు**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**
**పౌర హక్కుల సంఘం**

# ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి



**శంకర్‌పల్లి, నవంబర్ 28 (జనం సాక్షి) :** శంకర్‌పల్లి మండలంలో గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు,మెంబర్ల ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ సూచించారు.శంకర్ పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకయ్య గౌడ్ అధ్యక్షతన శుక్రవారం ఎన్నికల కోఆర్డినేషన్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో చేవెళ్ల ఆర్డిఓ చంద్రకళ మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డ్ మెంబర్ల ఎన్నికల గాను 8 క్లస్టర్ గ్రామాలుగా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబర్ రెండవ తేదీ వరకు క్లస్టర్ గ్రామాలలో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్లస్టర్ గ్రామాలలో నామినేషన్లు ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. 3వ తేదీన నామినేషన్ల పరిశీలన,అనంతరం 6వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. తదనంతరం పోటీలో ఉండే అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.డిసెంబర్ 14వ తేదీన సర్పంచ్ వార్డ్ మెంబర్ల ఎన్నిక ఉదయం 7 గంటల నుంచి ఒకటి గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరిగి తదనంతరం ఫలితం ప్రకటిస్తారని తెలిపారు. వార్డ్ మెంబర్ల ఎన్నిక పూర్తి అవ్వగానే ఉపసర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహిస్తారని తెలిపారు. పోటీ చేయదలచిన అభ్యర్థులు తప్పనిసరిగా గ్రామపంచాయతీకి సంబంధించిన బకాయిలు చెల్లించాల్సి ఉంటుందని గ్రామ కార్యదర్శి నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ జత చేయాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ కేంద్రాలలోనూ పోలింగ్ కేంద్రాలలోనూ కౌంటింగ్ కేంద్రాలలోనూ మొబైల్ ఫోన్లు నిషేధమని తెలిపారు.అదేవిధంగా పోటీ చేయదలచిన వారు తప్పనిసరిగా కొత్తగా బ్యాంక్ అకౌంట్ తెరిచి నామినేషన్ పత్రంతో జత చేయాలని సూచించారు. నార్సింగ్ ఏసీపీ రమణ గౌడ్ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మండలంలో రెండు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో ఎన్నికలు పూర్తయ్యేంతవరకు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం జరుగుతుందని తెలిపారు.ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో వెంకయ్య గౌడ్ ,ఎన్నికల మాస్టర్ ట్రైనర్ జయసింహారెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ అభ్యర్థులు( జనరల్) రూ. 2వేలు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు %=o%. 1000 చెల్లించాలని, వార్డు మెంబర్లు జనరల్ అభ్యర్థులు అయితే రూ. 500, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు అయితే రూ. 250 చెల్లించాలని తెలిపారు.పోటీలో ఉండే అభ్యర్థులు తప్పనిసరిగా ఆస్తుల వివరాలు ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి చేవెళ్ల డివిజన్ వ్యవసాయ సంయుక్త సంచాలకులు సురేష్ బాబు, తహసిల్దార్ సురేందర్, డిప్యూటీ తహ సిల్దార్ బాలకృష్ణారెడ్డి, మండల పంచాయతీ అధికారి గిరిరాజ్, శంకర్ ప ల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్, మోకిల సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరబాబు మరియు రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు రూట్ అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తపస్ కొడంగల్ నియోజకవర్గ నాలుగు మండలాల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



**బొంరాస్‌పేట, నవంబర్ 28 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ కొడంగల్ నియోజకవర్గం నాలుగు మండలాల నూతన కార్యవర్గాన్ని వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుంకరి వెంకటయ్య అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఎన్నికల పరిశీలకులు హనుమప్ప,ఎన్నికల అధికారి అనిల్ తెలిపారు.కొడంగల్ మండల నూతన అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా పృధ్వి సింగ్,నాగప్ప,దౌల్తాబాద్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా నాగేష్, బసప్ప,దుద్యాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా శంకరప్ప,తేజస్విని, బొంరాస్ పేట మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా బాకారం చంద్రశేఖర్, మహేష్ ఎన్నికయ్యారు.అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య మాట్లాడుతూ తపస్ జాతీయ భావాలు కలిగిన దేశభక్తి,క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే నిబద్ధత కలిగిన ఏకైక సంఘంగా అభివర్ణించారు.ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి తపస్ ముందుంటుందన్నారు.ఉపాధ్యాయులకు రావాల్సిన పిఆర్సి ,డిఏలు,పెండింగ్లో ఉన్న జిపిఎఫ్ బకాయిలు,సిపిఎస్ స్థానంలో ఓపిఎస్ అమలు,సీనియర్ ఉపాధ్యాయుల టెట్ సమస్యలపై తీర్మానం చేసి జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి పంపించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సంగమేష్, బాలరాజు, మొగులప్ప,శ్రీనివాస్, ఆశప్ప, నారాయణ,శ్రీనివాస్ రెడ్డి,క్రాంతి కుమార్, లక్ష్మీనారాయణ, రమేష్, రాఘవేంద్ర, శ్రీహరి,తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి పూలే



**హయత్‌నగర్, నవంబర్ 28 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యం లో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని పురస్కరించుకొని మండల సహాయ కార్యదర్శి మర్రి శోభన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రం లో జ్యోతిరావు పూలే విగ్రహానికి సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పూల మాలవేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగు నింపడం కోసం అహర్నిశలు కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని వారు అన్నారు. 1000 సంవత్సరాల చీకటిని కూడా ఒక దీపం వల్ల వెలుతురు వస్తుందని, విద్య ద్వారానే ఈ సమాజంలో సామాజిక న్యాయం జరుగుతుందని వారు తెలిపారు. బడుగు, బలహీన, అట్టడుగు వర్గాలకు చెందినటువంటి వారికి కులాల పేరుతో వెనుకబాటు తనం వల్ల విద్యకు దూరమైన బిడ్డలకు విద్యను అందించే మహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టిన మహోన్నత వ్యక్తి పూలే. దేశంలో అణగారిన వర్గాలు ఎప్పుడైతే విద్యా కుసుమాలవుతారో అప్పుడే వారికి సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పేసి ఆ కాలంలోనే ఉద్ఘాటించారు. వారు ఈ సమాజంలో ఉన్నటువంటి మహిళలకు విద్యను అందించినట్లయితే వారి కుటుంబాలు భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని చెప్పి తన భార్య అయినటువంటి సావిత్రిబాయి పూలే కు విద్య నేర్పించి ఈ దేశంలో ఉన్నటువంటి అట్టడుగు వర్గాల మహిళలకు ఉచితంగా విద్యను అందించినటువంటి మహోన్నత చదువుల తల్లి సరస్వతి సావిత్రిబాయి. మహిళా అభ్యుదయ వాది నిరంతరం అట్టడుగు వర్గాల మహిళల విద్యాభివృద్ధికి పాటుపడిన ఆదర్శప్రాయుడు అని వారు తెలియజేశారు. వారి సేవలు అణగారిన కులాలను విద్యా కుసుమాలు చేసి సమాజంలో అభివృద్ధికి పాటుపడుతున్నటువంటి అట్టడుగు వర్గాల లభ్యున్నతి కోసం ఈ ప్రభుత్వాలు సహకారం అందించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో మండల సహాయ కార్యదర్శి కర్నే సుజాత, ఏ.ఐ.ఎస్.ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశీవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బి అరుణ్ కుమార్ గౌడ్, మహిళా సమైక్య మండల ప్రధాన కార్యదర్శి కోప్పుల సరిత, శాఖా కార్యదర్శులు పారిజాత, అరుణ, సౌజన్య, కళ్యాణి, సుమతి, బిఓసి మండల కార్యదర్శి వీరస్వామి, కళ్యాణి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం

- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్



**బోడుప్పల్, నవంబర్ 28 (జనంసాక్షి) :** అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు.బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం అవరణంలో శుక్రవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్యాం సుందర్ రావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు హాజరై లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు.పట్టాలు అందుకున్న వారిలో ఆనందం వెల్లివిరిసింది.నాయకులకు, కమిటీ సభ్యులకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సంధర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేరుతుందని,సన్న బియ్యం పంపిణి, రెండు లక్షల రూపాయలు రుణమాఫీ వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల విద్యుత్తు వంటి అభివృద్ధి పనులు చెప్పట్టిందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంపు ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో పేద ప్రజల గృహావసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ పథకం ఎంతోమందికి ఊరటనిస్తుందన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రతా చిహ్నమన్నారు. సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఈ రోజు చిరస్మరణీయం రోజని గుర్తు చేశారు. లబ్ధిదారుల ఎంపికలో న్యాయం, సమానత్వం పాటించామని కమిటీ సభ్యులతో కలిసి కృషి చేశామని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇండ్ల నిర్మాణం జరిగే వరకు సహాయ సహకారాలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన మున్సిపల్ అధికారులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ,మేడ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్లు బోమ్మక్ కళ్యాణ్ కుమార్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,భూక్య సుమన్ నాయక్,సీసా వెంకటేష్ గౌడ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు మరాటి మల్లేష్,ఎ.రాములు,దయ్యాల అలివేలు,ఉప్పుగళ్ళ ప్రశాంత్,రాహూల్,వార్డు ఆధికారులు,లబ్దిదారులు పాల్గోన్నారు.

# నామినేషన్ వేసిన అభ్యర్థుల డిక్లరేషన్ తప్పనిసరి



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 28 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ వేసిన అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. శుక్రవారం గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ కేంద్రంలో ఆత్మకూర్ తో పాటు సంగాల, గోనుపాడు,మదనపల్లి, ఈడిగోనిపల్లి గ్రామపంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను కూడా స్వీకరిస్తుండడంతో ఆయా పంచాయతీల ఓటర్ లిస్టును కలెక్టర్ పరిశీలించారు. ఓటరు జాబితాలో పోటీ చేసేందుకు నామినేషన్ వేసే అభ్యర్థుల క్రమసంఖ్య, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నామినేషన్ పత్రాల్లో నమోదు చేయాలన్నారు.ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేసే ఆయా వర్గాల అభ్యర్థులతో నిర్దేశించిన డిపాజిట్ మాత్రమే తీసుకొని తగిన రసీదును అందజేయాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారులు దరఖాస్తులను స్వీకరించే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా పంచాయతీ సర్పంచి, వార్డు స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, వ్యయముల ఖాతా నిర్వహణ,తదితర ఫారాలను అవసరమైన మేరకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఎన్నికల ఖర్చుల లెక్కల నిర్వహణపై అభ్యర్థి దాఖలు చేయాల్సిన డిక్లరేషన్ ఫారాలపై అన్ని అంశాలను తప్పనిసరిగా రాసేలా అవగాహన కలిగించాలన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లో నమోదు చేయాలని, కేటాయించిన విధుల్లో అలసత్వం వహించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల వివరాలను నోటీసు బోర్డులో అతికించాలన్నారు. హెల్ప్ డెస్క్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి కలెక్టర్ తగు సూచనలు చేశారు.సాయంత్రం ఐదు గంటల లోగా నామినేషన్ వేసేందుకు కేంద్రంలోకి వచ్చిన అభ్యర్థుల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించాలని, నిర్దేశిత సమయం దాటిన తర్వాత కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. ఈ పర్యటనలో జిల్లా ఎన్నికల జనరల్ పరిశీలకులు గంగాధర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**తాండూరు, నవంబర్ 28 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.శుక్రవారం పెద్దేముల్, యాలాల్ మండలాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ నామినేషన్ల కు సంబంధించి ప్రక్రియను క్లస్టర్ల వారిగా కేంద్రాలను పరిశీలించారు. పెద్దేముల్ మండలం మన్సాన్ పల్లి, మంబాపూర్, కందనెల్లి క్లస్టర్ లలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా యాలాల్ మండలం కోకట్ క్లస్టర్ లో నామినేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.గ్రామ ప్రంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. అవసరానికి అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావలసిన ధృవ పత్రలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలని ఆయన తెలిపారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో ఏవైనా తప్పులు వుంటే సరిచేసుకునే విధంగా అభ్యర్థులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలో పోటీ చేసే అభ్యర్థలకు వ్యయాలకు సంబంధించి బ్యాంకు ఖాతలు ఉండాలని ఆయన సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లు నిబంధనలకు అనుగుణంగానే ఖర్చులు పెట్టాలనే విషయము అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నామినషన్ల కేంద్రాల పరిశీలనలో ఎంపీడీఓలు రతన్ సింగ్, శ్రీనిజ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దాం




**చేవెళ్ల, నవంబరు 28 (జనంసాక్షి) :** పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే ఎన్నో పోరాటాలు చేశారని సమతాసైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేష్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బెగరి ప్రభాకర్, చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భారతదేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా కొట్లాడి పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారన్నారు. దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్)ను ఏర్పాటు చేశారన్నారు. పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణెలో ప్రారంభించారని, వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించారన్నారు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన దేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయులుగా ఈ దంపతులు నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ జిల్లా అధ్యక్షులు మాచన్ పల్లి రామస్వామి, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచన్ పల్లి రాంచందర్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు మల్లెపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కావలి గణేష్, సంఘం సభ్యులు బ్యాగరి శ్రీనివాస్, తలారి శ్రీనివాస్, బ్యాగరి భాస్కర్, సున్నపు నర్సింలు, మల్లేష్,ఎర్రవల్లి రామకృష్ణ, బేగరి డానియల్, నాయకులు జగన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం



**శేరిలింగంపల్లి, నవంబర్ 28 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కారు కోట్లాది రూపాయలు వెచ్చించి తెలంగాణ రాష్ట్రంలో నీలి విప్లవం సాధికారతకు తోడ్పాటు అందిస్తుందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు కొండాపూర్ డివిజన్ పరిధి దుర్గం చెరువులో ప్రభుత్వం తరఫున 100% సబ్సిడీపై ఉచితంగా పంపిణీ చేసిన లక్షా 50 వేల చేప పిల్లలను తెలంగాణ ఫిష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తో కలిసి అరికపూడి శుక్రవారం చేప పిల్లలను దుర్గం చెరువులో వదిలేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ విభాగం పక్షాన 100% సబ్సిడీపై పంపిణీ చేసిన చేప పిల్లలను దుర్గం చెరువులో లాంఛనంగా విడిచిపెట్టడం జరిగిందని, ఇవి పెరిగి పెద్దవై మత్స్య సంపద విశేషంగా అభివృద్ధి చెంది మత్స్యకారులకు ఆర్థిక సాధికారతకు తోడ్పాటునందిస్తుందన్నారు. రాష్ట్రంలో మత్స్య సంపదను గణనీయంగా మెరుగుపరచడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృతంలోని కాంగ్రెస్ సర్కార్ అనేక పథకాలను ప్రవేశపెడుతుందని, మత్స్యకారులు వాటిని వినియోగించుకొని వ్యక్తిగత ఆర్థిక అభివృద్ధితో పాటు సమాజం ఎదుగుదలకు దోహదపడాలని అరికెపూడి సూచించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులకు రాయితీలపై వాహనాలు, వలలు, తెప్పలు, ఇతర సామాగ్రిని సబ్సిడీపై అందజేస్తూ ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సహకారం తెలంగాణ రాష్ట్రంలో నీలి విప్లవం సాధించడానికి మెరుగైన పరిస్థితులను పెంపొందిస్తుందని, ప్రతి మత్స్యకారుడు ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వివిధ రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువులు, కుంటలలో సొసైటీల ద్వారా మత్స్యకారులను ఏకం చేసి వారికి తగిన సహాయ సహకారాలు అందజేస్తూ మంచి సంపదను అందిస్తూ చేయూతనిస్తుండడం సీఎం రేవంత్ రెడ్డి కార్యతక్షతకు నిదర్శనంగా ఆయన అభివర్ణించారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని 64 చెరువులలో భవిష్యత్తులో మత్స్య సంపదను మరింత పెంపొందించి వారి ఆర్థిక పురోభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, శేరిలింగంపల్లి మత్స్యకారులను మెరుగైన స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రాయదుర్గం ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ ప్రెసిడెంట్ సురేందర్ కుమార్, సభ్యులు శ్రీశైలం, నరేందర్, అశోక్, సురేష్, వీరస్వామి, బిక్షపతి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 28 (జనం సాక్షి) :** గద్వాల మండలంలోని పరమాల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు సందర్శించారు.రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సర్పంచ్, వార్డ్ సభ్యుల నామినేషన్ స్వీకరణ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను ఆయన వివరణాత్మకంగా పరిశీలించారు. నామినేషన్ హాల్, అభ్యర్థుల సౌకర్యాల ఏర్పాట్లు,పత్రాల స్వీకరణ, పరిశీలన విభాగాలు,భద్రతా చర్యలు,సీసీ కెమెరాల వ్యవస్థ వంటి ముఖ్య అంశాలను ఆయన సమీక్షించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా,క్రమశిక్షణతో, నిబంధనలకు అనుగుణంగా సాగేందుకు అవసరమైన మార్గదర్శకాలను అధికారులు పాటిస్తున్నారా అనే విషయాన్ని కూడా ఆయన పరిశీలించారు. అధికారులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ నామినేషన్ స్వీకరణను పూర్తిగా నిష్పాక్షికంగా నిర్వహించాలని,అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాతావరణాన్ని సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజాస్వామ్య ప్రక్రియ విలువను దృష్టిలో ఉంచుకొని ప్రతి దశలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,ఎన్నికల శాఖ సిబ్బంది, పోలీసు శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
29 నవంబర్ 2025

# నామినేషన్ల స్వీకరణ సమర్ధవంతంగా నిర్వహించాలి

- పొరపాట్లకు తావివ్వొద్దు
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం
- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జనంసాక్షి) :** రెండవ సాధారణ ఎన్నికల నేపద్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణల ప్రక్రియన్ ఎన్నికల సిబ్బంది సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల రెండవ రోజైన శుక్రవారం తెల్కపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి, తెల్కపల్లి క్లస్టర్లలో కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెల్కపల్లి క్లస్టర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో తెల్కపల్లి, రాకొండ, రామ్ రెడ్డి పల్లి, కమ్మరెడ్డిపల్లి దాసుపల్లి, గౌరెడ్డిపల్లి క్లస్టర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో గౌరెడ్డిపల్లి, లక్నారం, గోలగుండం, గట్టునెల్లికుదురు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులను నామినేషన్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం ముందు ఫోటోతో ఓటర్ల జాబిదా అదే విధంగా గ్రామాల వార్డుల వారిగా రిజర్వేషన్ల జాబిదా అంటించాలన్నారు. నామినేషన్ కేంద్రాలకు వంద మీటర్ల పరిదిలో ఎవరూ గుంపులుగా రాకుండా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారితో పాటు సహాయక రిటర్నింగ్ అధికారులక పలు సలహాలు సూచనలు అందజేసారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో తెల్కపల్లి మండల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.తెల్కపల్లి మండలంలోని 7 క్లస్టర్లలో 28 గ్రామ పంచాయతీల్లో 28 సర్పంచ్ ఎన్నికలు,260 వార్డులకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పక్కగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు.ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, శనివారంతో మొదటి విడత ఎన్నికలకు ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ అనంతరం నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్‌సింగ్ గణపట్ రావు పాటిల్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన పారదర్శకమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని జిల్లా ఎస్పీ పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరిగేలా పని చేయాలని పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛిత పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పారదర్శకమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి సిబ్బందిపైన ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో శాంతి భద్రతలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని సెన్సిటివ్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో పకడ్బందీ బందోబస్తు, పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అక్రమ డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, అనైతిక ప్రలోభాలు వంటి తప్పిదాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించా లని ప్రజలకు ఎస్పి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ జాకీర్ అలీ, ఎంపీడీవో తరుణ్, ఎంపీఓ వెంకటేష్, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎస్సై నరేష్, కోటేశ్వరరావు, ఆయా గ్రామ పంచాయతీల రిటర్నింగ్ అధికారులు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష

- రూ. లక్ష చొప్పున జరిమానా



**సంగారెడ్డి, నవంబర్ 28 (జనం సాక్షి) :** సంగారెడ్డి ఫస్టు క్లాస్ అడిషనల్ సేషన్ కోర్టు న్యాయమూర్తి జయంతి నలుగురు గంజాయి అక్రమ రవాణ నిందితులకు పదేళ్ల పాటు జైలు శిక్ష, రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారని మెదక్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ జె.హరి కిషన్ తెలిపారు. 2021 ఫిబ్రవరిలో 102 కేజీల గంజాయిని అక్రమంగా రవాణ చేస్తు ఉండగా జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ నమోదు చేశారు.సంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై హెచ్‌ఏ మోహన్‌కుమార్ రమేష్ రెడ్డి గంజాయిని పట్టు కున్నారు. ఈ కేసును జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్సై ఎం.టి కుమార్ కేసు నమోదు చేశారని డీసీ తెలిపారు. ఈ కేసులో సంగారెడ్డి జిల్లా కోర్టులో వాదనలు విన్న న్యాయమూర్తి జయంతి రాథోడ్ మోహన్, రాథోడ్ వెంకట్, కేతావత్ పాండు నాయక్, రాథోడ్ మోతిరాంలకు పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.లక్ష చొప్పున జరిమాన విధించారు. గంజాయి నిందితులకు శిక్షలు పడేవిధంగా చర్యలు చేపట్టిన ఎక్సైజ్ సిబ్బంది డిప్యూటి కమిషనర్ హరి కిషన్ అభినందించారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జనం సాక్షి) :** ఆటో డ్రైవర్లు ట్రాఫికీ నిబంధనలు పాటిం చాలని, పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థు లను, కూలీలను ఎక్కించు కోరాదని, వాహనాలకు సంబంధించిన పత్రాలను కల్గి ఉండాలని సీఐ శివ శంకర్ తెలిపారు.శుక్రవారం పెరపళ్ళ నుండి నారాయణపేట టౌన్‌కి వస్తున ఆటోలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా విద్యార్థులను, ప్రయాణికులను పరిమితికి మించి తీసుకెళ్తు ఆటోను ప్రమాదకరంగా నడుపుతున్న ఆటో డ్రైవర్‌ను సిఐ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, రూరల్ ఎస్ఐ రాముడు లు పట్టుకొని పోలీసు స్టేషన్ తరలించి కేసు నమోదు చేశారు.ఆటో డ్రైవర్ లైసెన్స్ లేకుండా, పరిమితి కంటే ఎక్కువ మంది స్కూల్ విద్యార్థులు, ప్రయాణికులను ఎక్కించుకొని రోడ్డుపై నిర్లక్ష్యంగా నడుపుతున్నట్టు గుర్తించా రు. విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం కలిగించే ఈ రకమైన నిర్లక్ష్యాన్ని అస్సలు సహిం చబోమని సిఐ అన్నారు. ఇలాంటి ప్రమాదకర చర్యలు భవిష్యత్తులో పునరావృతం చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు వారి తల్లితండ్రు లు ఆటోలలో పరిమితికి మించి పంపారాదు అని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియ మాలు పాటించాలని కోరారు.

## ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**మక్తల్, నవంబర్ 28 (జనంసాక్షి) :** డిసెంబర్ 1న మక్తల్ పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులతో పరిశీలించి సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మక్తల్ పట్టణ కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మైదానంలో పబ్లిక్ మీటింగ్ సమావేశ స్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి, బందోబస్తుకు సంబంధించిన రూట్ మ్యాప్ ఏర్పాటు చేయాలని, బందోబస్తును సెక్టార్లుగా విభజించి తగిన భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. సమావేశ స్థలంలో ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయబడుతుందని చెప్పారు. మీటింగ్ స్థలంలో, ఎలిప్యాడ్ స్థలం వద్ద బరికెట్స్ తదితర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా పోలీసుతో పాటు ఇతర జిల్లాల నుండి వచ్చే పోలీసు ఫోర్స్ తో బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. పార్కింగ్ ప్రాంతాలను ప్రజలు, వీఐపీల వాహనాల కోసం విడివిడిగా గుర్తించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్లాన్ అమలు చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు డిఎస్పీ నల్లపు లింగయ్య, సిఐ రామ్ లాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్, ఎస్ ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ధర్నాను విజయవంతం చేయాలి



**జోగిపేట, నవంబర్ 28 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్లో తలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టియుడబ్ల్యూజే) ఆందోల్ తాలూకా కోశాధికారి గొర్ల కాడి కుమార్, ఉపాధ్యక్షులు డాకూరి రాజేష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన అక్రెడిటేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని హెల్త్ కార్డులను మర్చిపోయిందని, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని మన యూనియన్ ప్రతినిధి బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఎన్నో సార్లు కలిసి చర్చించడంతో పాటు వినతి పత్రాలను అందించినప్పటికి గత 20 నెలలుగా అక్రెడిటేడేషన్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారణి విమర్శించారు. ఇప్పటికి పాత అక్రెడిటేషన్ కార్డులను పలు దఫాలుగా రెన్యూవల్ చేస్తున్నా రే తప్ప కొత్త కార్డులు ఇవ్వడం లేదు. ఇదేమని అడిగితే, ఇదిగో ,అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా డిసెంబర్ 3న, ఉదయం 10 గంటలకు మాసాబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్ణయించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా తెలియపరచారు.

## ఎమ్మెల్యే జీఎంఆర్ అధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**పటాన్‌చెరు, నవంబర్ 28 (జనంసాక్షి) :** స్వామియే శరణమయ్యప్ప.. హరి హరి వాసనే. శరణమయ్యప్ప అంటూ వేలాదిమంది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో పటాన్చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ మార్మోగింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పటాన్చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. అభ్యంతం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా.. దేవత మూర్తుల ఉత్సవ విగ్రహాలతో ప్రాంగణం మొత్తం శోభాయమానంగా తీర్చిదిద్దారు. శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయం నుండి వచ్చిన ప్రత్యేక పూజారులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్విరామంగా కొనసాగాయి. ప్రత్యేకమైన మండపం ఏర్పాటు చేసి సర్వంగా సుందరంగా రంగురంగుల పువ్వులతో అలంకరించారు. ముందుగా శ్రీ విఘ్నేశ్వర, శ్రీ సుబ్రమణ్యస్వామి, శ్రీ అయ్యప్ప చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహానికి పాలాభిషేకం, నెయ్యాభిషేకం నిర్వహించారు. పదునెట్టంబడిపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వాముల పెటతుల్లి భక్తులను ఆకట్టుకుంది. అనంతరం పదునెట్టంబడిపై దీపాలు వెలిగించారు.సుమారు 10 వేల మంది భక్తులు కార్యక్రమానికి హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల శాసన మండలి సభ్యులు అంజి రెడ్డి, దుబ్బాక శాసన సభ్యులు ప్రభాకర్ రెడ్డి, శాసన మండలి మాజీ ప్రోటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, గూడెం కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, భారీ సంఖ్యలో అయ్యప్ప స్వాములు, వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి



**మల్దకల్, నవంబర్ 28 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారంజోగులాంబ గద్వాల జిల్లా జార్జిరెడ్డి పిడిఎస్యు విద్యార్థి సంఘం కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి మహనీయునికి నివాళులు అర్పించారు.జ్యోతిరావు పూలే 1827లో సతారా జిల్లాలో హిందూ మాలి కులానికి చెందిన కుటుంబంలో జన్మించారు.మాలిలు సాంప్రదాయకంగా పండ్లు కూరగాయల పెంపకందారులుగా పనిచేసేవారు.1848లో పూణేలోని తాత్యాసాహెబ్ భిడే నివాసంలో బాలికల కోసంవారి మొదటి పాఠశాలను స్థాపించారు,ఆమె 1873లో సత్యశోధక్ సమాజ్ సాహిత్యం'సత్య అన్వేషకుల సంఘం'ను సహ-స్థాపించి, దాని మహిళా విభాగానికి నాయకత్వం వహించింది. 1888 మే 11న మహారాష్ట్ర సామాజిక కార్యకర్త విఠల్‌రావు కృష్ణజీ వందేకర్ పూలేకు మహాత్మా బిరుదు ఇచ్చారు. ఆయన కృషి ప్రధానంగా అంటరానితనం,కులవ్యవస్థ నిర్మూలన,మహిళల విముక్తి సాధికారత,కోసం పనిచేశారు. ఈ కార్యక్రమంలో జార్జి రెడ్డి పిడిఎస్యువిద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్ పాషా,విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిరుమల్, గట్టు మండల అధ్యక్షులు స్టీఫెన్ సన్,మండల ప్రధాన కార్యదర్శి రాజు,విద్యార్థి సంఘం సభ్యులు దేవేంద్ర,ముకేష్, ఇమానేయల్ పాల్గొన్నారు.

## రెండవ రోజు ప్రశాంతంగా ముగిసిన పంచాయితీ నామినేషన్



**సంగారెడ్డి టౌన్, నవంబర్ 28 (జనం సాక్షి) :** రెండవ స్థానిక సంస్థ ఎన్నికల గ్రామపంచాయతీ నామినేషన్లు రెండవ రోజు ప్రశాంతంగా ముగిసిన నామినేషన్లు సంగారెడ్డి, కంది మండలంలో శుక్రవారం గ్రామాలకు పంచాయితీకి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు గుంతపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పడమటి అనంత్ రెడ్డి నామినేషన్ పత్రాలను సమర్పించారు కంది మండలం కౌలంపేట్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అష్మిన్ బాబా,, నామినేషన్ పత్రాలను అందజేశారు ఎర్దనూర్ తండా సర్పంచ్ అభ్యర్థిగా శంకర్ నాయక్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు ఇస్మాల్ ఖాన్ పెట్ గ్రామపంచాయతీకి సర్పంచ్ అభ్యర్థిగా రఘు అరుణ జ్యోతి, నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు, అదేవిధంగా సంగారెడ్డి మండలంలోని 11 గ్రామపంచాయతీలకు కంది మండలంలోని 22 గ్రామపంచాయతీలకు వార్డు మెంబర్లు నామినేషన్లు దాఖలు చేశారు.

## అలంపూర్ మాంటిస్సోరి విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక

- అభినందించిన డైరెక్టర్ కే.యన్. వి. రవి ప్రకాష్



**మానవపాడు, నవంబర్ 28 (జనం సాక్షి) :** అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పలువురు విద్యార్థులు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోటీల్లో తమ ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు అని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులు గద్వాలలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి పోటీల్లోనూ ప్రతిభా ప్రదర్శన చేసి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు అన్నారు. ఈ సందర్భంగా ఎనిమిదవ తరగతి విద్యార్థి రిత్విక్, తొమ్మిదవ తరగతి విద్యార్థి అఖిల్ వంశీ, పదవ తరగతి విద్యార్థి సూరజ్ తమ తమ విభాగాలలో మెరుగైన ఫలితాలు సాధించారు అని కొనియాడారు. ఈ ముగ్గురు విద్యార్థులు డిసెంబర్ నెలలో కరీంనగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోటీలలో పాల్గొననున్నారు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కె. యన్. వి. రవి ప్రకాశ్ మాట్లాడుతూ, ఇలాంటి పోటీలలో చిన్న వయసు నుంచే విద్యార్థులను పాల్గొననించడం ద్వారా సృజనాత్మకత, విశ్లేషణా దక్షత, ఆత్మవిశ్వాసం మరింత పెంపొందుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి పి. నాగలక్ష్మి, డైరెక్టర్ కె. యన్. వి. రవి ప్రకాశ్, ఉపాధ్యాయులు అభినందించి, భవిష్యత్ పోటీలలో కూడా ఇలాగే విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రతి కదలికను పరిశీలిస్తాం



**వనపర్తి బ్యూరో, నవంబర్ 28 (జనంసాక్షి) :** ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులను పూర్తిస్థాయిలో జాగ్రత్త ప్రాంతాలుగా మార్చేందుకు వనపర్తి సీఐ పర్యవేక్షణలో గోపాల్‌పేట్ మండలం బుద్దారం గ్రామ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో విస్తృత, కఠిన తనిఖీలు నిర్వహించారు. జిల్లా ప్రవేశ మార్గాల్లో ఏ విధమైన అక్రమ రవాణా, అనుమానాస్పద కార్యకలాపాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల రూపంలో సీఐ బృందం ప్రతి వాహనం, వ్యక్తిని జాగ్రత్తగా వేరిఫై చేస్తూ జీరో టాలరెన్స్ విధానంతో తనిఖీలు చేపట్టారు,ఈ సందర్భంగా సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ... ఎస్పీ ఆదేశాలను కట్టుదిట్టంగా అమలు చేయడం మా బాధ్యత. ఎన్నికల సమయంలో జిల్లా సరిహద్దులు అత్యంత సున్నిత ప్రాంతాలు కావున, అక్రమ నగదు, మద్యం, ప్రలోభకర వస్తువుల రవాణా ప్రయత్నాలు ఏవైనా జరిగిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటాం.చెక్‌పోస్టుల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతర నిఘాతో పనిచేయాలని స్పష్టంగా ఆదేశించాం. జిల్లాలో శాంతి-భద్రత కోసం ప్రతి వాహనం, ప్రతి కదలికను పూర్తిగా పరిశీలిస్తాం, అని సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గోపాల్ పేట్ ఎస్సై, నరేష్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఏకగ్రీవాలు

- ఏకగ్రీవాలపై సమగ్ర విచారణ జరిపించండి

**గద్వాల టౌన్, నవంబర్ 28 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఏకగ్రీవాలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏకగ్రీవాలు జరుగుతున్న గ్రామ పంచాయతీలలో ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏకగ్రీవ ఎన్నికల వల్ల కులం,డబ్బు ప్రాతిపదికన కేవలం పెత్తందారులకు, ధనవంతులకు మాత్రమే రాజకీయ అవకాశం ఉంటుందని అన్నారు. ఏకగ్రీవ ఎన్నికల ద్వారా ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఓటు వేసే హక్కును, ఎన్నికలలో పోటీ చేసే ప్రజా ప్రతినిధిని ఎన్నుకునే హక్కు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.ఏకగ్రీవాల పేరుతో ప్రజలకు ప్రజాస్వామ్యానికి దూరం చేసి,ప్రజాస్వామ్య వ్యవస్థనే అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలు, కోట్లు ఖర్చు పెట్టి ఏకగ్రీవాలు చేసుకున్న అభ్యర్థులు గ్రామ అభివృద్ధికి ఏం కృషి చేస్తారని ప్రశ్నించారు.ఏకగ్రీవాలు జరుగుతున్న గ్రామాలలో ప్రజలందరూ పాల్గొనడం లేదని కేవలం కొంతమంది పెత్తందారులు మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా పోటీకి సిద్ధపడితే గ్రామం మొత్తం వెలివేసే పరిస్థితులను సృష్టిస్తున్నారని విమర్శించారు. గతంలో కూడా ఏకగ్రీవ తీర్మానాలు చేసిన గ్రామాలకు ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వలేదని గుర్తు చేశారు. జిల్లాలో ఏకగ్రీవాలు చేసుకున్న అభ్యర్థులపై ఐటీ,ఈడి వంటి చట్టబద్ధ రాజ్యాంగబద్ధ సంస్థల చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఏకగ్రీవాలు చేసుకున్న అభ్యర్థులు చెల్లించే డబ్బు ఎక్కడ నుండి సరఫరా అవుతుందో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జి.రాజు,వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ, సవారన్న తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి దశ నుండే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద...
- సైన్స్ ఫెయిర్‌ను సందర్శించిన కలెక్టర్ సత్యశారద..
- రెండవ రోజు వరంగల్ జిల్లా సైన్స్ ఫెయిర్‌కు పోటెత్తిన విద్యార్థులు ..
- శాస్త్రీయ ఆవిష్కరణలకు వేదిక అయిన ప్రదర్శన..
- 6000 మంది విద్యార్థులు, సందర్శన..



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 28(జనంసాక్షి):** విద్యార్థి దశ నుండే సైన్స్ పై మక్కువ పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు.వరంగల్ ఉర్సు గుట్ట తాళ్ళపద్మావతి ఇంటర్నేషనల్ పాఠశాలలో జరుగుతున్న ఇన్స్పైర్ అవార్డ్స్ మనక్, ఆర్ బి వి పి సైన్స్ ఎగ్జిబిషన్‌కు రెండో రోజు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై ఇన్స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థుల ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ అభినందనలు తెలిపారు. ఉదయం నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శాస్త్రాభిమానులు బారులు తీరారు. వివిధ పాఠశాలల నుండి వచ్చిన బాలబాలికలు తమ ప్రతిభను శాస్త్రీయ ఆలోచనలతో సమన్వయం చేస్తూ, సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే విధంగా రూపొందించిన మోడళ్లు ప్రదర్శించారు. విద్యార్థులు సైన్స్ ఫెయిర్ స్ఫూర్తితో మున్ముందు మరిన్ని ఉత్తమమైన ప్రాజెక్టులు రూపొందించాలని, పాఠశాల స్థాయి నుండి సైన్స్ పై మక్కువ పెంచుకోవాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ను ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని, విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించేలా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని 85 ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, కస్తూర్బా, టెక్నికల్ పాఠశాలల నుంచి 6000 మందివిద్యార్థులు పాల్గొన్నారు. వెయ్యికి పైగా ఇతరులు వీక్షించారు.శాస్త్రం పట్ల విద్యార్థుల ఆసక్తి, ప్రయోగ పరిజ్ఞానం, సృజనాత్మకత చూసి సందర్శకులు ముచ్చటపడ్డారు. అటవీశాఖ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. జీవవిజ్ఞానం, పర్యావరణ సంరక్షణ, నీటి నిర్వహణ, పునర్వినియోగ శక్తులు, వ్యవసాయ యాంత్రీకరణ, సుస్థిర అభివృద్ధి, రోబోటిక్స్, టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలు వంటి విభాగాల్లో విద్యార్థులు సరికొత్త నమూనాలు ప్రదర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ, ఆదివాసి పరిసరాల నుంచి వచ్చిన విద్యార్థులు శాస్త్రీయమైన ఆలోచనలతో ముందుకు రావడం ఇది భారత భవిష్యత్తుకు గొప్ప సంకేతమన్నారు. శాస్త్రం పట్ల ఆసక్తి పెంపొందించడం, ప్రయోగాత్మక జ్ఞానం పాఠశాల స్థాయి నుంచే పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం" అన్నారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ఆలోచనలతో విద్యార్థులు వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించడం సంతోషదాయకమన్నారు. డిసెంబర్ రెండవ వారంలో రాష్ట్రస్థాయిలో జరిగే ప్రదర్శనలో జిల్లా స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన ప్రాజెక్టులను పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల వినూత్న ప్రాజెక్టులు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. రైతులకు ఉపయోగపడే స్మార్ట్ సీడ్ ప్లాంటర్, అప్రమత్తత కలిగించే రోడ్ యాక్సిడెంట్ అలర్ట్ సిస్టమ్, నీటి కొరత నివారణకు గ్రౌండ్ వాటర్ రీచార్జ్ మోడల్, పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్, పారిశుద్ధ్యానికి సెన్సార్ ఆధారిత డస్ట్ బిన్, అనారోగ్యాలను పర్యవేక్షించే హెల్త్ మానిటరింగ్ బ్యాండ్, శారీరక శ్రమ తగ్గించే శ్రామికుల కోసం బరువుల మోయు యంత్రం లాంటి ప్రాజెక్టులు సందర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. పాఠశాల విద్యార్థుల్లో సమాజ సేవ భావన పెంపొందించేందుకు, సమస్యలను శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి పరిష్కార మార్గాలను ఆచరణలోకి తేవడానికి ఈ వేదిక ఎంతగానో దోహదపడుతోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో టీమ్ వర్క్, పరిశోధనా దృక్పథం, ప్రదర్శన నైపుణ్యం, సాంకేతిక సామర్థ్యాల పెంపుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకమని అన్నారు.ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు మాట్లాడుతూ మనకు తెలిసిన పాఠశాల జ్ఞానం పుస్తకాల వరకే కాకుండా ప్రయోగాల రూపంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్చే అవకాశం ఇన్స్పైర్ ఎగ్జిబిషన్ మనకు ఇచ్చింది. ఈ వేదిక మా లోతైన ఆలోచనలకు ప్రోత్సాహం ఇచ్చింది" అని చెప్పారు.

# భూపాలపల్లిలో భూనిర్వాసితుల ధర్నా

- సింగరేణి ఓపెన్ కాస్ట్ 2వ గని వద్ద ఉద్రిక్తత
- తొమ్మిదేళ్లుగా పరిహారం ఇవ్వడం లేదని ఆందోళన
- రంగంలోకి దిగిన పోలీసులు
- ఎట్టకేలకు దిగివచ్చిన జీఎం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఓసీ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు సింగరేణి సంస్థ నష్టపరిహారం ఇవ్వడంలేదని శుక్రవారం భూనిర్వాసితులు ధర్నా నిర్వహించారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ 2వ గని వద్ద ధర్నా చేస్తున్న విషయం తెలిసి పోలీసులు భారీగా చేరుకున్నారు. పోలీసులకు భూనిర్వాసితులకు వాగ్వాదం జరగడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధితులకు సంఘీభావంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్, భూనిర్వాసితుల కమిటి నాయకులు బుర్ర మనోజ్ లు మాట్లాడుతూ 2017 నుండి 50 ఎకరాలను కోల్పోయిన తమ భూములకు సింగరేణి సంస్థ నష్టపరిహారం ఇవ్వలేదని ఆందోళనకు దిగినట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అప్పటి కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగగా ఈ గ్రామాలన్నీ తరలించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం అందిస్తామని అధికారులు చెప్పారని, కానీ అపుడు చూపిన విధంగా కాకుండా ప్రభావిత గ్రామాలను మొత్తం తీసుకోకుండా ఆయా గ్రామాల్లో కొంతమేరకే తీసుకున్నారని, ఓసీ బ్లాస్టింగ్ వల్ల మేము ఇబ్బందులకు గురి అవుతున్నామని, వెంటనే గ్రామాలను పూర్తి స్థాయిలో తీసుకుని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చేంత వరకు కదిలేది లేదని కుటుంబంతో తరలివచ్చి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఓసీ ప్రభావిత గ్రామాలైన ఆకుదారివాడ, పక్కీర్ గడ్డ, కాకతీయ కాలనీ, మదీనా కాలనీ, హనుమాన్ నగర్ ప్రాంతాలను మొత్తం సింగరేణి తీసుకొని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని చెప్పారు. గతంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సింగరేణి సంస్థ చైర్మన్ తో మాట్లాడి భూ నిర్వాసితులకు రూ. 25 కోట్లు మంజూరు చేయించారని, ఇంతవరకు ఆ డబ్బులను భూ నిర్వాసితులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా తమ భూములు తీసుకొని సింగరేణి సంస్థ ఇప్పటివరకు కూడా నష్టపరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, ఎన్నిసార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టిన స్పందించడం లేదని వెంటనే సింగరేణి యాజమాన్యం తమ భూములను, ఇండ్లను తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. నష్టపరిహారం ఇచ్చేంత వరకు ఓపెన్ కాస్ట్ ను నడవనీయమని గని ముందు ధర్నా నిర్వహించారు. పోలీసులు, సింగరేణి అధికారులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో వాగ్వాదం జరిగి సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ముందు ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. చివరికి సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి చేరుకుని తగిన న్యాయం చేస్తామని హామి ఇవ్వడంతో భూ నిర్వాసితులు ధర్నా విరమించారు. భూ నిర్వాసితులకు టిఆర్ఫీ జిల్లా నాయకులు రవి పటేల్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసితులు బుర్ర రాజయ్య, సంధ్య, రమణ, ఆముదాల రమేష్, ఇస్లావత్ సమ్మయ్య, ఇస్లావత్ తిరుపతి, వడ్లకొండ రమేష్, సట్ల రంజిత్, బుర్ర మహేశ్, బుర్ర వేణు, విశాల్, తిరుపతి నాయక్, భీమనపల్లి మహేందర్, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

# పేదల కళ్లలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి



**పరకాల, నవంబర్ 28 (జనం సాక్షి):** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.శుక్రవారం గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని,రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వీట్ తినిపించి, శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు.ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.గత ప్రభుత్వంలో శిలాఫలకాలకే పరిమితమయ్యారని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# కేంద్ర ప్రభుత్వంపై పోరాడకుండా సర్పంచ్ ఎన్నికలకు వెళ్లడం సిగ్గుచేటు

- లేకుంటే తెలంగాణలో కాంగ్రెస్, బిజెపి పార్టీలను భూస్థాపితం చేస్తాం
- మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి
- బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 28 (జనం సాక్షి)** :మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా హన్మకొండ కాకతీయ యూనివర్సిటీ లోని పూలే దంపతుల విగ్రహాలకు వరంగల్ ఉమ్మడి బీసీ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్ద కాలం క్రితమే మహాత్మా జ్యోతి రావ్ పూలే వెనుకబడిన బలహీన వర్గాల ప్రజలు విద్య, ఉద్యగ, రాజకీయ రంగాలలో సమాన వాటా రావాలని కలలు కన్నారు, వారి ఆశయాలకు అనుకూలంగా జనాభాలో 60% ఉన్న బీసీలు మేంమెంతో... మాకు అంత వాటా ఇవ్వాలని పోరాడుతున్న బీసీలకు, ఈ అగ్రవర్ణలకు చెందిన పార్టీలు కనీసం స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని ప్రగల్బాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లను కల్పించకుండ, కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయకుండా గతంలో ఉన్న 23% బీసీ రిజర్వేషన్లను 17% నికి కుదించి సర్పంచ్ ఎన్నికలకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి పార్టీకి, రిజర్వేషన్లను కల్పించకుండా సర్పంచ్ ఎన్నికలను నిర్వహిస్తూ, రెడ్ల ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం నేర్పే విధంగా బీసీల పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోడీపై ఒత్తిడి పెంచాలని, డిసెంబర్ మొదటి వారంలో జరగనున్న పార్లమెంట్ సమావేశాలను 243 మంది ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యులచే పార్లమెంట్ ను స్తంభింప చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఒప్పించాలని లేకుంటే ప్రజాక్షేత్రంలో ఆ రెండు పార్టీల ద్వంద వైఖరిని ఎండగడదామని వేణుగోపాల్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీసీ జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు డా. చిర్ర రాజు గౌడ్, దాడి మల్లయ్య యాదవ్, డా. సంగాని మల్లేశ్వర్, బోనగాని యాదగిరి, తమ్మేలా శోభరాణి, భీమగాని యాదగిరి, కాసగాని అశోక్ గౌడ్, సమ్మయ్య, బక్కి అవినాష్ పటేల్, తెల్ల సుగుణ, కిషోర్, ప్రమోద, మానస తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతిని దెబ్బతీసేందుకే ఇందిరమ్మ పేరుతో చీరల పంపిణీ

- మాజీ మంత్రి దయాకర్ రావు



**పాలకుర్తి, నవంబరు 28(జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతిని దెబ్బతీసేందుకే బతుకమ్మ పేరుకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో చీరల పంపిణీ చేస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఘాటుగా విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాలులో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన దయాకర్ రావు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో సర్వేలన్నీ బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు అత్యధిక స్థానాలు గెలుస్తారని చెబుతున్నాయని అన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ ఎన్నికల్లో నాయకులు సమన్వయంతో పని చేసి బీఆర్ఎస్ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మోసపూరితమైందని ప్రజలందరికి అర్థమైందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాలు గెలుచుకొని సంచలనం సృష్టించడం ఖాయమన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 16 వేలు దొంగ ఓట్లతోనే గెలిచిందని ఆరోపించారు. రాష్ట్రం బ్లాక్ మెయిలర్ పాలనలో ఉందన్నారు. రెండేండ్లు ఓపిక పట్టండి రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి మనమే వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# థాయిలాండ్ దేశంలో మనోళ్ల గెలుపు..

- షటిల్‌లో సత్తా చాటిన బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవ మూర్తి జంట
- చైనా, మలేషియా క్రీడాకారులపై గెలుపు
- ఘనంగా సన్మానించిన తోటి షటిల్ క్రీడాకారులు



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 28 (జనం సాక్షి) :** హనుమకొండకు చెందిన వెటరన్ షటిల్ క్రీడాకారులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవమూర్తి థాయిలాండ్ దేశంలోని పట్టాయా మహానగరంలో తమ ప్రతిభను చాటారు. ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ 'సవాస్ ది కప్ 2025లో రన్నరపుగా నిలిచారు. కన్నుల పండుగగా జరిగిన ఈ అంతర్జాతీయ షటిల్ టోర్నమెంట్లో ప్రపంచ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. 60 ప్లస్ డబుల్స్ లో బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవమూర్తి జంట చైనా, మలేషియా దేశాల క్రీడాకారులపై విజయం సాధించారు. నిర్వాహణ దేశమైన థాయిలాండ్ దేశ క్రీడాకారులతో నువ్వా నేనా అన్నట్లు సాగిన పోటీలో ఓటమిని చవిచూసి రన్నరప్ గా నిలిచారు. జట్టు మేనేజర్ ముచ్చ రాజిరెడ్డి ప్రోత్సాహంతో వీరి జంట అద్భుతంగా ఆడింది. థాయి చైనీస్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోర్నే దబ్బరాన్సి ఆధ్వర్యంలో థాయ్‌లాండ్ దేశ పట్టాయ మహానగరంలో సవాస్ ది కప్ 2025 బ్యాడ్మింటన్ టోర్నీని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. అంతర్జాతీయ క్రీడాకారుల కోసం ఘనమైన ఏర్పాట్లను చేసింది. నభూతో నాభవిష్యత్తు అన్న రీతిలో కొనసాగిన ఈ అంతర్జాతీయ సెటిల్ కప్ క్రీడోత్సవాల్లో బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవ మూర్తిలు పతకాలు సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ప్రపంచ షటిల్ టోర్నీలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వీరిని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

**అభినందనల వెల్లువ**

థాయిలాండ్ దేశంలోని పట్టాయ మహానగరంలో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సవాస్ ది కప్ 2025 టోర్నీలో సమిష్టిగా రాణించి రన్నరప్ గా నిలిచిన ఓరుగల్లు షటిల్ క్రీడాకారులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవ మూర్తిని జి డబ్ల్యు ఎంసీ ఇండోర్ స్టేడియంలో తోటి క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో వీరికి శాలువా కప్పి, బొకేలు ఇచ్చి అభినందించారు. ఎంతో అట్టహాసంగా జరిగిన ఈ అభినందన సభలో కొత్తగట్టు సుధాకర్, మార్త శ్రీధర్, పూతాటి రవి, కొత్తగట్టు శివ, పూసల సంతోష్, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, చదలవాడ నితిన్, చింతాకుల ప్రభాకర్, రోహన్ సింగ్, శివ , దుస్స వినయ్, పీసు రాజిరెడ్డి, కోట రమణారెడ్డి, పూజారి విజయ్, వైవీ రాజేందర్ తో పాటు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జట్టు మేనేజర్ ముచ్చ రాజిరెడ్డి అందించిన ప్రోత్సాహం మరువలేనిది అన్నారు. వరంగల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులందరికి పేరుపేరునా వారు ధన్యవాదాలు తెలిపారు.



# మార్నేనికి శుభాకాంక్షలు తెలిపిన ఇనగాల..

**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 28 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షుడిగా నియమితులైనతెలంగాణ (టెస్కాబ్) రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు ను శుక్రవారం వరంగల్ కూడా చైర్మన్ హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారికి మార్నేని రవీందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు బంక సరళ మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా వచ్చిన నామినేషన్లు మాత్రమే స్వీకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట నవంబర్ 28, 2025 (జనంసాక్షి) :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు సమర్పించే నామినేషన్లను నిర్ణీత గడువులోగా మాత్రమే స్వీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ, ముత్యంపేట, రెబ్బెనపల్లి, చెల్కగూడ గ్రామాలకు కొర్విచెల్మ గ్రామపంచాయతీ, నెల్కివెంకటాపూర్, వందూర్ గూడ, చింతపల్లి, తానిమడుగు గ్రామాలకు నెల్కివెంకటాపూర్ గ్రామపంచాయతీ, ద్వారక, కొండాపూర్, ధర్మారావుపేట గ్రామాలకు ద్వారక గ్రామపంచాయతీ, మ్యాదరిపేట, మామిడిపల్లి, కొత్త మామిడిపల్లి గ్రామాలకు మ్యాదరిపేట గ్రామపంచాయతీ, దండేపల్లి, కర్ణపేట, నర్సాపూర్ గ్రామాలకు దండేపల్లి గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 29వ తేదీన సాయంత్రం 5 గంటల లోగా నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని తెలిపారు. నామినేషన్ కేంద్రంలో రద్దీ లేకుండా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ నిబంధనలకు లోబడి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.

# పేపర్ల పేరు చెప్పి బంగారు గొలుసు చోరీ



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 28 (జనం సాక్షి) :** పేపర్లు ఇస్తామని చెప్పి, వృద్ధురాలు పై దాడి చేసి బంగారు గొలుసు ని దొంగలించిన వ్యవహారం ఇక్కడి వాసులను భయాందోళనకు గురిచేస్తుంది. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ద్వారక నగర్ కు చెందిన చిలుక వీరమ్మ అనే వృద్ధురాలు మెడలోని 2 తులాల బంగారు గొలుసును దొంగలు దాడి చేసి ఎత్తుకెళ్లారు. సారు పేపర్లు పంపించారని, శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో లోపల భోజనం చేస్తున్న వృద్ధురాలిని ఇద్దరు వ్యక్తులు పిలిచారు. దీంతో ఆ మహిళ బయటికి వస్తా అని, కొడుకా ఆగండి.. అని చెప్పి బయటికి వస్తున్న క్రమంలో.. సంబంధిత ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు లోపలికి వెళ్లి పేపర్లు అక్కడ పడేసి, వృద్ధురాలు గొంతును నులిం వేశారు. అంతటితో ఆగకుండా ఆమె నోరు మూయించి, తలపై గట్టిగా కొట్టాడు. దీంతో ముసలమ్మ కు శ్వాస ఆడకుండా పోయింది. అనంతరం వృద్ధురాలిని అక్కడ మంచం పైన పడేసి.. దుండగులు అక్కడనుండి నంబరు ప్లేట్ లేని మోటార్ సైకిల్ పై పారిపోయారు. విషయం మీడియాకు చేరడంతో అక్కడ చేరుకొని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాగజ్ నగర్ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ సిబ్బందితో అక్కడి చేరుకొని వివరాలు అది తెలుసుకున్నారు. వేలిముద్రలు సేకరించి, సిసి టివి ఫుటేజ్లు, ప్రజల వాంగ్మూలం తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
29 నవంబర్ 2025

# స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలి

**● సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు**

**ఖమ్మం, నవంబర్ 28, (జనం సాక్షి) :** జిల్లాలో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛ, న్యాయబద్ధ నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు అన్నారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు, కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని, ఎక్కడ చిన్న పొరపాటు జరగడానికి ఆస్కారం ఇవ్వవద్దని, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణ జరగాలని స్పష్టం చేశారు. ఎం.సి.సి. నిబంధనలు ఉల్లంఘనలు జరగకుండా చూడాలని, అభ్యర్థులు వినూత్న రీతిలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తారని, దీనిని నిరోధించేందుకు పక్కా నిఘా పెట్టాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎక్కడా కూడా ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం కావద్దని తెలిపారు. అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా ఎన్నికల పట్ల నమ్మకం పెరుగుతుందని, చిన్న ఫిర్యాదును కూడా నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ప్రతి ఒక్కరు తమ విధులను పకడ్బందీగా నిర్వహిస్తూ బృందంగా పని చేయాలని, ఎన్నికలు



పారదర్శకంగా జరగాలని అన్నారు. ఎఫ్.సి.టి., ఎస్.ఎస్.టి. ఏర్పాటు, ఫిర్యాదుల నమోదు టోల్ ఫ్రీ నెంబర్ 1077 పట్ల విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బంది శిక్షణ, బ్యాలెట్ పేపర్, ప్రింటింగ్ మెటీరియల్ మొదలగు వివిధ అంశాలకు సంబంధించిన అంశాలను సంబంధిత నోడల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్ష లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి వచ్చే వివిధ ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు డిఆర్ఓ ఆధ్వర్యంలో వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1077 పట్ల విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. నామినేషన్లు ముగిసి అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత ప్రలోభాలు పెరిగే అవకాశం ఉందని, క్షేత్రస్థాయిలో బృందాలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రచారంను తహసిల్దార్, ఆర్డిఓ రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని, కులాలు, మతాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే రికార్డు చేసి నిబంధనలను ప్రకారం వారిని పోటీ నుంచి తొలగించే అవకాశం ఉంటుందని అన్నారు. ఎన్నికల సిబ్బంది కేటాయింపు పోలింగ్ కేంద్రాల వారీగా 3వ ర్యాండమైజేషన్ సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో చేపట్టాలని అన్నారు. ప్రస్తుత ఎన్నికలలో పోటీ చేసే ప్రతి అభ్యర్థి నుంచి ఎన్నికలు ముగిసిన 45 రోజుల లోపు వ్యయం వివరాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చాలా తీవ్రంగా ఉంటుందని, ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. కులాలు, మతాల మధ్య ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు ఉపేక్షించడం జరగదని అన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి టి. సునీల్ రెడ్డి, డిఈఓ చైతన్య జైని, సిపిఓ శ్రీనివాస్, ఆర్టీఓ వెంకట రమణ, డిసిఓ గంగాధర్, ఆర్డీఓ నరసింహా రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, డిప్యూటీ సిఈఓ నాగ పద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఈడిఎం. దుర్గాప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేటట్లు చూడాలి

**● జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



**తుంగతుర్తి, నవంబర్ 28 (జనం సాక్షి) :** సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ లో అధికారులు ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సజావుగా జరిగేలా రిటర్నింగ్ అధికారులు చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం తుంగతుర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు.నామినేషన్ స్వీకరణ కేంద్రంలోనికి అభ్యర్థులతో పాటు మరో ఇద్దరిని మాత్రమే అనుమతించాలని అలాగే వాహనాలు 100 మీటర్ల దూరంలో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులకు నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా హెల్ప్ డేస్క్ ద్వారా నివృత్తి చేసుకోవాలని ఎలాంటి తప్పుల కు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా అధికారులు విధులు నిర్వహించాలని అన్నారు. గ్రామాల వారీగా స్వీకరించిన నామినేషన్ పత్రాలను వేర్వేరుగా భద్రపరచాలని అన్నారు. ఆయన వెంట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అనీష, రవి,ఆర్డీవో వేణు మాధవరావు, తాహసిల్దార్ దయానందం,ఎంపీడీవో శేష్ కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు, ఎస్సై కాంతి కుమార్,ఆర్ఐలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించాలి

**● జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్**



**కనగల్, నవంబర్ 28 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా అభ్యర్థులు అధికారులకు సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ కోరారు . మండలంలోని చల్లగౌరారం క్లస్టర్ల లో నిర్వహిస్తున్న జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం క్లస్టర్ పరిసర ప్రాంతాలను అధ్యయనం చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థి వెంట ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఉండాలని క్లసర్ చుట్టుపక్కల ఎటు 100 మీటర్ల దూరంలోనే తమ యొక్క వాహనాలను నిలుపుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్నికల కమిషన్ రూల్స్ ను పాటించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. ఆయన వెంట డి.ఎస్.పి శివరామిరెడ్డి, చండూర్ సీఐ కె ఆదిరెడ్డి, ఎస్సై కే రాజీవ్ రెడ్డి, ఎంపీడీవో ఏ. వేద రక్షిత, పంచాయతీ కార్యదర్శులు సంతోష్ రెడ్డి, షేక్ ఖాసిం తదితరులు ఉన్నారు.

## ఎన్నికల విధుల్లో నిబద్ధత అత్యంత కీలకం

**● జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 28 (జనం సాక్షి) :** ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర అత్యంత కీలకమైందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రిసైడింగ్, ఓ.పి.ఓగా ఉపాధ్యాయులను నియమించడానికి కారణం, వారు నిబద్ధత మరియు క్రమశిక్షణతో పనిజేసే స్వభావం కలిగి ఉండటమేనని తెలిపారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయులు ఎన్నో ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వహించారని, శిక్షణ తరగతులకు హాజరైన అధికారులు పోలింగ్ బాక్స్ ఓపెన్ చేయడం, సీల్ వేయడం వంటి అంశాలను పూర్తిగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలో కూడా సామగ్రిని రెండుసార్లు చెక్ చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన తర్వాత సిబ్బంది కేంద్రం వద్దే ఉండాలని, పక్క ఇళ్లకు వెళ్లొద్దని కలెక్టర్ ఆదేశించారు. సర్పంచ్, వార్డు సభ్యుల కోసం ఓటర్లు రెండు ఓట్లు వేయవలసి ఉన్నందున, వచ్చిన ప్రతి ఓటరు రెండు బ్యాలెట్‌లు సరిగ్గా వేయడాన్ని అధికారులు నిర్ధారించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ సమయానికి కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ అలెర్ట్‌గా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ ప్రారంభం కావడంతో అధికారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణలోనే జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పి.ఓలు పాల్గొన్నారు.

## అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్‌వో



**అల్వాల్, నవంబర్ 28 (జనంసాక్షి) :** డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ సిహెచ్ లావణ్య శుక్రవారం అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, మందుల స్టోర్ పరిశీలన చేసి, కుక్క కాటుకు అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడి వైద్య సేవలపై సమగ్ర సమాచారం సేకరించారు. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సేవల సరళత, మందుల సరఫరా, రోగి సంతృప్తి అంశాలను చర్చించారు. ఇటీవల పదోన్నతి పొందిన డాక్టర్ సిహెచ్ లావణ్య ను సిబ్బంది ఘనంగా స్వాగతించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అల్వాల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రేమ, డాక్టర్ అమృత, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్




**రాజేంద్రనగర్, నవంబర్ 28 (జనంసాక్షి) :** రహదారి భద్రత కోసం ట్రాఫిక్ నియమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజలు నిబంధనలు కచ్చితంగా పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ హెచ్చరించారు.శుక్రవారం ఆర్ జి ఐ ఏ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంది. మొత్తం 32 కేసులను పరిష్కరించి రూ.59,500 జరిమానాలు విధించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన ఆరుగురిని రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి యమ్. శోభ ముందుకు హాజరు పరిచగా, ముగ్గురికి 2 రోజుల జైలు శిక్షతో పాటు రూ.2,500 జరిమానా, ఇంకో ముగ్గురికి 1 రోజు సామాజిక సేవతో పాటు రూ.2,000%-%రూ.2,500 జరిమానా విధించినట్టు తెలిపారు. మొత్తం 9 డీడీ కేసుల్లో రూ.21,500 వసూలు చేశారు. అదనంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 13 కేసుల్లో రూ.19,500, అలాగే మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించిన 4 కేసుల్లో రూ.4,000 జరిమానాలు విధించబడినట్లు తెలిపారు.

## విద్యార్థులు సమయానికి విలువనివ్వాలి

**● నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**మర్రిగూడ, నవంబర్ 28 (జనం సాక్షి) :** విద్యార్థులు సమయానికి విలువనిచ్చి చదివితే అన్ని రంగాల్లో రాణిస్తారు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థినిలతో అన్నారు. ఉపాధ్యాయురాలు వలే జిల్లా కలెక్టర్ విద్యార్థినిలకు గణితం బోధించి మినీ క్లాక్ గురించి ప్రశ్నలు అడిగి జవాబులు చెప్పిన వారికి చాక్లెట్స్ పంపిణీ చేశారు. శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాల మరియు జూనియర్ కళాశాల ను ఆకస్మిఖంగా తనికి చేశారు.పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలతో మాట్లాడుతూ బాగా చదువుతున్నారా? రోజు పాఠశాలకు వస్తున్నారా? మీ పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయి? అని అడిగారు. కెజిబివి పాఠశాల శుభ్రంగా,చాలా బాగుందని కలెక్టర్ మెచ్చుకున్నారు. పాఠశాల మొత్తం తిరిగి వసతులు ఎలా ఉన్నాయని గదులు చాలా బాగున్నాయని అన్నారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల సంఖ్యను పాఠశాల బోర్డు మీద చూసి తహసీల్దార్ తో విద్యార్థులు ఎందుకు రాలేదో తెలుసుకొని పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆమె గణిత శాస్త్రం బోధిస్తూ దివ్య, ప్రణతి, కీర్తన అనే ముగ్గురు విద్యార్థులతో బోర్డుపై మినీ క్లాక్ డ్రాయింగ్ వేయించి విద్యార్థులనిలను ప్రశ్నలు అడిగారు. జవాబు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు .విద్యార్థులు బాగా చదువుకొని సమయానికి విలువ ఎక్కువ ఇచ్చి చదువుకుంటే అన్ని రంగాలులో అభివృద్ధిలోకి వస్తారన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ప్రయోజకులు కావాలని చెప్పారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ ,ఎంఈఓ బి శ్రీనివాస్, రవికుమార్. ఎస్ఓ జ్యోతి ఉన్నారు.

# జాతీయస్థాయిలో క్రీడలు నిర్వహించడం అభినందనీయం

**కోదాడ, నవంబర్ 28 (జనం సాక్షి) :** క్రీడల్లో ఓటమి చెందిన క్రీడాకారులు ఓటమికి కుంగి పోకుండా తిరిగి సాధన చేసి విజేతలుగా నిలవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని సిసిఆర్ విద్యానిలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 19వ సిఎస్ఏ జాతీయ స్థాయి క్రీడా పోటీల విజేత లకు బహుమతులు అందజేసి మాట్లాడారు. జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించి సీసీ ఆర్ విద్యా నిలయం కోదాడ కు జాతీయ స్థాయి లో వన్నె తెచ్చిందని కొనియాడారు. సిసిఆర్ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తి నీ కలిగి ఉండడమే ప్రదానం అన్నారు. వివిధ రాష్ట్రాల నుండి వందలాది మంది విద్యార్థులు స్పోర్ట్స్ మీట్ లో పాల్గొనడం అభినందనీయం అన్నారు. కాగా తమిళం మాట్లాడి తమిళ నాడు రాష్టం




క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. క్రీడా కారులకు తన వంతు సహకారం అందిస్తున్నారు. విద్యా సంస్థలు విలువల తో కూడిన విద్యను అందించడం తో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడలతో విలువలు, క్రమ శిక్షణ అలవడు తాయన్నారు. కాగా పాఠశాల యాజ మాన్యం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కాగా గత నాలుగు రోజులుగా హోరీ గా జరిగిన జాతీయ స్థాయి క్రీడలకు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రల నుండి 29పాఠశాలల నుండి 1450మంది కబడ్డి,వాలీబాల్, హ్యాండ్ బాల్, త్రో బాల్, బాస్కెట్ బాల్, స్పోర్ట్స్ ఈవెంట్స్ లో ప్రాతినిధ్యం వహించారు. ప్రొవిన్షియల్ సుపీరియర్ ఉడుముల శౌరీలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ సుపీరియర్ జనరల్ సిస్టర్ ఆల్ఫోన్సా, సిస్టర్ నక్షత్రం, సిస్టర్ శాంతా మేరీ, సిస్టర్ ఇరుదయం జూలియట్, సిస్టర్ విజయ ఫాదర్ ఫజోసాఫ్ రెడ్డి పాఠశాల హెచ్ఎం సిస్టర్ అన్ జ్యోతి, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఎంఈఓ సలీం షరీఫ్,బాల్ రెడ్డి, సుందరి వెంకటేశ్వర్లు, లామ్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో ఎగిరేది గులాబీ జెండానే..



**హాలియా, నవంబర్ 28 (జనం సాక్షి) :** నల్లగొండ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సభలో మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీశ్ రెడ్డి, జిల్లా శాసనమండలి సభ్యులు ఎం.సి. కోటిరెడ్డిల సమక్షంలో పలు కీలక నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర మండలం, కోమటికుంట తండా (కేకే తండా) మాజీ గ్రామపంచాయతీ సర్పంచ్ బాణావత్ శంకర్ నాయక్ తో సహా పలువురు కాంగ్రెస్ కీలక నేతలు గులాబీ గూటిలో చేరారు. నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అన్నీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కేవలం ఓటు కోసమేనని ధ్వజమెత్తారు. వృద్ధులకు 4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మి పథకం, విద్యార్థులకు విద్యా భరోసా, నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇలాంటి ఏ హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన తీవ్రమైన స్థాయిలో విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు రామావత్ రవీందర్ కుమార్ నాయక్, మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**● నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**మర్రిగూడ, నవంబర్ 28 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి అని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులు సూచించారు. మర్రిగూడ మండలంలోని సరంపేట, శివన్న గూడెం ,మర్రిగూడ గ్రామాలలో పర్యటించి నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ, సిబ్బంది హాజరు, అభ్యర్థులకు కల్పిస్తున్న సేవలు, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి కేంద్రంలో క్రమశిక్షణ, నిబంధనలు కచ్చితంగా పాటించాలని, రిజర్వేషన్లను కల్పించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సహాయ డెస్క ఏర్పాటు అభ్యర్థులు కరెంట్ బ్యాంకు ఖాతా సమర్పించాల్సి ఉంటుందని, అభ్యర్థులు సమర్పించే నగదును ఎలా స్వీకరిస్తున్నారని ? అలాగే వారికి రసీదు ఇస్తున్నారా? అని అడిగారు . డిజిటల్ గోడ గడియారం అమర్చుకోవాలని చెప్పారు. చెక్ లిస్టులను నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన నామినేషన్లను టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు.తాగునీటి సౌకర్యం, వికలాంగుల కోసం ర్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేసుకోవాలని ,ప్రతి అభ్యర్థి గౌరవంగా ఇబ్బందిలేకుండానామినేషన్ దాఖలు చేయగల వాతావరణ కల్పించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కార్యక్రమంలో చండూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, తదితరులు ఉన్నారు.

# మోడల్ ఫామ్ డెమో హౌస్ రైతులకు మార్గదర్శకంగా మారాలి

**● జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**బూర్గంపహాడ్, నవంబర్ 28 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర గ్రామ పంచాయతీలో వ్యవసాయ ఆధారిత బహుముఖ ఆదాయ వనరులను గ్రామస్థులకు చేరువ చేయడం లక్ష్యంగా రూపొందించిన మోడల్ ఫామ్ డెమో హౌస్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం సందర్శించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాహంపై దృష్టి సారించి రూపొందించిన ఈ మోడల్ ఫార్మ్ జిల్లా స్థాయిలో ఒక ఆదర్శ ప్రదర్శనగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుపయోగంగా ఉన్న భూములను సక్రమ ప్రణాళికతో వినియోగిస్తే గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరులు సృష్టించడం సాధ్యమవుతుందని అన్నారు. మొరంపల్లి బంజార గ్రామంలో 15 గుంటల నిరుపయోగ భూమిని ఉపయోగించి కూరగాయల సాగు, బంతిపూల పెంపకం, చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం వంటి పలు విభాగాలను సమగ్ర ప్రదర్శన రూపంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయిలో రైతులు, మహిళా సంఘాలు, యువతకు ప్రత్యక్ష అవగాహన కలిగించడానికి ఈ మోడల్ ఫామ్ ఉపయుక్తంగా ఉండాలని తెలిపారు. కౌజు పిట్టలు



మరియు చేపల పెంపకం కొరకు జిల్లా కలెక్టర్ అందించిన నమూనా ఆధారంగా ప్రత్యేక షెడ్‌ను నిర్మించడం పూర్తయ్యిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. షెడ్లు నీడ, గాలి ప్రసరణ, శుభ్రత, నిర్వహణ సౌకర్యాలను ప్రతిబింబిస్తూ రూపొందించబడినట్లు తెలిపారు. ఈ మోడల్‌ను ఆధారంగా తీసుకుని ఇతర గ్రామాల్లో కూడా ఇలాంటి విభాగాలను అభివృద్ధి చేయడానికి కలెక్టర్ సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం ఈ మోడల్ ఫార్మ్ నిర్వహణను స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. సి సి లీలావతి, వివో ఏ భారతీ సమన్వయంతో ఏపీఎం హేమంతిని పర్యవేక్షణలో రోజువారీ పనులు జరుగుతున్నాయి. స్థానిక మహిళా సంఘాల ఆద్వర్యంలో ఈ యూనిట్ శ్రమతో కూడిన ఆదాయ వనరు మోడల్‌గా ఎదుగుతుందని అధికారులు తెలిపారు. పందిరి విధానంలో పూర్తిగా సేంద్రియ ఎరువులతో సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం సొరకాయ, బీరకాయ, కీరదోస పంటలు కోత దశకు చేరుకున్నాయి. అలాగే కాకరకాయ, టమాటా, బంతిపూలు పూత దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. నీటి వినియోగం, నేల సారాన్ని పెంచే పద్ధతులు, సేంద్రియ ఎరువుల తయారీ, పురుగుమందుల ప్రత్యామ్నాయ విధానాలపై కూడా మోడల్ ఫార్మ్‌లో ప్రత్యేకంగా ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇలాంటి మోడల్ ఫార్మ్‌లు పెరిగితే రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశాలు అధికమవుతాయని, సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం లభిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మోడల్ ఫార్మ్‌ను శిక్షణ కేంద్రంగా వినియోగించి రైతులకు, మహిళా సంఘాలకు, యువతకు ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.




# సింగిల్ ఛార్జ్‌తో 679 కిలోమీటర్లు!..

## మహీంద్రా కొత్త ఎలక్ట్రిక్ కారు..

**న్యూఢిల్లీ:**ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా కొత్తగా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఎక్స్‌ఈవీ9ఎస్‌ని ప్రవేశపెట్టింది. ఈ సెవెన్ సీటర్ ధర రూ. 19.95 లక్షల నుంచి రూ. 29.45 లక్షల వరకు (ఎక్స్‌-షోరూం) ఉంటుంది. 2027, 2028 క్యాలెండర్ సంవత్సరాల నాటికి తమ మొత్తం అమ్మకాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటాని 25 శాతానికి పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ జెజూరికర్ వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరుకల్లా ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు 8,000 ఈవీల స్థాయికి పెంచుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం ప్రతినెలా 4,000–5,000 ఈవీలను విక్రయిస్తుండగా, దీన్ని 7,000కు పెంచుకునే ప్రణాళికలు ఉన్నాయన్నారు. గత ఏడు నెలల్లో 30,000 పైగా ఈవీలను (బీఈ 6, ఎక్స్‌ఈవీ 9) విక్రయించామని, రూ. 8,000 కోట్ల ఆదాయం లభించిందని పేర్కొన్నారు.2027 కల్లా 1,000 చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. తమ బీఈ6 వాహనాల తయారీకి సంబంధించి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్‌ఐ) స్కీము కోసం దరఖాస్తు చేసుకుంటున్నామని రాజేష్ చెప్పారు.వచ్చే ఏడాది జనవరి 14 సంక్రాంతి నుంచి ఎక్స్‌ఈవీ9ఎస్ బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు మహీంద్రా కంపెనీ తెలిపింది. జనవరి 23 నుంచి డెలివరీలు మొదలవుతాయని వెల్లడించింది.ఈ ఎలక్ట్రిక్ 7 సీటర్ కారు 59 (కిలోవాట్ హవర్), 70 %ఎౌష్త్ర, 79ఎౌష్త్ర% బ్యాటరీ ప్యాక్‌లతో వస్తుంది. 175 కిలోవాట్ వరకు ఫాస్ట్ ఛార్జింగ్ సౌకర్యం కూడా అందిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది.కంపెనీ ప్రకారం.. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ వేరియంట్లను బట్టి ఒకసారి ఛార్జింగ్ చేస్తే 521 కిలోమీటర్ల నుంచి 679 కిలోమీటర్ల వరకు దూసుకెళ్తుంది. వీటిలో 79 %ఎౌష్త్ర% బ్యాటరీ ప్యాక్ వేరియంట్ సింగిల్ ఛార్జ్‌కు గరిష్ఠంగా 679 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది.ఇక ఈ 7 సీటర్ ఎక్స్‌ఈవీలో 527 లీటర్ల బూట్ స్పేస్, డ్యాష్ బోర్డుపై మూడు డిజిటల్ స్క్రీన్లు, రెండో వరుసలో ప్రయాణికుల కోసం రెండు అదనపు స్క్రీన్లు ఇచ్చారు. ఏడు ఎయిర్ బ్యాగులు, సన్ రూఫ్, 360 డిగ్రీల కెమెరా, ఏడీఏఎస్ వ్యవస్థ, ఆటో పార్కింగ్, డ్రైవర్ డ్రౌజీనెస్ డిటెక్షన్ వంటి అదనపు ఫీచర్లు ఇందులో ఉన్నాయి.



# మహిళల ప్రీమియర్ లీగ్.. స్పాన్సర్‌ల క్యూ..

**న్యూఢిల్లీ:**భారత్ ఇటీవల ఐసీసీ ఉమెన్ ప్రపంచ కప్ టోర్నీలో విజయం సాధించిన తర్వాత మహిళల ప్రీమియర్ లీగ్ 2026 వేలం అంచనాలను మించిపోయింది. ఆటగాళ్లకు కోట్ల రూపాయాలు ఇచ్చేందుకు ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి.దాంతోపాటు చాట్‌జీపీటీ, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, బిస్లెరీ వంటి ప్రముఖ సంస్థలు లీగ్‌లో కొత్త స్పాన్సర్‌లుగా చేరడం గమనార్హం. జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5, 2026 వరకు షెడ్యూల్ చేసిన నాలుగో ఎడిషన్ డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌కు పెరుగుతున్న కార్పొరేట్ కంపెనీల ఆసక్తిని ఇది హైలైట్ చేస్తుంది.ఐసీసీ ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'ను గెలుచుకున్న టీమ్ ఇండియా స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ రూ.3.2 కోట్లతో ఈ వేలంలో అత్యధిక ధర సాధించారు. వేలం పూల్‌లో 73 స్లాట్‌ల కోసం 277 మంది ఆటగాళ్లు పోటీ పడ్డారు. అగ్రశ్రేణి క్రికెటర్ల కోసం ఫ్రాంచైజీలు గట్టిగానే ప్రయత్నించాయి. వేలంలో అధిక ధర సాధించిన కొందరు ఆటగాళ్ల వివరాలు కింది విధంగా ఉంది.

అమెలియా కెర్ (న్యూజిలాండ్): ముంబై ఇండియన్స్‌కు రూ.3 కోట్లు
శిఖా పాండే (భారత్): యూపీ వారియర్జ్ రూ.2.4 కోట్లు
సోఫీ డివైన్ (న్యూజిలాండ్): గుజరాత్ జెయింట్స్ రూ. 2 కోట్లు




మెగ్ లానింగ్ (ఆస్ట్రేలియా): యూపీ వారియర్జ్ రూ.1.9 కోట్లు
శ్రీచరణి (భారత్): ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.3 కోట్లు
చినెల్లె హెన్రీ (వెస్టిండీస్): ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.3 కోట్లు
ఆశా శోభన (భారత్): యూపీ వారియర్జ్ రూ.1.1 కోట్లు

స్పాన్సర్‌షిప్‌లు..
కొత్తగా చేరిన చాట్‌జీపీటీ, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, బిస్లెరీ లీగ్‌కు మరింత బలాన్ని ఇచ్చాయి. బీసీసీఐ ప్రకటన ప్రకారం ఈ మూడు సంస్థల ఒప్పందాల విలువ రూ.48 కోట్లు. ఇది 2026, 2027 సీజన్లలో కొనసాగుతుంది. ఇప్పటికే ఉన్న అగ్రశ్రేణి భాగస్వాముల వివరాలు ఇలా ఉన్నాయి.
టాటా గ్రూప్ (టైటిల్ పార్టనర్) సింటెక్స్, హెర్బాలైఫ్ (ప్రీమియర్ భాగస్వాములు) సియట్ (స్ట్రాటజిక్ టైమ్ అవుట్ పార్టనర్)

# రూ. 300తో ఇంటినుంచి పారిపోయి...ఇపుడు రూ. 300 కోట్లు

**ముంబై:**రోజుకు రూ.20 సంపాదన నుండి రూ.300 కోట్లకు పైగా విలువైన బ్రాండ్‌ను నిర్మించగలమైనా ఎవరైనా కలగంటారా? కానీ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గొప్ప వ్యాపారవేత్తగా నిలిచింది.చిన్న చినుకులా మొదలై, ప్రభంజనం సృష్టించిన 'చిను కలా' స్టోరీ వింటే... ఆత్మవిశ్వాసం, పట్టుదల , కృషి ఉంటే ఏదైనా సాధ్యమే అనిపిస్తుంది.ఆమె ఏ బిజినెస్ కోర్సూ చదవలేదు. ఆమె జీవితమనే విశ్వవిద్యాలయంలోనే ప్రతీదీ నేర్చుకున్నారు. నో కార్పొరేట్ సపోర్ట్. నో గాడ్‌ఫాదర్ నో ప్లాన్ బి . ఎలాగైనా సాధించాలనే తపన, ఆశ, కల, నమ్మకం. కేవలం 36 చదరపు అడుగులు. ఒకే నగల ట్రే. కట్ చేస్తే..పొట్టతిప్పల కోసం అష్టకష్టాలు పడుతూ లగ్జరీ అంటే ఏంటో తెలియని జీవితంనుంచి కోట్ల టర్నోవర్‌తో ఒక లగ్జరీ బ్రాండ్‌తో ఉన్నత శిఖరాలకు చేరి చిను కలా తన కలలను పండించుకున్న తీరు స్ఫూర్తి దాయకం. శిల..శిల్పంగా మారాలంటే ఉలి దెబ్బలు తినాల్సిందే అన్నట్టుగా ఎన్నో భయంకరమైన అనుభవాలనుంచి ఎదగి ఉన్నత శిఖరాలకు చేరింది. తన బ్రాండ్ చిను కళాను భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఫ్యాషన్ జ్యువెలరీ బ్రాండ్‌గా నిలిపింది.అక్టోబర్ 10,



1981న ముంబైలోని ఒక సాధారణ కుటుంబంలో జన్మించింది చిను. ఏడాది వయసున్నప్పుడే ఆమెను తల్లి విడిచిపెట్టి సౌదీకి వెళ్లిపోయింది. తండ్రి, రెండో పెళ్లి చేసుకొని సవతి తల్లిని తీసుకొచ్చాడు. కష్టాలు మొదలయ్యాయి. చినుతోవాగ్వాదం సందర్భంగా నీ యిష్టం వచ్చినట్టు నువ్వు బతకాలనుకుంటే ఇంట్లోంచి వెళ్లిపొమ్మన్నాడు.అంతే 15 ఏళ్ల చిను జేబులో కేవలం రూ. 300 మరియు కొన్ని బట్టలతో ఇంటి నుండి బయలుదేరింది. ఆమె టికెట్ లేకుండా నానాసుపారా నుండి సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి అక్కడ పడుకోవడానికి ప్రయత్నించింది కానీ ఆమె పడుకోలేకపోయింది. మరుసటి రోజు తాను ఎక్కడికి వెళ్లాలో, ఏమి తినాలో అర్థంకాక రాత్రంతా ఏడ్చింది, ఉదయం, ఒక మహిళ ఆమె కథ విని, కమిషన్ సంపాదన కోసం ఇంటింటికీ తిరిగి అమ్మే పనిని ఒకదాన్ని అప్పగించింది. ఏదో ఒకపనిచేసుకని, కడుపునింపుకుంటూ గౌరవంగా బతుకుతూ పైకి ఎదగాలని విజయం సాధించాలని అప్పుడే దృఢంగా నిశ్చయించుకుంది.డోర్-టు-డోర్ సేల్ ద్వారా సేల్స్‌గర్ల్ అవతార మెత్తింది. ఇంటింటికీ తిరుగుతూ వంటింటి కత్తుల, కోస్టర్ సెట్‌లను అమ్మడం స్టార్ట్‌చేసింది. అలా రోజుకు కేలం 20 రూపాయల సంపాదనతో కడుపు నింపుకునేది. అలా రోజుకు 25 రూపాయలు వసూలు చేసే వసతి గృహంలో నివసించింది. ఆమె మొదటి అమ్మకాల ప్రయత్నంలో, ఒక మహిళ ఆమె ముఖం మీద తలుపు వేసేసింది. అలా గంటల తరబడి గుండెలు పగిలేలా ఏడ్చింది కానీ వదులుకోలేదు. వెయిట్రెస్, రిసెప్షనిస్ట్ మొదలైన వివిధ ఉద్యోగాలను చేపట్టింది.2002లో ముంబైలోని టాటా కమ్యూనికేషన్స్‌లో టెలిమార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం సంపాదించడంతో చిను జీవితంలో ఒక మలుపు తిరిగింది. ఇక్కడ ఆమె తన కాబోయే భర్త అమిత్ కళను కలుసుకుంది, అతను %వీదీూ% హెూల్డర్, ఆమె వ్యవస్థాపక ప్రయాణంలో కీలకమైన మద్దతుదారుగా మారారు. వారు 2004లో వివాహం చేసుకుని బెంగళూరుకు వెళ్లారు, అక్కడ చినుకు మోడలింగ్ పట్ల ఉన్న ప్రేమ ఆమెను 2008 గ్లాడ్రాగ్స్ మిసెస్ ఇండియా పోటీలో పోటీ పడేలా చేసింది, అక్కడ ఆమె టాప్ 10లో నిలిచింది. ఈ సమయంలో చిను ఉపకరణాలు , ఆభరణాల గురించి నేర్చుకుంది.తన మోడలింగ్ అనుభవాల నుండి ప్రేరణ పొందిన చిను, కార్పొరేట్ మర్చండైజ్ వ్యాపారంలోకి అడుగుపెట్టి, ఫోంటే కార్పొరేట్ సొల్యూషన్స్‌ను స్థాపించింది. ఆ కంపెనీ త్వరగా ఆదరణ పొందింది, సోనీ, ఎయిర్‌టెల్ వంటి ప్రఖ్యాత బ్రాండ్‌లకు వస్తువులను ఉత్పత్తి చేసింది.2014లో, స్టైలిష్ మరియు బ్రాండెడ్ ఉపకరణాల కోసం భారతీయ ఆభరణాల మార్కెట్లో అంతరాన్ని గుర్తించి, ఆమె రూబన్స్ యాక్సెసరీస్‌న రూ. 3 లక్షల పెట్టుబడితో ప్రారంభించారు. రూబన్స్ యాక్సెసరీస్ బెంగళూరులోని ఫీనిక్స్ మాల్‌లో 36 చదరపు అడుగుల చిన్న స్థలంలో ప్రారంభమైంది. అది కాస్తా బెంగళూరులోని చాలా ప్రసిద్ధ మాల్ ఫోరం మాల్‌లో తన రెండవ స్టోర్‌ను ప్రారంభించే స్థాయికి ఎదిగింది.

### నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ఆసియా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప నష్టాలతో ప్రారంభమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 37 పాయింట్లు లేదా 0.04 శాతం నష్టపోయి 85,683 వద్ద ఉండగా, నిఫ్టీ 25 పాయింట్లు లేదా 0.10 శాతం తగ్గి 26,190 వద్ద ఉంది.బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ రెండు సూచీలు గురువారం ఇంట్రాడే ట్రేడింగ్ లో తాజా ఆల్-టైమ్ గరిష్టాలను తాకాయి. మొదటిసారిగా సెన్సెక్స్ 86,000, నిఫ్టీ 26,300 స్థాయిలను అధిగమించాయి. విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.18 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం పడిపోయాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.50 | ₹ 6.52 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,17,100 | ₹ 1,27,750 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,80,000



# నాన్న బతికే ఉన్నాడా? చెప్పండి!

## ఇమ్రాన్‌ఖాన్ కుమారుడి బిగ్ వార్నింగ్

పాకిస్తాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ మరణం గురించి పుకార్లు, ఊహాగానాలు ఇంటర్నెట్‌లో హల్ చల్ చేస్తున్నాయి.పాకిస్తాన్ జైల్లో హత్యకు గురయ్యారనే వార్త సంచలనం రేపుతోంది. అసలు ఇమ్రాన్ ఎందుకు హత్యకు గురయ్యాడు? అధికారిక ప్రకటన ఎందుకు రావడం లేదు? బతికే ఉన్నాడా? లేదా? అనే సందేహాలు యావత్ ప్రపంచాన్ని పట్టి కుదిపేస్తున్నాయి.పాకిస్తాన్ జైలు అధికారులు ఈ పుకార్లను తోసిపుచ్చినప్పటికీ, ఇమ్రాన్ ఖాన్ చిన్న కుమారుడు కాసిమ్ ఖాన్, తన తండ్రిని 'డెత్ సెల్'లో ఉంచారంటూ మండిపడ్డారు. గ 'అమానవీయ ఒంటరితనం' దారుణం అంటూ, తదనరంత పరిణామాలను ఎదుర్కోక తప్పదు పాకిస్తాన్ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. అసలు బతికి ఉన్నాడా అనేది స్పష్టం చేయాలంటూ ఆయన కోరుతున్నారు. తన తండ్రి విడుదలను డిమాండ్ చేస్తూ ట్వీట్ చేశారు. తన తండ్రి జైలు పాలై 845 రోజులు అయిందని, గత ఒకటిన్నర నెలలుగా, అతని కుటుంబంతో ఎలాంటి సంబంధం లేకుండా అతన్ని డెత్ సెల్‌లో ఉంచారని కాసిం ఖాన్ ఆరోపించారు.గత ఆరు వారాలుగా, అతన్ని పూర్తిగా ఒంటరిగా ఉన్న డెత్ సెల్‌లో ఒంటరిగా ఉంచారు. స్పష్టమైన కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, అతని సోదరీమణులు ప్రతి సమావేశానికి హాజరుకాకుండా అడ్డుకుంటున్నారు. ఫోన్ కాల్స్ లేవు. ములాఖత్‌లు లేవు, అతని క్షేమం గురించి తెలియదు, తాను, తన సోదరుడు తండ్రిని ఏ విధంగానూ సంప్రదించలేకపోయామని కాసిం ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తిగా సమాచారం నిషేధించడం ప్రోటోకాల్‌లో భాగం కాదని ఆరోపించారు. కావాలనే తన తండ్రి పరిస్థితిని దాచిపెట్టడానికి, ఆచూకీని కుటుంబానికి తెలియకుండా చేస్తున్నారన్నారు.తండ్రి భద్రత సమాచారాన్ని దాచిపెట్టడం, అమానవీయ ఒంటరితనం పర్యవసానాలను పాకిస్తాన్ ప్రభుత్వం, దాని మద్దతు దారులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. పూర్తిగా చట్టపరమైన, నైతిక, అంతర్జాతీయ బాధ్యత వహించక తప్పదన్నారు. దీనిపై అంతర్జాతీయ సమాజం మరియు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలకు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తండ్రి బతికే ఉన్నారని ధృవీకరించాలని,రాజకీయ కారణాలతోనే అత్యంత ప్రజాదరణ పొందిన రాజకీయ నాయకుడిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అటు ఇమ్రాన్ ఖాన్ ముగ్గురు సోదరీమణులలో ఒకరైన అలీమా ఖానుమ్ కూడా తమ కుటుంబంతో సమావేశాన్నపదేపదే అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు .దీనిపై జైలు ఎదుట పోరాటాన్ని కూడా చేపట్టారు. అడియాలా జైలులో తన సోదరుడు చికిత్స పొందుతున్న తీరుపై ఇమ్రాన్ ఖాన్ సోదరి నోరీన్ నియాజీ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. అసలు ఏమైందీ, ఏమీ చెప్పడం లేదు, ఎవరినీ కలవనివ్వడం లేదని ఆరోపించారు. ఈ సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని, తనను సంప్రదించడానికి వీలు లేకుండా చేశారన్నారు. పాకిస్తాన్‌లో గడ్డు రోజులొచ్చాయి.నిరంకుశుల గురించి చదువుకున్నాం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితుల్లో జీవిస్తున్నాం అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌ను నోరీన్ నియాజీ "నియంత" అని విమర్శించారు. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని దేశ చరిత్రలోనే అత్యం ప్రజాకంటక పాలనగా అభివర్ణించారు. పాకిస్తాన్ తన చీకటి కాలంలో ఉంది. ప్రజలను అపహరించి చంపేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సంపూర్ణ ఆరోగ్యంతో ఇమ్రాన్


- ఆయన అడియాలా జైలులోనే ఉన్నారు
- ప్రకటించిన పాకిస్తాన్ రక్షణ మంత్రి ఆసిఫ్

లాహెూర్: మాజీ క్రికెటర్, పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్(73) కస్టడీలో చనిపోయారంటూ వస్తున్న వార్తలు, అడియాలా జైలు వద్ద ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. జైలులోనే ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని ప్రకటించింది. ఇమ్రాన్‌ను ఎక్కడికీ తరలించలేదని, జైలులోనే పూర్తి స్థాయిలో అవసరమైన వైద్య సాయం అందుతోందని పేర్కొంది.'తీవ్ర అనారో గ్యంతో ఉన్న ఇమ్రాన్‌ను అడియాలా జైలు నుంచి ఆస్పత్రికి తరలించామంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు'అంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత కూడా అయిన ఇమ్రాన్ ఖాన్ వివిధ అవినీతి ఆరోపణలు, ఉగ్రవాదం కేసుల్లో 2023 ఆగస్టు నుంచి, జైలు జీవితం గడుపుతుండటం తెల్సిందే.

# పాతికేళ్లకే యంగెస్ట్ బిలియనీర్..

## అమన్ అంటే అమేయ ప్రతిభ

**ముంబై:**యువ ప్రపంచంలో ఇప్పుడు హాట్ టాపిక్... వైబ్ కోడింగ్. వైబ్ కోడింగ్ అనేది ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో కోడ్ రాసే విధానం. పెద్దగా సాంకేతిక పరిజ్ఞానం, డిగ్రీలు అక్కర్లేదు.వైబ్ కోడింగ్‌కు సంబంధించి ఏఐ టూల్ 'కర్సర్'ను రూ పొందించి ప్రపంచ దృష్టిని ఆకర్షించిన అమన్ సాంగర్ పాతికేళ్ల వయసులోనే బిలియనీర్ అయ్యాడు...కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఎంతోమంది కాలేజీ కోడర్‌లలో అమన్ సాంగర్ ఒకరు. ఇప్పుడు మాత్రం గ్లోబల్ ఏఐ ఇన్నోవేషన్‌కు సంబంధించి ప్రపంచ ప్రసిద్ధ యువకులలో ఒకరిగా పేరు తెచ్చుకున్నాడు.జనరేటివ్ ఏఐ ప్రపంచంలో 'అమన్ సాంగర్' అనేది సుపరిచిత పేరుగా మారింది. 'ఎనీస్ఫియర్' సహ-వ్యవస్థాపకులలో 25 సంవత్సరాల అమన్ ఒకరు. ఫాస్ట్-రైజింగ్ ఏఐ టూల్‌గా పేరు తెచ్చుకున్న 'కర్సర్' అనేది ఎనీస్ఫియర్ కంపెనీ సృష్టి.




మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో తనకు పరిచయం అయిన మైఖేల్ ట్రుయేల్, సుయాలే, ఆర్విడ్ మార్క్‌లతో కలిసి 'ఎనీస్ఫియర్' ?రంభించాడు అమన్. అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానం ఉన్న టీమ్‌గా 'ఎనీస్ఫియర్' పేరు తెచ్చుకుంది. అమన్, మైఖేల్ ట్రుయెల్‌లు 'నియో స్కాలర్స్'గా ఎంపికయ్యారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న యువతరాన్ని సిలికాన్ వ్యాలీలోని ఫౌండర్స్, ఇన్వెస్టర్‌లకు పరిచయం చేసే కార్యక్రమమే...నియో స్కాలర్స్.ఈ పరిచయాల వల్ల కంపెనీ ఫస్ట్ రౌండ్ ఫండింగ్ సాఫీగా సాగింది. మొదట్లో 'ఎనీస్ఫియర్' బృందం కంప్యూటర్-ఎయిడెడ్ డిజైన్‌కు సంబంధించి ఏఐ టూల్‌ను రూపొందించింది. ఆ తరువాత దారి మార్చి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ వైపు అడుగులు వేసింది. ఇది తాము కొన్ని సంవత్సరాల పాటు పనిచేసిన డొమైన్. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ వైపు రావాలని తీసుకున్న నిర్ణయమే 'కర్సర్'ను రూపొందించడానికి కారణం అయింది. ఈ ఏఐ-పవర్డ్ కోడ్ ఎడిటర్ తక్కువ కాలంలోనే ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 'వైబ్ కోడింగ్' అనే ఐడియాను పరిచయం చేసింది కర్సర్.వైబ్ కోడింగ్ ద్వారా డెవలపర్స్ నేచురల్ లాంగ్వేజ్ మోడల్స్‌ని ఉపయోగించి కోడ్‌కు సంబంధించి రైట్, ఎడిట్, డీబగ్ చేయవచ్చు. కాలిన్స్ డిక్షనరీ వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా 'వైబ్ కోడింగ్' ఎంపికైంది. తక్కువ టైమ్‌లోనే ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్న 'ఎనీస్ఫియర్' వేగంగా వృద్ధి చెందింది. కంపెనీ కో-ఫౌండర్స్ బిలియనీర్‌లుగా మారారు. పద్నాలుగేళ్ల వయసులోనే కోడింగ్ మొదలుపెట్టాడు అమన్. ?ోగ్రామింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన విషయాలపై ఆసక్తి ప్రదర్శించేవాడు.మనలో ఒక అంశంపై ఆసక్తి ఉంటే అది ఒకేచోట ఆగి?ోదు. నాన్‌స్టాప్‌గా ప్రయాణ ిస్తూనే ఉంటుంది. ఎన్నో దారులలో ఎన్నో విషయాలు తెలుస్తుంటాయి. అలాంటి ఒక బాటసారి అమన్ సాంగర్. వీడియో గేమ్స్ కంటే ఎక్కువగా కోడింగ్ అంటే ఇష్టం. ఆ ఇష్టం అతడిని ఎంతో దూరం నడిపించింది. సిలికాన్ వ్యాలీ వరకు తీసుకువెళ్లి సాంకేతిక దిగ్గజాలను పరిచయం చేసింది. పోటీలో మన ముందు ఉన్న వ్యక్తిని చూసి భయపడవద్దు. వెనక్కి తగ్గవద్దు. మన కంటే అతడికి ఎక్కువ తెలిసి ఉంటే అతడిని స్ఫూర్తిగా తీసుకోవాలి. ?ోటీతో మనల్ని మనం మరింతగా మెరుగుపరుచుకోవచ్చు' అంటున్నాడు అమన్ సాంగర్.

# కాల్పుల ఘటన.. ట్రంప్ కఠిన ఆదేశాలు

వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే అధ్యక్షుడి అధికారిక నివాస భవనం వైట్‌హౌస్ సమీపంలోనే కాల్పుల కలకలం రేగిన సంగతి తెలిసిందే.విధి నిర్వహణలో ఉన్న వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డు సిబ్బందిపై ఓ యువకుడు పాయింట్ 357 స్మిత్ అండ్ వెసన్ రివాల్వర్‌తో హఠాత్తుగా కాల్పులు జరిపాడు. మొత్తం ముగ్గురు జవాన్లపై కాల్పులు జరిగాయి. ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరో జవాను స్వల్పంగా గాయపడ్డాడు.ఈ క్రమంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌కార్డ్ హెూల్డర్స్‌పై దృష్టిపెట్టారు. 19 దేశాల నుండి వచ్చిన వారికి జారీ చేసిన గ్రీన్ కార్డులపై విస్తృత సమీక్ష చేపట్టాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అఫ్గాన్‌తో సహా మరో 18 దేశాలకు చెందిన గ్రీన్ కార్డ్ హెూల్డర్స్‌ను సమీక్షించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో వెల్లడించారు. అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో వెల్లడిం చారుఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ప్రతి విదేశీయుడి గ్రీన్ కార్డును పూర్తిస్థాయిలో పునఃపరిశీలన చేయాలి" అని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించినట్లు తెలిపారు.కాగా, ఇటీవలి కాలంలో భారత్, అఫ్గానిస్తాన్ మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. తాలిబన్ పాలకులు భారత్‌కు స్నేహహస్తం అందిస్తున్నారు. కలిసి పనిచేస్తామని చెబుతున్నారు. మరోవైపు పాకిస్తాన్ ప్రభుత్వం, తాలిబన్ పాలకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది.

# సామాజిక విప్లవ వీరుడు.. జ్యోతిరావు పూలే

19వ శతాబ్దంలో జ్యోతిరావు పూలే సమకాలీన కుల, లింగ వివక్ష లకు వ్యతిరేకంగా చేసిన పోరాటం మొత్తం భారత సామాజిక చరిత్రలో ఒక ప్రధాన అధ్యాయంగా నిలిచింది. 1827లో మహా రాష్ట్రలో గోవిందరావు, చిన్నాబాయి దంపతులకు జన్మించిన పూలే విద్యార్థిగా ఉన్నప్పుడు 'అమెరికా స్వతంత్ర ఉద్యమం', 'శివాజీ జీవిత చరిత్ర', థామస్ పెయిన్ రచన 'మానవుని హక్కులు', జాన్ స్టువర్ట్ రాసిన 'స్వతంత్రం' వంటివి ప్రభావితం చేశాయి.పూలే జీవితంలో ఒక అసాధారణ సంఘటన, ఆయన భవి ష్యత్ జీవితాన్ని సామాజిక సేవకు అంకితమయ్యేటట్లుగా మార్చింది. తన బ్రాహ్మణ మిత్రుని ఆహ్వానం మేరకు అతడి పెండ్లి ఊరేగింపులో పాల్గొన్నందుకు బ్రాహ్మణులు పూలేను పక్కకు నెట్టివేసి కులం పేరుతో దూషించారు. 'శూద్రుడివి ఈ ఊరేగింపులో పాల్గొనడానికి ఎంత ధైర్యం?' అని అవమానించారు. ఈ అవమానం గురించి తన తండ్రికి వివరించాడు. తండ్రి కొడుకును బుజ్జగిస్తూ... పీష్వాల పాలనలో ఇది మామూలే అని చెప్పాడు. ఈ అన్యాయాన్ని ఎదుర్కోవడానికి శూద్రులు విద్యావంతులు అవ్వడం ఒక్కటే మార్గమని ఆయన భావించారు. ఉన్నత కులాలకు సంబంధించిన సామాజిక సమస్యలైన



సతీసహగమనం వంటి ఆచారాలనూ ఆయన వ్యతిరేకించారు. భర్త మరణించిన స్త్రీలు, అనాథ బాలల పునరావాసానికి అంకితభావంతో పనిచేశారు. స్త్రీ విద్యకోసం పాఠశాలలను ఏర్పాటు చేశారు. తన భార్య సావిత్రీబాయికి తనే చదువు చెప్పి ఆమెను టీచర్‌గా తయారు చేసి, ఈ పాఠశాలల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. పూలే తన సంస్థల నిర్వహణకు అవసరమైన ఆదాయ ఆర్జనకు కొంత కాలం క్వారీ కాంట్రాక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో క్వారీ కార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. సమస్యల పరిష్కారానికి ఎన్నోసార్లు అర్జీలను, విన్నపాలను బ్రిటిష్ గవర్నమెంట్‌కు సమర్పించారు. అమాయకు లైన కార్మికులను చైతన్యవంతులుగా మార్చడానికి వారికి అర్థమయ్యే భాషలో క్వారీల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలను రాశారు. 'సత్యశోధక సమాజ్' అనే సంస్థను 1873లో స్థాపించి దాని ద్వారానే శూద్రులకు విద్యను అందించడానికి ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఆయన సమాజ సేవకు మెచ్చిన ప్రజలు 'మహాత్మా' అనే బిరుదునిచ్చారు. ఆ అవిశ్రాంత పోరాట యోధుడి స్ఫూర్తి ఎప్పటికీ చెరిగిపోనిది.

# ప్రపంచంలోనే ఎత్తయిన శ్రీరాముడి విగ్రహం..

## దక్షిణ గోవాలో ఆవిష్కరించిన ప్రధాని మోదీ

**పణజీ(జనంసాక్షి):** ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ప్రధాని మోదీ శుక్రవారం ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని 'శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగాలీ జీవోత్తమ్ మఠం'లో 77 అడుగుల ఈ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా మోదీ అక్కడ పర్యటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు, సీఎం ప్రమోద్ సావంత్, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.ప్రధాని మోదీ ఈ మఠంలో ఉన్న ఆలయాన్ని కూడా



దర్శించారు. ఈ మఠం భార తదేశంలోనే అతి పురాతన మత సంస్థల్లో ఒకటిగా గుర్తిం పు పొందింది. గుజరాత్‌లో ఉన్న 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని తీర్చిదిద్దిన శిల్పి రామ్ సుతార్ శ్రీరాముడి విగ్రహాన్ని కూడా తయారుచేశారని వెల్లడించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
29 నవంబర్ 2025

# మాజీ మావోయిస్టు.. బిఆర్ఎస్ నేత సిద్ధన్న హత్య

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం.
- ఇంటర్వ్యూ ప్రాణాల మీదకు తెచ్చిందా..?
- జగిత్యాల పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు?





**రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 28, (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారు ప్రాంతంలోని అగ్రహారం గుట్టల్లో ఓ మాజీ మావో యిస్టు ప్రస్తుత బిఆర్ఎస్ పార్టీ నాయకులు హత్యకు గురికావడం జిల్లాలో కలకలం రేపుతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గండి లచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు సిద్దయ్య అలియాస్ నరసయ్య 1997 ప్రాంతంలో పీపుల్స్ వార్ పార్టీలో పని చేశారు.(మావోయిస్టు పార్టీలో విలీనం అయిన ఒక నాటి పీపుల్స్ వార్ పార్టీలు నాయకులు) సుమారు దశాబ్ద కాలం పాటు పనిచేసిన ఆయన అనంతరం జనజీవన ప్రవంతిలో కలిసి గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. గురువారం ఆయన వేములవాడ శివారులోని అగ్రహారంలో హత్యకు గురయ్యారు.

**ఇంటర్వ్యూ ప్రాణం తీసిందా..?**

కొంతకాలం క్రితం ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన సిద్దన్న జగిత్యాల జిల్లాకు చెందిన వ్యక్తిని ఆనాడు పార్టీ ఆదేశాల మేరకు హత్య చేసినట్లు తెలపడం ఆ విషయంలో జగిత్యాల జిల్లాకు చెందిన ఆనాడు హత్యకు గురైన వ్యక్తి కుమారుడు సిద్దయ్య హత్య చేసినట్లు ప్రచారం జరుగుతుంది. సిద్దయ్యతో సన్నిహిత్యం పెంచుకున్న సదరు యువకుడు తన యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ కావాలనే నెపంతో గురువారం సాయంకాలం అగ్రహారం సమీపంలోని గుట్టల వద్దకు పిలిపించి బండరాయి తో హత్య చేసినట్లు ప్రచారం జరుగుతుంది. హత్య చేసినట్లు జగిత్యాల పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. . సంఘటన స్థలాన్ని పరిశీలించిన వేములవాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యూట్యూబ్ ఇంటర్వ్యూ సిద్దన్న ప్రాణాలు తీసిందా..? అనే అంశం జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయ అంశం మారింది.

# కేంద్ర నిధులకోసమే పంచాయతీ ఎన్నికలు

- బీజేపీ అభ్యర్థులను గెలిపించండి.
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాస సత్యనారాయణ.



**కరీంనగర్, నవంబర్ 28 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకోసమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాస సత్యనారాయణ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోటీ చేస్తున్న ఆశావహుల తో బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా నగర్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... అసలు పంచాయతీ ఎన్నికలు ఎందుకోసం జరుగుతున్నాయి, ఏం ఆశించి అభ్యర్థులను గెలిపించాలనే విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. ఊరు అభివృద్ధి కావాలంటే కావాల్సిన నిధులు ఇచ్చే సత్తా ఉన్న పార్టీ ఏది? ఆ నిధులను తెచ్చే సత్తా ఉన్న నాయకుడెవరనే విషయం గమనించాలని అన్నారు. ప్రజల తరపున నిరంతరం పోరాడుతున్న పార్టీ ఏది? ఊరు సమస్యలపై నిరంతరం కొట్లాడుతున్న నాయకుడెవరని ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని అన్నారు. కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయని, గ్రామాల అభివృద్ధి కోసం నిధులిస్తున్నది కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రతి పనికి పైసలు ఇచ్చింది కేంద్రమేనని, ఇంట్లో పొయ్యి వెలిగించే ఉజ్వల గ్యాస్ కనెక్షన్, తినే రేషన్ బియ్యం నుండి బయటకు వెళితే రోడ్లు, వీధి లైట్లు సహా ఆ పనులన్నింటికీ నిదులిస్తున్నది కేంద్రమేనని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 100 రోజులు పని కల్పించి పైసలిస్తోంది కూడా మోదీ ప్రభుత్వమేనని అన్నారు. అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, కందకాల తవ్వకాలు, ఊరికి అవసరమైన అన్ని రకాల పనులకు కేంద్రం నుంచి వచ్చే ఉపాధి హామీ (నరేగా) నిధులే సహాయ పడుతున్నాయని పేర్కొన్నారు. ఎక్కడా లేని విధంగా బండి సంజయ్ ఎంపీ ల్యాడ్స్ నిధులతో కమ్యూనిటీ భవనాలు, సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు, బోర్లు, డ్రైనేజీల నిర్మాణానికి వినియోగిస్తున్నారని తెలిపారు. ఊరు బాగు కోసం వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను కలిసి సీఎస్సార్ నిధులను తీసుకొచ్చి మన పిల్లలు చదువుకునే ప్రభుత్వ స్కూళ్లలో, మనం వెళ్లే ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నారని తెలిపారు. టెన్త్ క్లాస్ విద్యార్థులకు 20 వేల బ్రాండెడ్ సైకిళ్లను అందించారని తెలిపారు. పదవ తరగతి చదివే విద్యార్థులకు, పరీక్ష ఫీజులను చెల్లించారని తెలిపారు. మోదీ గిఫ్ట్ పేరిట కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక టెక్నాలజీతో వైద్య పరికరాలు అందించారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా రూపాయి ఖర్చు చేసిందా అని ప్రశ్నించారు. ఊరిని బాగు చేయడానికి ఎమ్మెల్యేల కు సొంత నిధులు ఉన్నాయా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పైసలు రాక సర్పంచులు పడ్డ బాధలు, ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు మనం చూస్తున్నామని అందుకే బీజేపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి చాడ అనితా రెడ్డి, జిల్లా ఈసి మెంబర్ బూట్ల శ్రీనివాస్, బిజెవైఎం అధ్యక్షులు గద్దం అరుణ్, బుర్ర శ్రీనివాస్, రామిడి మహేందర్ రెడ్డి, బండి స్వామి, ఉప్పునూటి సాగర్, జంగ సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ టైని టాట్స్‌లో వండర్ వరల్డ్ ఫెస్ట్

## ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, నవంబర్ 28 (జనంసాక్షి) :** శుక్రవారం రోజున స్థానిక వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రీ ప్రైమరీ బ్లాకులో వండర్ వరల్డ్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి విచ్చేసి విద్యార్థులకు తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ ఫెస్టిను మూడు విభాగాలుగా వర్ణించడం జరిగిందని మొదటిది విఎన్ఆర్ ఎయిర్ లైన్స్, రెండవది ఆల్ ఫోర్స్ ఫైర్ లెస్ రెస్టారెంట్, మూడోది కమ్యూనిటీ హెల్పర్స్ ఈ విషయాలపై డా.వి నరేందర్ రెడ్డి చక్కటి వివరణ ఇచ్చారు. విద్యార్థులకు ఏర్పోర్ట్ అంటే, ఎయిర్ లైన్స్ అంటే ఏమిటో చక్కగా వివరించారు. విద్యార్థులకు జంక్ ఫుడ్ తినడం వలన వచ్చే వ్యాధుల గురించి తెలిపారు. జంక్ ఫుడ్ తినడం మానేయాలని, కమ్యూనిటీ హెల్పర్స్ గురించి అనగా డాక్టర్లు, రైతులు, టీచర్లు, సైనికులు ఇతరుల ప్రాముఖ్యతను వర్ణించారు. వారు తమ అమూల్యమైన సేవలతో సమాజానికి ఎంతో తోడ్పడుతున్నారని, విద్యార్థులు చాలా చక్కగా తమ విభాగాలలో నైపుణ ప్రదర్శించారని వారిలో ఉన్న సృజనాత్మకతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

**రౌడీ షీటర్లు బైండోవర్ : ఎస్ఐ ఆవుల తిరుపతి**

**వీణవంక నవంబర్ 28 (జనంసాక్షి) :** వీణవంక స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా వీణవంక మండలంలోని సుమారు 30 మంది రౌడీషీటర్స్, బెల్ట్ షాప్ యజమాలను బైండోవర్ చేసినట్లు స్థానిక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆవుల తిరు పతి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని, పోలింగ్ రోజున ఓటర్లు నిస్సంకోచంగా వచ్చి తమ ఓటు హక్కును ఎవరైనా ఓటర్లను బెదిరించినా, ప్రలోభాలకు గురి చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆవుల తిరుపతి హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా మద్యం అమ్మిన కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కల సాకారం
- 'ఖని'లో కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ శ్రేణుల సంబరాలు



**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ మైనార్టీ సెల్ చైర్మన్ ఆసిఫ్ పాషా ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ క్యాబినెట్ సమావేశంలో రామగుండం 1×800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కొత్త విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీనితో రెండు సంవత్సరాలుగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కల సాకారమైంది.తద్వారా పారిశ్రామిక ప్రాంతంలో అర్హత కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు కలిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు.టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రామగుండంలోని బి-పవర్‌హౌస్‌లో 1×800 మెగావాట్ల కొత్త విద్యుత్ ప్లాంటు ఏర్పాటు కోసం ఎమ్మెల్యే చేసిన ప్రయత్నం సాకారమైందని అన్నారు. రామగుండంకు భవిష్యత్తులో మహార్దశ ఉందని పేర్కొన్నారు. ఇటీవల 900 కోట్లతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే సారథ్యంలో అన్ని విధాల అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు.కొత్త విద్యుత్ ప్లాంటు పూర్తి అయితే స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ చేతగాని తనంతో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క,మంత్రులతో పాటు స్థానిక మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాజీ కార్పొరేటర్, ముస్తాఫా, నజ్ముద్దీన్, అబిద్, ఫజల్ బేగ్, ఎండి.గౌస్, గఫూర్, యాకూబ్, ముస్తాక్, ముబీన్, సన్నీ మోయిజ్, సిరాజుద్దీన్, తాజుద్దీన్, హాఫీజుద్దీన్, సర్వర్, ఆరిఫ్, షఫీ, నయీం, మొహిద్, ఎస్డి కలీం, అధిక సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు కృతజ్ఞతలు

### మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్

రామగుండం పట్టణంలో 800 మెగావాట్ల నూతన విద్యుత్ కేంద్రం నిర్మాణం కోసం అశేష కృషి చేసి పవర్ ప్లాంటు సాధించి.మంత్రి వర్గం ఆమోదం తెలపటం పట్ల తాజా మాజీ కార్పొరేటర్.బీ థర్మల్ విద్యుత్ కేంద్ర విస్తరణ అఖిల పక్ష పోరాట సమితి కన్వీనర్ కన్నరి సతీష్ కుమార్. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మఖాన్ సింగ్ కు.ఇందుకు సంహరించిన ముక్యమంత్రి రేవంత్ రెడ్డి. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క. మంత్రి శ్రీధర్ బాబు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.ఇక్కడ విద్యుత్ కేంద్రం ఏర్పాటు స్థానిక ప్రజల దశాబ్దల కల అని. అనేక మంది నాయకులు రాజకీయంగా వాడుకున్నారు కానీ. చిత్త శుద్ధితో కృషి చేయలేదని. దశబ్దాల కల నెరవేర్చిన ఘనత ఎమ్మెల్యే మఖాన్ సింగ్ దేనని అన్నారు. గతంలో ప్లాంటు స్థాపన కోసం పోరాటం చేసిన అఖిల పక్ష పోరాట సమితి కార్యావర్గానికి. సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నన్నారు

# మెడికల్ బోర్డు రెగ్యులర్‌గా నిర్వహించాలి



- రెండు సంవత్సరాల కాలపరిమితి వున్న కార్మికులు వెయ్యి మంది ఉన్నారు
- వీరందరికి ఎప్పుడు మెడికల్ బోర్డు పెడుతారు
- గెలిచిన సంఘాలు ఏం చేస్తున్నాయి : టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి

**గోదావరిఖని, నవంబర్ 28 (జనంసాక్షి):** మెడికల్ బోర్డు రెగ్యులర్‌గా నిర్వహించాలని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అన్నారు.గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రెండు సంవత్సరాల కాలపరిమితి వున్న కార్మికులు వెయ్యి మంది ఉన్నారన్నారు.వీరందరికి ఎప్పుడు మెడికల్ బోర్డు పెడుతారని ఆయన పేర్కొన్నారు.గెలిచిన సంఘాలు ఏం చేస్తున్నాయన్నారు. గతంలో 55 మందితో ఒక మెడికల్ బోర్డు పెట్టి ఐదుగురిని మాత్రమే మెడికల్ ఇన్వాలిడేషన్ చేశారన్నారు.అనంతరం 129 మందితో మరో మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారన్నారు.అందులో ఐదుగురిని మాత్రమే మెడికల్ ఇన్వాలిడేషన్ చేశారన్నారు.ఈ 121 మంది అడ్వయిజరీ మెడికల్ బోర్డుకు రాశారన్నారు.మిగతా నలుగురిని అధికారులు మెడికల్ బోర్డుకు రెఫర్ చేశారన్నారు.వీరందరు గత సంవత్సరంన్నర నుంచి ఖాళీగా ఉన్నారని రాజిరెడ్డి పేర్కొన్నారు. ఆర్థికంగా నష్టపోయారన్నారు.13 మంది ఫిట్ ఫర్ సేమ్ జాబ్‌కు, 25 మంది మెడికల్ ఇన్వాలిడేషన్ అయ్యారన్నారు.ఎఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ అండర్‌గ్రౌండ్‌లో విధులు నిర్వహించలేని వారికి సర్ఫేస్ జాబ్ ఇప్పించామని చెప్పుకుంటున్నారని తెలిపారు.ఓవర్‌మ్యాన్,సర్దార్‌కు సర్ఫేస్‌లో ఉద్యోగం ఇప్పించారని పేర్కొన్నారు.36 మంది కార్మికులు జనరల్ మజ్దూర్ చేస్తున్నారని, తిరిగి వారికే ఉద్యోగాలు ఇప్పించామంటూ గెలిచిన సంఘాలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.కొంత మంది కార్మికులకు కేవలం 16 నెలలు మాత్రమే ఉందని, వారిని ఎట్లా మెడికల్‌కు తీసుకుంటారని రాజిరెడ్డి నిలదీశారు.

ఇప్పటికైనా గెలిచిన కార్మిక సంఘాలు ఇతర కార్మిక సంఘాలను కలుపుకుని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన అవసరముందని రాజిరెడ్డి పేర్కొన్నారు.ఇకపోతే మైనింగ్ స్టాఫ్‌కు సింగరేణిలో తీవ్ర అన్యాయం జరుగుతుందని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి అన్నారు.మైనింగ్ స్టాఫ్‌కు జనరల్ మజ్దూర్ ఇవ్వడం ఆక్షేపణీయమన్నారు.సూపర్‌వైజరీ స్టాఫ్‌లేక గనుల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.అండర్ గ్రౌండ్ గనుల్లో విధులు నిర్వహించే కార్మికులకు 150 మస్టర్లు, సర్ఫేస్‌లో విధులు నిర్వహించే కార్మికులకు 200 మస్టర్లు పెట్టడం అత్యంత హేయమైన చర్యగా రామమూర్తి అభివర్ణించారు.ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శి కె.సురేందర్‌రెడ్డి,టీబీజీకేఎస్ నాయకులు వడ్డెపల్లి శంకర్, పర్లపల్లి రవి, నూనె కొమురయ్య, చెల్పూరి సతీష్,చెలకలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్‌రావు సవాల్‌కు సీఎం సమాధానం చెప్పాలి

- హరీష్‌రావు మాటాలను వక్రీకరిస్తే సహించం
- రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్



**గోదావరిఖని, జనంసాక్షి :** మాజీ మంత్రి హరీష్‌రావు సవాల్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి..స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సమాదానం చెప్పాలి..కానీ, స్థాయిని మించి మాజీ మంత్రి హరిష్‌రావుపై పరుషపదజాలంతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడి హరీష్‌రావు దిష్టిబోమ్మను దహనం చేయాడాన్ని రామగుండం మాజీ శాసనసభ్యులు,పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ ఖండించారు.గురువారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హరీష్‌రావును దూషించి దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై గోదావరిఖని 1వ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండానికి 800 మెగావాట్ల ధర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు 10వేల 880 కోట్ల రూపాయలతో క్యాబినెట్‌లో ఆమోదం లభించడం విధితమేనని, ఎన్టీపీసీ 7 రూపాయలు ఒక యూనిట్ చోప్పున ప్లాంట్ నిర్మిస్తామంటే బయట మాకు 5 రూపాయలకే దొరుకుతుందని ప్లాంట్ నిర్మాణానికి 6 ఏళ్ల సమయం పడుతుందని అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం జరిగిందని అన్నారు.ఈ 10 వేల 880 కోట్ల రూపాయలతో ప్లాంటు నిర్మాణం అంటే ఒక్క యూనిట్ 8 రూపాయలు పడే అవకాశం ఉందని, ఈ విషయంపై మాట్లాడిన మాజీ మంత్రి హరిష్‌రావు దిష్టిబొమ్మను స్దానిక కాంగ్రెస్ నాయకులు దహనం చేయడం సరైంది కాదన్నారు.హరిష్‌రావు దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై కేసు నమోదు చేసి తగినచర్యలు తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణ వేణీ, బాదే అంజలి, గాధం విజయ, నాయకులు అచ్చె వేణు, మేతుకు దేవరాజ్, నూతి తిరుపతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి,జక్కుల తిరుపతి, మేడి సదానందం, ముద్దసాని సంధ్యా రెడ్డి, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్, బుర్ర శంకర్, బుర్రి వెంకటేష్, నీరటీ శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావణ్, చింటూ, బాలరాజు, పద్మ, రామరాజు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు పటిష్ట చర్యలు

- ప్రతి కళాశాల నుంచి 50 మంది అభ్యర్థులు జాబ్ మేళా కు హాజరు కావాలి
- జిల్లా స్థాయి జాబ్ మేళా నిర్వహణపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, నవంబర్ 28 (జనంసాక్షి) :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లా స్థాయి జాబ్ మేళా నిర్వహణ పై వివిధ కళాశాలల యాజమాన్యులు,సంబంధిత అధికారుల తో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ రీజనల్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జాబ్ మేళా (ప్లేస్ మెంట్ డ్రైవ్) నిర్వహించాలని నిర్ణయించామని అన్నారు.జాబ్ మేళా కార్యక్రమానికి వివిధ కంపెనీలు హాజర వుతా యని, షెడ్యూల్ ఖరారు కాగానే కళాశాలలకు సమాచారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. టాస్క్ రీజినల్ సెంటర్ ద్వారా వివిధ కోర్సులలో యువతకు ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, వీటి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. టాస్క్ అందించే వివిధ కోర్సుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మంథని లో మరో టాస్క్ రీజినల్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కంపెనీలు మన జిల్లాకు ఉపాధి కల్పించేందుకు వస్తాయని, దానికి అనుగుణంగా మన విద్యార్థులను తన అర్థం చేసుకొని వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఉన్న వివిధ ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలో ఉన్న ట్రైనింగ్, ప్లేస్ మెంట్ సెల్ విభాగం సిబ్బంది జాబ్ మేళా విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా లోని ప్రతి కళాశాల నుంచి డిగ్రీ పట్టా తీసుకున్న పూర్వపు విద్యార్థులు , ఫైనల్ ఇయర్ చదువుతున్న కనీసం 50 మంది జాబ్ మేళా కు హాజరు కావాలని, ప్రతి కళాశాల నుంచి ఒక కో ఆర్డినేటర్ ను నియమించాలని కలెక్టర్ తెలిపారు. గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగం పొందేందుకు కొంతమంది అభ్యర్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు రుసుమును సైతం జిల్లా యంత్రాంగం చెల్లించిందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడటం చాలా ముఖ్యమని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు కళాశాలలు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో టాస్క్ సెంటర్ ఇంచార్జి కౌసల్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా లోకాన్ని అక్షరాస్యత వైపు నడిపించిన మహాత్ముడు పూలే

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- కుల వివక్షను రూపుమాపిన సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే
- జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్
- పూలే ఆశయాలను కొనసాగించడం కాంగ్రెస్ తోనే సాధ్యం
- కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్




**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జనంసాక్షి):** మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం రోజు జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని శాతవాహన యూనివర్సిటీ, మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మొదట డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం నగరంలోని శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ హాజరై జ్యోతిభా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యులు అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ... కుల వివక్ష , నిరక్షరాస్యత, సతీసహగమనం పై ప్రజలను జాగృతం చేసిన జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకొని ఘన నివాళులు అర్పించడం జరిగింది.18వ శతాబ్దంలో ఈ దేశ రూప్ రేఖలను మార్చిన మహనీయుడు, విద్య నేర్చుకోవడం ద్వారానే సమాజంలో కుల వివక్షను నిర్మూలించగలం అని నమ్మి తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి ఎన్నో సమస్యలను ఎదుర్కొని దేశవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమం ద్వారా మహిళ లోకాన్ని అక్షరాస్యత వైపు నడిపించిన మహనీయుడు పూలే, అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కి గురువుగా, అగ్రకులాల చేత అణిచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, సంఘసంస్కర్తగా తత్వవేత్తగా వారు చేసిన సేవలు మరువలేనివి, 1874 ఫిబ్రవరి 12 న శివాజీ సమాధిని వెలికి తీసి ఆయన జయంతి ఉత్సవాలను జరిపిన గొప్ప నాయకుడు జ్యోతిబాపూలే. కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఆయన చూపిన మార్గాన్ని అన్వేషిస్తూ వారి ఆలోచన విధానాలను ఆశయాలను కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు ఎండి తాజ్, శ్రావణ్ నాయక్ బానోతు, మడుపు మోహన్, పత్తి మధు, కర్ర రాజశేఖర్, కల్వల రామ్ చందర్, వెన్నం రజిత రెడ్డి, అహమ్మద్ అలీ, కుర్ర పోచయ్య, వంగల విద్యాసాగర్, తోట అంజయ్య, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, పెద్ది గారి తిరుపతి,రోళ్ళ సతీష్, గంగుల దిలీప్, ఇమ్రాన్, నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి యస్‌జిఎఫ్ రగ్బీ పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థి

## పారమిత పాఠశాలల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు

**కరీంనగర్, నవంబర్ 28 (జనంసాక్షి) :** ఈ నెల 29 నుండి 1వ తేదీ వరకు తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆద్వర్యంలో డోర్నకల్ మహబూబాద్ జిల్లా లో జరగనున్న 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 17(బాల బాలికల) రగ్బీ ఛాంపియన్ షిప్ పోటీలకు స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జనగామ నీరవ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. అదేవిధంగా ఇటీవల స్థానిక అంబేద్కర్ స్టేడియంలో జరిగిన అండర్ 17(బాల బాలికల) ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో జె. నీరవ్ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి ని పాఠశాల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, కె.హన్మంతరావు, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయ కర్తలు నాగరాజు, రాము, వ్యాయామ ఉపాధ్యాయుడు సాజన్, రాజు తదితరులు పాల్గొన్నారు.




- ఒక వైద్యుడితో జాతీయ, రాష్ట్ర ప్రజారోగ్యం పర్యవేక్షణతో అదనపు భారం
- పీజీ వైద్యులను ఏడాది పాటు నియమించేందుకు వైద్యశాఖ చర్యలు
- పక్షం రోజుల్లో యూపీహెచ్‌సీల్లో నియామకానికి సర్కారు కసరత్తు
- నగర శివారు మేడ్చల్ జిల్లాల్లో 28 యూపీహెచ్‌సీలు

# పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సేవలు

## బోధనా ఆసుపత్రులలాగా.. యూపీహెచ్‌సీల్లో సీనియర్ రెసిడెంట్‌లు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబర్ 28 (జనం సాక్షి) :** పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీ) వైద్యులుక అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ఒక్కో వైద్యుడు మాత్రమే ఉండటం తానే జాతీయ, రాష్ట్ర ప్రజారోగ్య కార్యక్రమాల పర్యవేక్షణ, చికిత్సలు అందిస్తుండటంతో ఒత్తిడి, పని భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బోధనాసుపత్రుల్లో మాదిరి యూపీహెచ్‌సీల్లోనూ పీజీ పూర్తిచేసిన వైద్యులను ఏడాది పాటు ఎస్ఆర్(సీనియర్ రెసిడెంట్) లుగా నియమించ డానికి వైద్యారోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. తద్వారా ప్రతి యూపీహెచ్‌సీలో ఇద్దరు, ముగ్గురు స్పెషాలిటీ వైద్యులు నియమితు లయ్యే అవకాశాలున్నాయి. పక్షం రోజుల్లో నియామకాలు జరగనున్నట్లు వైద్యారోగ్య శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.



### మేడ్చల్ జిల్లాలో 28 యూపీహెచ్‌సీలు

నగర శివారుల్లోని మేడ్చల్-మల్కాజిగిరిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ)లో ప్రతి రోజు 80 నుంచి 100 మందికి పైగా అవుట్ పేషెంట్లు వస్తున్నారు. జిల్లాలోని యూపీహెచ్‌సీల్లో డాక్టర్లు ప్రతీ రోజు వందకు పైగా బయటి రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 28 యూపీ హెచ్‌సీలు ఉన్నాయి. శివారుల్లోని నిర్మాణ రంగం వేగవంతం కావటంతోపాటు వివిధ పరిశ్రమలు ,ఇటుక బట్టీలు తదితరాలు అధికంగా ఉండటంతో ...యూపీహెచ్‌సీల్లో బయటి రోగుల సంఖ్య పెరుగుతోంది. యూపీహెచ్‌సీల్లో ప్రస్తుతం వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు జాతీయ కార్యక్రమాలు, క్షయ నియంత్రణ, పిల్లల కు టీకాలు, గర్భిణులకు పరీక్షలు, టీకాల కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ నే.. బాధితులకు చికిత్సలు అందించటం చేస్తున్నారు. దీంతో ఉన్న ఒక వైద్యుడిపై అదనపు భారం పడుతోంది. పైగా యూపీహెచ్‌సీల్లో ప్రాథమిక స్థాయి వైద్యం, ప్రసవాలు, కొన్నిచోట్ల రోగనిర్ధాణ పరీక్షలకు పరిమితం గానే వసతులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక చికిత్సల కోసం వచ్చే రోగులను పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

### సీనియర్ రెసిడెంట్లను నియమిస్తే..

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ తీసుకున్న నిర్ణయం మేరకు పీజీ/ఎంఎస్ పూర్తి చేసిన వైద్యులను ఎస్ఆర్ (సీనియర్ రెసిడెంట్లు) వైద్యులుగా యూపీహెచ్‌సీల్లో నియమించి నట్లయితే.. చేస్తే రోగుల వెతలు తీరి మెరుగైన వైద్య సేవలు అందే అవకాశాలు న్నాయి. ఒక్కో యూపీహెచ్సీకి ఇద్దరు/ముగ్గురు నియమితులయ్యే అవకాశం ఉంటోంది. ఈ నేపథ్యంలో యూపీహెచ్‌సీల్లో పీడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ సేవలు అందెందుకు అవకాశముంటోంది.. ఈ విషయమై జిల్లా వైద్యారోగ్య శాఖ వర్గాలు మాత్రం పట్టణ పీహెచ్‌సీల్లో ఎస్ఆర్‌లను నియామకం చేయడం వల్ల వైద్యుల కొరత తీరుతుందని పేర్కొంటున్నాయి. రోగులకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందుతుందగలదంటున్నారు.

# నిర్భయంగా ఓటు వేయండి

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలు
- మూడు దశల్లో 608 పోలింగ్ కేంద్రాలకు బందోబస్తు
- చెక్‌పోస్టుల్లో 24 గంటల నిఘా... మద్యం, డబ్బు రవాణాకు అడ్డుకట్ట
- నిర్లక్ష్యంపై కఠిన చర్యలు... రౌడీలు, ఆయుధాలపై కంటి




**పరిగి, నవంబర్ 28 (జనంసాక్షి):** జిల్లాలో రాబోయే ఎన్నికలు నిర్భయంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆదేశించారు. బుధవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె, మూడు దశల్లో జరగబోయే ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 608 పోలింగ్ లొకేషన్లలో ఎన్నికలు జరుగనున్నాయని, అందులో మొదటి దశలో తాండూర్ సబ్ డివిజన్, కోడంగల్ సర్కిల్‌లో 273, రెండో దశలో వికారాబాద్ సబ్ డివిజన్‌లో 185, మూడో దశలో పరిగి సర్కిల్‌లో 150 లొకేషన్లు ఉన్నట్టు ఎస్పీ వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై తక్షణమే కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, నగదు రవాణా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లోని 7 అంతర్‌రాష్ట్ర, 8 అంతర్‌జిల్లా చెక్‌పోస్టుల్లో 24 గంటలూ క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మొబైల్ పార్టీలు, క్యూఆర్‌టీ, ఎస్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం అలర్ట్‌గా ఉండాలని సూచించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి అక్కడ అదనపు బలగాలు మోహరించాలని, పాత రౌడీలు, నేరస్తులు, ఎన్నికల అనుమానితులను బైండోవర్ చేయాలని, గన్ లైసెన్స్ దారుల నుంచి ఆయుధాలను వెంటనే డిపాజిట్ చేయించుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీసు అధికారి తమ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి భద్రతా లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ఒక్కరైనా చూపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. పోలింగ్ సిబ్బంది, ఇతర శాఖలతో నిరంతర సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించడమే పోలీసు శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బీ.రాములు నాయక్, డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్.యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ తదితర అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### రైతు ప్రయోజనాలు, రాష్ట్రాల అధికారాల రక్షణకు

# విత్తన బిల్లులో తప్పనిసరిగా సవరణలు అవసరం

- రైతుల ప్రయోజనాల దృష్ట్యా సవరణలు అవసరం - వ్యవసాయ మంత్రి తుమ్మల
- పది లక్షల తెలంగాణ రైతులు తమ సూచనలు పంపాలి - ఉప కులపతి అల్దాస్ జానయ్య

**రాజేంద్రనగర్, నవంబర్ 28 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖలు కలిసి కేంద్ర ముసాయిదా విత్తన బిల్లు-2025పై రాష్ట్ర స్థాయి సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ చట్టం ద్వారా రాష్ట్రాల అధికారాలు తగ్గే ప్రమాదం ఉందని, రైతులు నష్టపోయే పరిస్థితుల్లో నష్టపరిహారం వంటి కీలక నిబంధనలు లేకపోవడం ఆందోళనకరమని మంత్రి తెలిపారు. రైతుల రక్షణ, సంస్థల మోసాలను అరికట్టేందుకు చట్టంలో తప్పనిసరిగా సవరణలు చేయాలని ఆయన సూచించారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కేంద్రానికి అధికారికంగా సూచనలు పంపనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉప కులపతి అల్దాస్ జానయ్య మాట్లాడుతూదేశంలో 90% విత్తనాలు ప్రైవేటు రంగంలో ఉన్న ఈ పరిస్థితుల్లో రైతుల ప్రయోజనాల రక్షణ కోసం చట్టంలో తప్పనిసరిగా మార్పులు అవసరమని తెలిపారు. తెలంగాణకు చెందిన పది లక్షల మంది రైతులు తమ అభిప్రాయాలు కేంద్రానికి పంపాలని సూచించారు. ఎనిమిది కీలక సవరణలను విశ్వవిద్యాలయం ప్రతిపాదించినట్లు తెలిపారు. రైతు సంఘాల నాయకులు, నిపుణులు మాట్లాడుతూరైతులకు నష్టపరిహారం స్పష్టంగా ఉండేలా, శిక్షలు కఠినంగా ఉండేలా చట్టం ఉండాలని కోరారు. రాష్ట్రం ప్రత్యేకంగా కూడా ఒక చట్టాన్ని తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 2026 ఫిబ్రవరి 11-12 తేదీల్లో 10 వేల మందితో నిర్వహించనున్న మెగా రైతు మేళా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, సీడ్స్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, వడ్డే శోభనాద్రీశ్వరరావు, శాస్త్రవేత్తలు, రైతు నేతలు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,నవంబర్ 28(జనంసాక్షి) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో రోడ్ల పై పశువులు వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, పశుసంవర్ధక శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేసి రోడ్ల పై నుంచి పశువులను తొలగించాలని, గోశాలల నుంచి యాజమాన్యులకు పశువులు అప్పగించే సమయంలో మరొకసారి రోడ్డు పైకి రాకుండా పక్కా సూచనలు జారీ చేయాలని అన్నారు. పట్టణాలలో ముఖ్యమైన జంక్షన్ ల అభివృద్ధి పనులు ప్రారంభించాలని అన్నారు. సుల్తానాబాద్ లో రొడ్డు క్రాస్ అధికంగా జరుగుతుందని, దీనిని నివారించేందుకు డివైడర్ నిర్మాణం చేపట్టాలని అన్నారు. రోడ్ల వద్ద వాహనాల వేగం నియంత్రణ కోసం బ్లాక్ స్పాట్స్ వద్ద రేడియం స్టిక్కర్లతో బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. పట్టణాలలో రోడ్లపై అవసరమైన చోట రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలోని అంతర్గత రోడ్ల పై ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని , హెల్మెట్ వాడక పోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ధర్మారం రోడ్డు పై ఉన్న మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. ఆటోలను మైనర్ లు నడుపుతున్నట్లు సమాచారం అందుతుందని , దీనిని రెగ్యులర్ గా ట్రాక్ చేయాలని కలెక్టర్ ట్రాఫిక్ అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య ఖర్చులు నిమిత్తం కలెక్టరేట్ వద్ద ప్రత్యేక ఖాతా ప్రారంభించే ప్రతి చేపట్టామని అన్నారు. మల్లెపల్లి నుంచి గుంజపడుగు, ఆరెంద -నాగపల్లి రోడ్డు , ఇతర రోడ్డు మరమ్మతు పనుల ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతన రోడ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలను ప్రాధాన్యత క్రమంలో షిఫ్టింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సిఐలు అనిల్ కుమార్, రాజేశ్వరరావు ప్రవీణ్ కుమార్, రాజు, సుబ్బారెడ్డి,,ఆర్ అండ్ బి ఈ,ఈ బావ్ సింగ్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్ గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం,, మనోహర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్పిటల్‌లను తనిఖీ నిర్వహించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వి .వాణిశ్రీ

**పెద్దపల్లి, నవంబర్ 28 (జనంసాక్షి) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి వాణిశ్రీ శుక్రవారం పెద్దపల్లి పట్టణంలో రీనివల్ మరియు రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ ఆసుపత్రులను సాయి వంశీ హాస్పిటల్, ప్రణీత్ పిల్లల హాస్పిటల్ మరియు శ్రీ రాజ రాజేశ్వరి డయాగ్నొస్టిక్‌లను తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రికార్డ్స్, రిపోర్ట్స్, కేసు చీట్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్ మెంట్ రూల్స్ ప్రకారం నిర్వహించాలి అని అన్నారు. రిజిస్ట్రేషన్ లో నమోదు అయిన ప్రకారం బెడ్ స్ట్రెంత్ ఉండాలి అని, లేనిచో బయో మెడికల్ వేస్టేజ్ ఎక్కువ వస్తుంది, సరి పోయే స్టాఫ్ ఉండదు మరియు నిబంధనలకు విరుద్ధము, అట్టి వాటి పైన చర్యలు తీసుకుంటాం అని అన్నారు. సిబ్బందికి కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఇవ్వాలని సూచించారు. టారిఫ్ బోర్డు లోని ధరల ప్రకారం ఫీజు తీసుకోవాలి అని అన్నారు. రెన్యువల్ తేది కి 3 నెలల ముందే దరఖాస్తు సమర్పించాలి అని అన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఏ ఆరోగ్య ఫెసిలిటీస్ నడుపకూడదు అని అన్నారు. రిజిస్ట్రేషన్ లేని వాటికి పెనాల్టీ విధించ బడును అని అన్నారు.



### సైబర్ మోసాలపై బ్యాంకులు యుద్ధప్రాతిపదికన..

# పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

- మ్యూల్ అకౌంట్ల గుర్తింపు... అనుమాన లావాదేవీలపై తక్షణ ఫ్లాగ్ : సీపీ అవినాష్ మహంతి
- ప్రతి బ్యాంకులో సైబర్ రెస్పాండ్ డెస్క్... 3 రోజుల్లోపు ఫ్రీజ్-డీఫ్రీజ్ పరిష్కారం
- బ్యాంకులు-పోలీసుల సమన్వయంతోనే దర్యాప్తు వేగం

**శేరిలింగంపల్లి, నవంబర్ 28 (జనంసాక్షి):** సైబర్ నేరాలు దేశ ఆర్థిక వ్యవస్థకు పెను ముప్పుగా మారుతున్న నేపథ్యంలో బ్యాంకులు అత్యంత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, సామాన్యుని కష్టార్జితాన్ని కాపాడుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్ ఆదేశించారు. శుక్రవారం కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకుల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లు, ఆన్‌లైన్ స్కాములు, ప్రీ-లాంచ్ స్కీముల పేరుతో అమాయక ప్రజలు కోట్లాది రూపాయలు కోల్పోతున్నారని, సాంప్రదాయ మోసాల కంటే సైబర్ మోసాల్లోనే నష్టం ఎక్కువగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులు-పోలీసుల మధ్య సమాచార మార్పిడి, సైబర్ కేసుల ఛేదనలో వేగం పెంచడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని సీపీ స్పష్టం చేశారు. అకౌంట్ ఫ్రీజ్ స్థితి నిర్ధారణ, డీఫ్రీజ్ అభ్యర్థనల్లో ఆలస్యం దర్యాప్తుకు అడ్డంకిగా మారుతోందని, స్టేట్‌మెంట్లు, కేవైసీ వివరాలు సత్వరం అందించాలని బ్యాంకులను ఆదేశించారు. ఖాతా ఫ్రీజ్ అయిన తర్వాత ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా చూడాలని, అనుమానాస్పద లావాదేవీలను వెంటనే ఫ్లాగ్ చేయాలని, మ్యూల్ అకౌంట్లను గుర్తించడంలో కఠిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రతి బ్యాంకులో ప్రత్యేక సైబర్ క్రైమ్ రెస్పాండ్ డెస్క్ ఏర్పాటు చేయాలని, నోడల్ ఆఫీసర్లు, బ్యాకప్ సిబ్బంది వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఫ్రీజ్/డీఫ్రీజ్ అభ్యర్థనలు, స్టేట్‌మెంట్లు, కేవైసీ వివరాలను మూడు రోజుల లోపే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఫ్రీజ్ అయిన అకౌంట్ స్టేట్‌మెంట్లు ఎక్సెల్ ఫార్మాట్‌లో పూర్తి వివరాలతో పంపాలని ఆదేశించారు. బ్యాంకు సిబ్బందికి సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయంగా పనిచేసేలా శిక్షణ ఇవ్వాలని, బ్యాంకులు-పోలీసుల సమన్వయంతోనే దర్యాప్తు వేగవంతమవుతుందని సీపీ ఒత్తిడి చేశారు. ప్రజలు తమ ఖాతాలను నిరంతరం పర్యవేక్షించుకోవాలని, ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే బ్యాంకు అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మేడ్చల్ డీసీపీ ఎన్.కోటి రెడ్డి, మాదాపూర్ డీసీపీ రితిరాజ్, రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతమ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ఎ.ముత్యం రెడ్డి, మాదాపూర్ ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, ఏడీసీపీలు, ఏసీపీలు, వివిధ బ్యాంకుల అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్ మామిడి గ్రామంలో మా శారద హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

**వికారాబాద్ నవంబర్ 28, (జనంసాక్షి):** మా శారద హాస్పిటల్ ఎన్నెపల్లి వికారాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు శుక్రవారం నాడు ఎక్ మామిడి గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉదయం 8:30 నుండి 12:30 మధ్యాహ్నం వరకు గ్రామస్తుల కు వైద్య సేవలు అందించారు, ఈ క్యాంపులో వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తూ.. బీపీ, షుగర్, మోకాళ్ళ నొప్పులు, గైనకాలజీ ఓపీ, కడుపునొప్పి, తలనొప్పి, గొంతు నొప్పి, జలుబు, దగ్గు, ఇతర సమస్యలకు ఉచితంగా డాక్టర్లు పరీక్షలు చేసి మందులు, ఇచ్చారు, మా శారద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏక్ మామిడి గ్రామంలో వైద్య సేవలు అందించినందుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామస్తులకు సేవలు చేయడానికి 24 గంటలు ముందుంటామన్నారు.

### గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

# సజావుగా జరిగేలా అధికారులు పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**యాలాల్ నవంబర్ 27 (జనంసాక్షి) :** శుక్రవారం యాలాల్ మండలంలోని కోకట్ క్లస్టర్ లో కోకట్, బషీర్ మియా తాండాకు సంబంధించిన గ్రామపంచాయతీల నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ ప్రంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావలసిన ధృవ పత్రాలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలని ఆయన తెలిపారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిలో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకునే విధంగా అభ్యర్థులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలో పోటీ చేసే అభ్యర్థల వ్యయాలకు సంబంధించి బ్యాంకు ఖాతాలు ఉండాలని ఆయన సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లు నిబంధనలకు అనుగుణంగానే ఖర్చులు పెట్టాలనే విషయము అభ్యర్థులకు స్పష్టంగా తెలియ జేయాలని ఆయన అధికారులకు సూచించారు. నామినషన్ల కేంద్రాల పరిశీలనలో ఎంపిడిఓ శ్రీనిజ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



# శేరిలింగంపల్లిలో 79.58 కోట్ల నిధులతో నాలాల విస్తరణ పనులు

- వరద ముంపునుండి నియోజకవర్గాన్ని పరిరక్షించడమే ప్రథమ కర్తవ్యం : పిఏసి చైర్మన్ అరికెపూడి

**శేరిలింగంపల్లి, నవంబర్ 28 (జనంసాక్షి) :** గ్రేటర్ కే తలమానికంగా మారిన శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి ముందుకు సాగనున్నామని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు కొండాపూర్ డివిజన్ పరిధి గఫూర్ నగర్ కాలనీలో గఫూర్ నగర్ జంక్షన్ నుండి దుర్గం చెరువు వరకు 11.55 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న నాలా విస్తరణ పనులలో భాగంగా నిర్మిస్తున్న ఆర్‌సిసి బాక్స్ డ్రైవ్ నిర్మాణం పనులను శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతితో కలిసి శుక్రవారం అయిన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపూర్ డివిజన్ పరిధి గఫూర్ నగర్ కాలనీ జంక్షన్ నుండి దుర్గం చెరువు వరకు 11.55 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనా వ్యయంతో చేపడుతున్న నాలా విస్తరణ పనులకు పరిసర ప్రాంతాల ప్రజల సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎన్డిపి ఫేస్ - 2లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో 79.58 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నాలా విస్తరణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం శుభ పరిణామం అన్నారు. సుదీర్ఘకాలంగా నెలకొన్న ఈ సమస్యకు నేటితో శాశ్వత పరిష్కారం లభించనుంది అన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పరిధిలో వర్షపునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేలా భారీ నిధులతో చేపట్టనున్న నాలా విస్తరణ పనులతో విప్లవాత్మక అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. చిన్నపాటి వర్షానికి వరద నీరు శేరిలింగంపల్లి పరిధిలోని అనేక కాలనీలను ముంచెత్తడం జరుగుతుందని, తద్వారా ఎంతోమంది నిరుపేదలు, అభాగ్యులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నందున సదరు సమస్యలకు శాశ్వత ముగింపు పలకాలన్న గొప్ప సంకల్పంతో నాలా విస్తరణ పనులను చేపడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఆర్సిసి బాక్స్ డ్రైన్ నిర్మాణాన్ని నెలకొల్పుతుండడంవల్ల వర్షపునీటి పారుదలకు చక్కటి అవకాశం లభించినట్టు అయిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేయించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని అగ్రగామిగా అభివృద్ధి పరచడానికి నిర్దిష్టమైన కార్యాచరణను రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. అడిగిన వెంటనే శేరిలింగంపల్లి అభివృద్ధికి భారీగా నిధులను కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శేరిలింగంపల్లి ప్రజల పక్షాన ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శేరిలింగంపల్లిలో వరద నీరు నిలవకుండా వర్షం నీటిని నియంత్రించే పనులకు కోట్ల అంచనా వ్యయంతో పనులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్డిపి అధికారులు ధీరజ్, నాయకులు గణేష్ ముదిరాజ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కెవి రావు హరికృష్ణ, కార్యకర్తలు, స్థానిక కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి

- సర్పంచి ఎన్నికలలో జనరల్ స్థానాలలో బీసీలు పోటీ చేయాలి
- బహుజన సంఘ నేతలు

**పరిగి నవంబర్ 28 జనం సాక్షి :** మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర హనుమంతు ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ, పరిగి నియోజకవర్గ బీసీ జేఏసీ చైర్మన్ సదానందం, ప్రధాన కార్యదర్శిలు వెంకట్ రాములు, యాదయ్య యాదవ్ లు మాట్లాడుతూ ప్రస్తుత సర్పంచ్ ఎన్నికలలో జనరల్ స్థానాలలో బీసీలు తప్పకుండా పోటీ చేయాలని, రాజ్యాంగం రచించి 75 సంవత్సరాలు అవుతున్నప్పటికీ బహుజన కోటాను అగ్రవర్ణాలే పొందుతు మనకు అన్యాయం గురిచేస్తున్నారని అందువల్ల తప్పకుండా జర్నల్ స్థానము అంటే కాదు కాబట్టి ఈ జర్నల్ స్థానాలలో అత్యధికంగా బీసీలు పోటీ చేసి తప్పకుండా సర్పంచులుగా గెలవాలని అందుకు పూర్తిగా మేము మద్దతిస్తామని సహకరిస్తామని మీరు తప్పకుండా ముందుకు వచ్చి పోటీ చేయాలని అన్నారు. ఆర్థికంగా విద్యాపరంగా రాజకీయపరంగా బీసీలు ముందంజలో వస్తే తప్ప మన స్థితిగతులు మారవని మనం ఆర్థికంగా ఎదుర్కోవడానికి అవకాశం రాదని అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ యొక్క జనరల్ స్థానాలలో %దీజ% లు తప్పకుండా పోటీ చేయాలని అన్నారు. ఎర్రగడ్డ పల్లి కృష్ణ,పాలాది శ్రీనివాస్ గుప్తా, శరత్ కుమార్ రెడ్డి, ఘనమని శ్రీనివాస్, ఆనెం ఆంజనేయులు, చిన్న నరసింహులు, వెంకటయ్య, ఆకారం నర్సింలు, కుదుముల యాదయ్య, కుదుముల వెంకటేష్, సవేరా అన్వర్,సుల్తాన్పూర్ వెంకటయ్య, నిరంజన్, విశ్వనాథులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
29 నవంబర్ 2025

# ఏకగ్రీవాలకు ప్రోత్సాహమేదీ?

## రూ.10 లక్షల ప్రోత్సాహమని గత ప్రభుత్వ హామీ




- 2019 నుండి పదవీకాలం ముగిసే 2024 వరకు పైసా ఇవ్వని బీఆర్ఎస్ సర్కారు
- పార్టీలకు అతీతంగా ఏకగ్రీవాలు చేసుకున్న జీపీలకు మొండిచెయ్యే!
- తాజాగా పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలకు ఆసక్తి చూపని వైనం

**పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని అనుకున్న పల్లెలకు చివరికి నిరాశ మిగిలింది. దేశాభివృద్ధిలో పల్లెలే పట్టుకొమ్మలని చెబుతున్న ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమవుతున్నాయి. ఏకగ్రీవమైతే ప్రభుత్వమిచ్చే పారితోషకంతో ఏళ్లుగా పేరుకుపోయిన గ్రామ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావించినా అది ఫలించలేదు. గెలిచిన నెల రోజుల నుంచి ప్రభుత్వ ప్రోత్సాహకాల కోసం ఎదురు చూపులు చూసి, పదవీకాలం ముగిసిపోయింది. సాధరణ ఎన్నికల జరిగి ప్రభుత్వాలు మారినప్పటికి ఏకగ్రీవ గ్రామపంచాయితీలకు మాత్రం మొండిచేయి చూపుతున్నారు. పంచాయితీ ఎన్నికల నగరా మోగిన సందర్భంగా గ్రామల్లో మరొసారి గత ప్రభుత్వం ఇచ్చిన ఏకగ్రీవ గ్రామపంచాయితీలకు ప్రోత్సహల మీద చర్చ సాగుతుంది.**

చాడ వేణుగోపాల్ రెడ్డి (ప్రత్యేక ప్రతినిధి, జనంసాక్షి) :

### అభివృద్ధి కోసం ఏకమైతే....

గ్రామంలో ఐకమత్యాన్ని చాటడంతోపాటు, ఏకగ్రీవం చేసుకొని ప్రభుత్వం నుంచి వచ్చే ప్రొత్సాహకాన్ని గ్రామభివ్రద్ధికి వినియోగించు అవకాశం ఉంటుందని ప్రకటనలు గుప్పించారు గతపాలకులు. గ్రామస్థులంతా ఏకాభిప్రాయంతో సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకొమని చెప్పారు. గ్రామాల్లో రాజకీయ ఉద్రిక్తలను తగ్గించడానికి, గ్రామమంతా ఏకతాటిపై నిలిచి అభివృద్ధి చేసుకునేందుకు ప్రోత్సాహకాన్ని ఇస్తమని హామీ ఇచ్చింది కెసీఅర్ ప్రభుత్వం. 2014లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా రూ. 5 లక్షలు ఇచ్చారు. 2019లో ఎన్నికల్లో ఈ మొత్తాన్ని రూ 10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. పంచాయతీ ఎన్నికలు ముగిసిన ఆరునెలల్లోగా ఈ మొత్తాన్ని విడుదల చేయాల్సి ఉంటుంది. పంచాయతీలకు రెగ్యులర్‌గా వచ్చే నిధులకు అదనంగా వీటిని మంజూరు చేస్తారు. ఈ నిధులను పాలకవర్గ తీర్మానం ప్రకారం ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించింది. పార్టీలకు అతీతంగా గ్రామభివ్రద్ధి కోసం కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయితీలు, అదాయ వనరులు లేని చిన్న పంచాయతీలు పెద్దఎత్తున ఏకగ్రీవాలు అయ్యాయి. ఇలాంటి పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సాహకం ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో గ్రామంలోని సమస్యలు పరిష్కారం అవుతాయని ఏకగ్రీవ గ్రామాల ప్రజలు ఆశించారు.

### పనులు చేయమన్నరు...ఖాళీ చేతులు చూపించారు

| జిల్లా | జీపీలు | ఏకగ్రీవ జీపీలు |
|---|---|---|
| సంగారెడ్డి | 643 | 96 |
| మెదక్ | 469 | 84 |
| సిద్ధిపేట | 499 | 48 |

2019 సంవత్సరం జనవరి నెలలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న మొత్తం 1611 గ్రామ పంచాయతీలకు గాను 228 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలో పెద్దఎత్తున ఏకగ్రీవాలయ్యాయి. సంగారెడ్డిలో 663 గ్రామపంచాయితీలకు 96 , మెదక్ జిల్లాలో 469 జీపీలకు 84, సిద్దిపేట జిల్లాలో 499 జీపీలకు 48 గ్రామపంచాయితీలు ఏకగ్రీవం అయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 228 గ్రామపంచాయితీలు ఏకగ్రీవం అయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏకగ్రీవమైన పంచాయతీలకు రూ.22.8 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది . సాక్షత్తూ సీఎం కెసీఅర్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాతినిధ్యం వహించినప్పటికి ప్రభుత్వం నుండి ప్రోత్సకాల నిధులు విడుదల చేయలేదు. దీంతో ఆయా పంచాయతీలలో పాలకవర్గాల తో పాటు ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి మాత్రం జరగలేదు. ఈ ఐదేళ్లకాలంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి అనుకున్న స్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. కొన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచులు అప్పులు తెచ్చి పనులు చేశారు. పాలకవర్గాలు స్థానిక నేతలు, ఎమ్మెల్యేల ద్వారా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దానికి తోడు ప్రభుత్వం తీసుకొచ్చిన పల్లె ప్రగతి, ప్రకృతి వనాలు వంటి పనులను సర్పంచులకు టార్గెట్ పెట్టి చేయించినట్లు విమర్శలు ఉన్నాయి. సర్పంచ్ లను తమ సొంత డబ్బులతో పనులు చేయించి... బిల్లుల విడుదలలో మాత్రం అధికారులు, ప్రభుత్వం ఖాళీ చేతులు చూపించారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరు ఒకేతాటిపైకి వచ్చి ఏకగ్రీవం చేసుకుంటే డబ్బులు ఖర్చు పెట్టకుండా కొలువుదీరిన పాలకవర్గాలు గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తాయని ప్రజలు భావించారు. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకంతో గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అనుకున్నారు. అయితే అసలుకే ఎసరు వచ్చిందన్నట్లుగా పారితోషకం సంగతి దేవుడెరుగు గ్రామ అభివృద్ధికి నెలనెలా నిధులు విడుదల కాకపోవడంతో గ్రామంలో అభివృద్ధి కుంటు పడిపోయింది. కొన్ని గ్రామాల్లో అయితే పన్నులు వసూలు చేసినా కూడా కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల అభివ్రద్ధికి నిధులివ్వకపోడంపై ఏకగ్రీవ పంచాయతీలలో బిఅర్ఎస్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరిగింది. గ్రామ పంచాయితీల నిధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో గ్రామ పాలకవర్గాలు ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రోత్సాహక నిధుల విడుదలో బిఅర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఎన్నికల్లో ప్రభావం చూపి ..గ్రామీణ ప్రాంతాల్లో బిఅర్ఎస్ పార్టీ ఓటమికి ఒక కారణంగా మారింది. పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలనప్పటికి... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవ గ్రామపంచాయితీలకు ప్రోత్సహకల విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదు.

# దుబాయ్ తేజస్ ఘటన దురదృష్టకరం

- యధావిధిగా భవిష్యత్ ప్రణాళికలు
- హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్ డీకే సునీల్



**బెంగళూరు, నవంబర్ 28 (జనంసాక్షి) :** దుబాయ్ ఎయిర్ షో చివరి రోజున భారత యుద్ధ విమానం తేజస్ కూలిపోవడాన్ని దురదృష్టకర సంఘటనగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ అభివర్ణించారు. ఈ సంఘటన తేజస్ కార్యక్రమం భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపదని ఆయన స్పష్టం చేశారు. తాజాగా నిర్వహించిన జాతీయ భద్రతా సదస్సులో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేజస్ యుద్ధ విమానంలో ఎటువంటి లోపాలు లేవని ఆయన వెల్లడించారు. జాతీయ భద్రతా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. తేజస్‌లో ఎటువంటి సమస్యలు లేవు. ఈ వేదిక నుంచి, ఇది అద్భుతమైన యుద్ధ విమానం అని నేను ప్రకటిస్తున్నాను. ఇది పూర్తిగా సురక్షితమైనది. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా రికార్డును కలిగి ఉందని ఆయన వెల్లడించారు. దుబాయ్‌లో తేజస్ విమానం కూలిపోవడం దురదృష్టకరమని, ఈ ప్రమాదం తేజస్ భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. తేజస్ యుద్ధ విమానం విదేశీ గడ్డపై కూలిపోవడం ఇదే తొలిసారి. అయితే ఈ ఫైటర్ జెట్ ఇప్పటి వరకు రెండుసార్లు మాత్రమే కూలిపోయింది. ఒక దేశం ముందుకు సాగుతూ.. దాని సొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినప్పుడు, అది అనేక దశలను దాటవలసి ఉంటుందని ఆయన అన్నారు. నేడు మేము ఈ 4.5-తరం విమానాన్ని కొత్త సామర్థ్యాలతో అభివృద్ధి చేసామని, ఇది భారీ విజయం అని వెల్లడించారు. ప్రస్తుతం మా దగ్గర 180 తేజస్ విమానాలు ఉన్నాయి, భవిష్యత్తులో ఈ సంఖ్య పెరుగుతుంది. ఈ విమానానికి ప్రపంచ వ్యాప్తంగా రక్షణ రంగంలో పెద్ద ఎగుమతి మార్కెట్ కూడా ఉంటుందని ఆయన అన్నారు. భవిష్యత్తు ఆర్డర్ల గురించి ఆయన మాట్లాడుతూ.. అన్‌మ్యాన్డ్ కంబాట్ ఏరియల్ వెహికల్ త్వరలో పూర్తవుతుందని అన్నారు. ఇవి 2026 నాటికి సిద్ధంగా ఉంటాయని, 2027 నాటికి ఆకాశంలో ఎగురుతాయని వెల్లడించారు.

# బడి పిల్లలకు పురుగుల అన్నమా?

- ఘటనపై మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళు అని డబ్బా కొట్టుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పురుగుల అన్నం పెట్టడమేంటని మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై తానే సమీక్ష చేస్తానన్న మాటలేమయ్యాయని ప్రశ్నించారు. 'విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకే అన్న బెదిరింపులేమయ్యాయి? రెండేళ్లలో మీ వద్దనే ఉన్న విద్యాశాఖపై ఎన్ని సార్లు సమీక్షలు చేసారు? విద్యార్థులకు కల్తీ ఆహారం పెడుతున్న ఎంత మందిని జైలుకు పంపారు? మీ మాటలకు విలువ లేదు, ఆచరణకు దిక్కులేదు. బడిలో చదువుకోవాల్సిన విద్యార్థులు.. పురుగులన్నం మాకొద్దు అని రోడ్లెక్కి నిలదీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా అసలు నువ్వేం చేస్తున్నట్లు? చిల్లర మాటలు.. చీప్ పాలిటిక్స్ స్కీంలు లేవుగానీ.. ఎందులో చూసినా స్కాంలు అందిన కాడికి దండుకునే ప్లాన్లు.. వాటాలు, కమీషన్ల కోసం మీటింగులు ఇదే కదా 23నెలలుగా నువ్వు చేస్తున్నది రేవంత్ రెడ్డి? బడి పిల్లలకు సరిగ్గా అన్నం పెట్టలేని ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి ఉండి ఏం లాభం? కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు పురుగులన్నం పెట్టిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి' అని డిమాండ్ చేశారు.

## అయ్యప్పస్వాములు ఇరుముడితో ప్రయాణానికి ఓకే

- ఎయిర్‌పోర్ట్ అథారిటీ అనుమతి

**న్యూఢిల్లీ, నవంబర్28 (జనంసాక్షి) :** అయ్యప్ప స్వామి భక్తులకు ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శుభవార్త తెలిపింది. శబరిమలకు వెళ్లే మాలధారులు విమానాల్లో 'ఇరుముడి' తో ప్రయాణించొచ్చని తాజాగా వెల్లడించింది. విమానంలో కొబ్బరికాయలను స్వాములు తమ వెంట తీసుకెళ్లొచ్చని చెప్పింది. అయ్యప్ప స్వాముల నుంచి వచ్చిన వినతుల మేరకు, వారి సౌకర్యార్థం నిబంధనలను సడలించామని ఏఏఐ పేర్కొంది. ఈ నిబంధన అక్టోబర్ 28 శుక్రవారం నుంచి అమల్లోకి వస్తుందని ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఈ నిబంధనల సడలింపు అనేది వచ్చే ఏడాది జనవరి 20 వరకు అమలులో ఉంటుందని తెలిపింది. అయ్యప్ప స్వాముల ప్రయాణం సాఫీగా, సేఫ్‌గా జరగడానికి కొబ్బరికాయలను క్యాబిన్‌లోకి తీసుకెళ్లే ముందు ఎక్స్ రే, ఎక్స్‌ప్లోజివ్ ట్రేస్ డిటెక్షన్ (ఈటీడీ), భౌతిక తనిఖీలు ఉంటాయని పేర్కొంది.

# కెసిఆర్ దీక్ష చేసినప్పుడు మీరంతా ఏమయ్యారు

- విమర్శకులకు మాజీమంత్రి తలసాని విసుర్లు




**హైదరాబాద్, నవంబర్28 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మీద అవాకులు చవాకులు పేలినంత మాత్రాన ఆయన చరిత్ర మారదని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ స్పష్టం చేశారు. 2009 నవంబర్ 29వ తేదీన నాటి టీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్ష ఒక చరిత్ర అని ఆయన అభివర్ణించారు. ఈ దీక్షపై పలువురు సోయి లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కొత్త బిచ్చగాళ్లు పొద్దు ఎరగరు అన్నట్లుగా కొంత మంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ప్రత్యేక రాష్ట్రం రాకుంటే.. కాంగ్రెస్ పార్టీ ఎక్కడిది?.. తెలంగాణ ప్రభుత్వం ఎక్కడి దంటూ ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలను తలసాని శ్రీనివాసయాదవ్ సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బతుకమ్మ పేరుతో ఆనాడు తమ ప్రభుత్వం చీరలు పంచితే.. ప్రస్తుతం ఇందిరమ్మ చీరలంటూ పేరు మార్చారని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ చీరలు పంపిణీకి కేసీఆర్ తన పేరు పెట్టుకోలేదని గుర్తు చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ దీక్షా దివాస్‌ను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి తలసారి స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్ర తెలియని వాళ్ళు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ళు.. తెలంగాణ ఏర్పాటు చేసే సమయంలో ఎక్కడున్నారంటూ? ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించకుంటే.. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ళకి పదవి ఎక్కడిదని కాంగ్రెస్ పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చారని నిండు అసెంబ్లీలోనే కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వాళ్ళ లాగా మూర్ఖుల్లా తాము మాట్లాడమని తలసాని శ్రీనివాసయాదవ్ స్పష్టం చేశారు.

# చిరంజీవి ట్రస్ట్‌కు విదేశీ విరాళాలు

## కేంద్రం అనుమతి లభ్యం

**హైదరాబాద్, నవంబర్28 (జనంసాక్షి) :** మెగాస్టార్ చిరంజీవి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు మరో అవకాశం చిక్కింది. చెప్పనవసరం లేదు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వేలాది మందికి ఆయన సహాయం అందించారు. అయితే ఆయన సేవాగుణం నుంచే ఉద్భవించినదే 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్'. దాదాపు 27 ఏళ్లుగా ఈ సంస్థ ద్వారా బ్లడ్ అండ్ ఐ బ్యాంక్ సేవలతో ఎంతో మంది రక్తం, నేత్రాలు పొంది పునర్జీవనం పొందుతున్నారు. కరోనా సమయంలో కూడా ఈ ట్రస్ట్ విశేష సేవలను అందించింది. తాజాగా చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఒక శుభవార్తను ప్రకటించింది. చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఎఫ్‌సీఆర్ఏ కింద నమోదు చేసుకునేందుకు కేంద్ర హోంశాఖ అవకాశం కల్పించింది. దీనిద్వారా ఈ ట్రస్ట్ ఇకపై విదేశాల నుంచి కూడా విరాళాలు తీసుకునే వెసులుబాటును పొందింది. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం 2010 ప్రకారం ఎఫ్‌సీఆర్ఏ అనుమతి తప్పనిసరి చేయడంతో, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ చేసుకున్న అప్పీల్‌కు ప్రస్తుతం అనుమతి లభించింది.

## ఏసీబీకి చిక్కిన తహసీల్దార్




**పెద్దవంగర, నవంబర్28 (జనంసాక్షి) :** భూ భారతి రికార్డుల్లో పేరును నమోదు చేయడానికి లంచం తీసుకుంటూ తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామ శివారులోని పడమటి తండా గ్రామపంచాయతీకి చెందిన భూక్యా బాలు అనే రైతు తన తండ్రి మరణించారు. భూక్యా స్వామి మృతి చెందడంతో తండ్రిపేరు మీద ఉన్న భూమిని తన పేరు మీద భూ భారతి రికార్డుల్లో నమోదు చేయించుకోవడానికి తహసీల్దార్ వీరగంటి మహేందర్‌ను కలిశాడు. రూ.25వేల లంచంను డిమాండ్ చేశారు. దీంతో చేసేది లేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు శుక్రవారం 15 వేల రూపాయలు ఇస్తూ శుక్రవారం ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

# తెనాలి మధుర స్మృతులు ఎన్నటికీ మరువలేనివి

- భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**తెనాలి, నవంబర్ 27 (జనంసాక్షి) :** గడచిన ఐదు దశాబ్దాల కాలంలో వేరువేరు సందర్భాల్లో ఆంధ్ర ప్యారిస్‌గా కీర్తి పొందిన తెనాలిలో గడిపిన క్షణాలు, ఇక్కడ వ్యక్తులతో పెను వేసుకున్న సాన్నిహిత్యం జీవితంలో ఎన్నటికీ మరువలేనివని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. తెనాలి తో తనకు గల అనుబంధాన్ని ఒకసారి గుర్తు చేసుకున్నారు. పట్టణంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం ఎక్కడికి వచ్చిన వెంకయ్య నాయుడు ముందుగా మాజీ మంత్రి ఎడ్లపాటి వెంకట్రావు ఇంటికి వచ్చిన సందర్భంగా సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. 1980 నుంచి తెనాలిలో ఆంధ్ర పత్రిక విలేకరిగా, పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో తెలుగు పండిట్ గా తాను పనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా నిమ్మరాజు గుర్తు చేశారు. ఆ సమయంలో వెంకయ్య నాయుడు బిజెపి ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షునిగా అనేకమార్లు తెనాలిలో పర్యటించారని అన్నారు. 1977 పార్లమెంటు ఎన్నికల్లో జనతా పార్టీ ఒంగోలు అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో తొలిసారిగా తన స్వస్థలమైన అమ్మనబ్రోలు వచ్చినప్పుడు వెంకయ్య నాయుడు తొలిసారి తనకు పరిచయమైనారని అప్పటినుంచి నేటి వరకు ఎంతో స్నేహపూర్వకంగా ఆత్మీయంగా తమ పరిచయం కొనసాగుతోందని చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడుని కలిసిన వారిలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ మంత్రులు నన్నపనేని రాజకుమారి, మండలి బుద్ధ ప్రసాద్, డాక్టర్ కామినేని శ్రీనివాస్, టొబాకో బోర్డు మాజీ చైర్మన్ ఎడ్లపాటి రఘునాథ బాబు దంపతులు, తదితరులున్నారు.

# బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

- 42శాతం రిజర్వేషన్ల పేరుతో మోసం
- కామారెడ్డి డిక్లరేషన్ తుంగలో తొక్కిన అధికార పార్టీ
- బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శ



**హనుమకొండ, నవంబర్28 (జనంసాక్షి) :** బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లపై వెనక్కి తగ్గినందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన డిమాండ్ చేశారు. తమకు అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు కత్తులు నూరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లో పూర్తి వ్యతిరేకత ఉందని.. ఇక, భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు గెలిచే అవకాశమే లేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి జరగాలంటే భాజపాతోనే సాధ్యం. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం సరిగా చేయలేదు. కుల ధ్రువీకరణ పత్రం కోసం సర్వర్లు పని చేయక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది. బీసీ రిజర్వేషన్లపై డ్రామాలాడింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ఈటల తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులకు గుర్తులు ఉండవని.. గెలిచిన వారిని కాంగ్రెస్ నుంచి గెలిచారని చెప్పుకుందామని భావిస్తున్నారేమో అంటూ సందేహం వ్యక్తం చేశారు. కానీ కాంగ్రెస్ చేసిన మోసానికి బీసీలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని...హామీ ఇచ్చేటప్పుడు తెలియదా? అంటూ అధికార పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. బీసీల జనాభా ఎంతో తేల్చకుండా రిజర్వేషన్లు ఎలా చేస్తారంటూ కాంగ్రెస్ సర్కారును ఆయన సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నాడు బీఆర్ఎస్ భూములు లాక్కున్నట్టే నేడు కాంగ్రెస్ పార్టీ లాక్కుట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ భూ కుంభకోణాల కు హద్దు లేదు.. దీనికి మూల్యం చెల్లించక తప్పదంటూ ఎంపీ ఈటల హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోనే అధిక భూములు లాక్కుంటున్నారంటూ సోదాహరణగా వివరించారు. భూముల కోసమే జీహెచ్ఎంసీ పరిధి విస్తరించినట్లు అయితే.. దాని కంటే దరిద్రం ఇంకోటి లేదని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370